అమరవీరులకు అరుణాంజలి
రూ॥ 220/-
పేజీలు: 230

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

ఉక్రేన్ – గాజాలలో శాంతికి పోప్ లియో పిలుపు

శ్రీలంకలో బస్సు ప్రమాదం 21 మంది మృతి

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 162 | సోమవారం | 12-05-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00

# పిఓకెను తిరిగి ఇవ్వాల్సిందే

- జమ్మూకశ్మీర్ వివాదంలో మధ్యవర్తిత్వం లేదు
- మాటలంటూ ఉంటే పిఓకే గురించి మాత్రమే
- వాళ్ళ సైనిక జనరల్ ద్వారానే ఇకమీదట చర్చలు
- కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడి



**న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీరుకు సంబంధించిన వివాదంలో మధ్యవర్తిత్వాన్ని భారతదేశం తిరస్కరించిందని కేంద్ర ప్రభుత్వ వర్గాలు ఆదివారం నాడు చెప్పాయి. కశ్మీరు విషయంలో ఎప్పటికీ మధ్యవర్తిత్వాన్ని భారత్ ఆశించదని, పాకిస్థాన్ దురాక్రమణ చేసిన కశ్మీరు భూభాగాన్ని భారత్‌కు తిరిగి ఇవ్వాల్సిందేనని వర్గాలు తెలిపాయి. ఇక మాటలంటూ ఉంటే పాకిస్థాన్ ఆక్రమించిన భూభాగాన్ని తిరిగి భారత్‌కు అప్పగించడం గురించి మాత్రమేననీ, ఈ విషయంలో భారత ప్రభుత్వం చర్చలకు సిద్ధంగా ఉందని వర్గాలు తెలిపాయి. పాకిస్థాన్‌తో డిజిఎంఓ (డైరెక్టర్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్) ద్వారా మాత్రమే ఆ దేశంతో చర్చలు ఉంటాయని ప్రభుత్వ వర్గాలు ఢిల్లీ మీడియాకు చెప్పాయి. ఆపరేషన్ సిందూర్ ఇంకా పూర్తి కాలేదని వర్గాలు తెలిపాయి. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని ప్రతిఘటించడానికి గతం కంటే భిన్నంగా, అసాధారణ ప్రతిఘటన ఉంటుంది, సరిహద్దుల్లో తరువాయి 2లో

## కశ్మీరుపై మధ్యవర్తిత్వం చేస్తాం : ట్రంప్

### పాకిస్థాన్ హర్షం : భారత్ తిరస్కృతి

కశ్మీరు సమస్యపై మధ్యవర్తిత్వం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చెప్పారు. ట్రంప్ సంసిద్ధతను పాకిస్థాన్ వెంటనే ఆ హ్వానించి హర్షం ప్రకటించగా, భారతదేశం మాత్రం ఈ విషయంలో మధ్యవర్తిత్వానికి అవకాశం లేదని తోసిపుచ్చింది. ఇరు దేశాలు ద్వైపాక్షికంగానే సమస్యలు పరిష్కరించుకుంటామని, చర్చల ద్వారా పరిష్కరించుకుంటామని భారత్ తెలిపింది. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య కుదిరిన కాల్పుల విరమణ అవగాహనను ఆదివారం ఉదయం ట్రంప్ ప్రశంసించారు. ఈ అవగాహన కుదరకపోయి ఉంటే లక్షలమంది రెండు తరువాయి 2లో




# పర్యవసానాలు రుచిచూపించాం

- ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్
- 100 మంది ఉగ్రవాదులు హతం
- పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5, పాక్‌లోని 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేశాం
- మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35-40 మంది పాకిస్థాన్ సైనికులు మృతి
- మీడియా సమావేశంలో త్రివిధ దళాలు వెల్లడి

**న్యూఢిల్లీ :** భారత వాయుసేన, క్షిపణి రక్షణ వ్యవస్థలతో పాక్‌కు స్పష్టమైన సందేశం ఇచ్చాం. పాక్ దుస్సాహసానికి పాల్పడితే ఎలాంటి పర్యవసానాలు ఎదురవుతాయో చూపించాం. సైన్యం, వాయుసేన చర్యలకు అనుబంధంగా అరేబియా సముద్రంలో నౌకాదళం సర్వసన్నద్ధంగా ఉంది. కశ్మీర్ నుంచి గుజరాత్ వరకు సరిహద్దు నగరాలపై డ్రోన్ దాడులకు యత్నించింది. గుంపులు గుంపులుగా డ్రోన్లతో దాడులకు యత్నించింది' అని త్రివిధ దళాల అధికారులు పేర్కొన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌ను పాక్ సైన్యం దాటలేదని భారత త్రివిధ దళాలు స్పష్టంచేశాయి. ఆపరేషన్ సమయంలో లక్ష్యాలను ఛేదించడంపైనే గురి ఉంటుందని పేర్కొన్నాయి. అయితే, ఆపరేషన్ సిందూర్ సమయంలో ఐదుగురు జవాన్లు అమరులయ్యారని, అమర జవాన్ల త్యాగాలను దేశం ఎన్నటికీ మరచిపోదని తెలిపాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసే లక్ష్యంతోనే ఆపరేషన్ సిందూర్ చేపట్టామని భారత సైన్యం వెల్లడించింది. తాము చేపట్టిన ఆపరేషన్‌లో 100 మంది ఉగ్రవాదులు హతమయ్యారని తెలిపింది. దాడుల భయంతో ఉగ్రశిబిరాలు ఖాళీ అవుతున్నాయని పేర్కొంది. పహల్గాంలో 26 మంది అమాయకులను ముష్కరులు పొట్టనపెట్టుకున్నారని భారత సైన్యం వెల్లడించింది. ఆపరేషన్ సిందూర్‌కు సంబంధించి త్రివిధ దళాల అధికారులు మీడియా సమావేశంలో కీలక వివరాలు వెల్లడించారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో 5, పాక్‌లోని 4 ఉగ్ర శిబిరాలను నేలమట్టం చేసినట్లు తెలిపింది.

**పాకిస్థాన్ వణికిపోయింది: రాజీవ్ ఘాయ్**

'పహల్గాం దాడి తర్వాత ఉగ్రవాదులకు దీటుగా బదులివ్వాలని నిర్ణయించాం. ఉగ్రవాదులకు సరైన రీతిలో జవాబు తరువాయి 2లో

భారత్–పాకిస్థాన్ దేశాలకు చెందిన డిజిఎంఓల సమావేశం సోమవారం–నాడు జరుగుతుంది. రెండు దేశాల డిజిఎంఓలు ఈనెల పదోతేదీన మధ్యాహ్నం టెలిఫోన్ సంభాషణ చేశారు. రెండోసారి సమావేశం సోమవారం జరుగుతుందని లెఫ్టినెంట్ జనరల్ రాజీవ్ ఘాయ్ చెప్పారు. రెండు దేశాలమధ్య శనివారం కుది–రిన అవగాహన ఒప్పందం దీర్ఘకా–లంగా ఏ విధంగా అమలు చేయాలి, ఏ విధంగా దానిని చెల్లుబాటులో ఉంచుతారు, ఏ విధంగా అమలు చేస్తారన్న విషయాలను పాకిస్థాన్ డిజి–ఎంఓతో తాము చర్చిస్తామన్నారు.

అమెరికా ఆధిపత్యవాదానికి

## ఎందుకు అవకాశమిచ్చారు?

మోదీ ప్రజలకు సమాధానం చెప్పాల్సిందే

నిలదీసిన సిపిఐ

**న్యూఢిల్లీ:** భారత్–పాకిస్థాన్ దేశాలు కాల్పుల విరమణకు అంగీకరించిన ప్రకటనను మనదేశానికంటే ముందుగానే అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఎలా చేశారని ప్రధానమంత్రి నరేంద్రమోదీని భారత కమ్యూనిస్టుపార్టీ (సిపిఐ) నిలదీసింది. ఇది ఒకరకంగా భారత ఉపఖండంలో, దక్షిణాసియావ్యవహారాల్లో అమెరికా ఆధిపత్యవాదానికి తలుపులు తెరచినట్లవుతుందని, ఈ అవకాశం ఎందుకు ఇచ్చారని ప్రశ్నించింది. భారత్–పాకిస్థాన్ రెండు దేశాలూ చిత్తశుద్ధితో కాల్పుల తరువాయి 2లో

ఆపరేషన్ సిందూర్, కాల్పులు విరమణ ఒప్పందంపై

## చర్చ జరగాలి

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయండి

ప్రధాని మోదీకి రాహుల్‌గాంధీ, ఖర్గే లేఖలు



**న్యూఢిల్లీ :** పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, సరిహద్దు కాల్పులకు సంబంధించి తాజా పరిణామాలను చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని వెంటనే నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు లోక్‌సభ, రాజ్యసభలోని తరువాయి 2లో

## ఇంజనీరింగ్ విభాగంలో మొదటి పది ర్యాంకులూ బాలురవే

పల్లా భరత్ చంద్రకు మొదటి, రామచరణ్ రెడ్డికి రెండవ ర్యాంకు

ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో సాకేత్‌రెడ్డికి ప్రథమ, లలిత్ వరేణ్యకు ద్వితీయ ర్యాంకు

ఎప్‌సెట్ ఫలితాలు విడుదల చేసిన ముఖ్యమంత్రి




ప్రజాపక్షం/హైదరాబాద్


జవహర్‌లాల్ నెహ్రూ టెక్నోలాజికల్ యూనివర్సిటీ, హైదరాబాద్ (జెఎన్‌టియుహెచ్) నిర్వహించిన 'ఎప్‌సెట్' ఫలితాల్లో ఇంజనీరింగ్ విభాగంలో పది ర్యాంకులలో బాలురు ఉత్తీర్ణులయ్యారు. ఎపిలోని పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడకు చెందిన పల్లా భరత్ చంద్ర మొదటి ర్యాంకు సాధించగా, రంగారెడ్డి జిల్లా తరువాయి 2లో

ఉక్రేన్‌తో ప్రత్యక్ష చర్చలకు

## పుతిన్ సంసిద్ధత


15న ఇస్తాంబుల్‌లో సమావేశం

ముందస్తు షరతులు లేవు



**మాస్కో :** ఉక్రేన్‌తో శాంతి చర్చలకు ఎట్టకేలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్ అంగీకరించారు. ఐతే ఉక్రేన్ మాత్రం ముందుగా కాల్పుల విరమణ చేపడితేనే తాము చర్చలకు సిద్ధమని స్పష్టంచేసింది. యుద్ధానికిగల మూలకారణాలపై ముందుగా చర్చించాలనీ, ఆ తర్వాత కాల్పుల విరమణపై చర్చలు జరుగుతాయని రష్యా విదేశాంగమంత్రిత్వశాఖ ఆ తర్వాత పుతిన్ ప్రకటనకు పూర్తి వివరణ తెలియజేసింది. ఎలాంటి ముందస్తు షరతులూ లేకుండా ఈనెల 15వ తేదీ గురువారంనాడు ఇస్తాంబుల్‌లో రెండు దేశాల మధ్య తరువాయి 12లో





# ప్రపంచం
WORLD NEWS

## డియర్ ఫ్రెండ్ చైనా..
### షెహబాజ్ షరీఫ్ ప్రత్యేక కృతజ్ఞతలు

**ఇస్లామాబాద్ :** భారత్–పాకిస్థాన్ మధ్య శాంతి చర్చల్లో కీలకపాత్ర వహించిన చైనా, అమెరికా, సౌదీ అరేబియా తదితర దేశాలకు పాకిస్థాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ కృతజ్ఞతలు తెలియజేశారు. చైనాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ''మైడియర్ ఫ్రెండ్ చైనాకు నా ప్రత్యేక కృతజ్ఞతలు, 78 సంవత్సరాల పాకిస్థాన్ చరిత్రలో ఎప్పుడు ఏ అవసరం వచ్చినా నేనున్నానంటూ స్నేహ హస్తం అందించే చైనాకు మా ప్రత్యేక కృతజ్ఞతలు'' అని తెలియజేశారు. ఎంతో చిత్తశుద్ధితో శాంతికోసం నిర్మాణాత్మకమైన పాత్ర వహించారని అన్నారు. ''చైనాను వెరీ డియర్, వెరీ డియర్, అత్యంత విశ్వసనీయమైన మిత్రుడు'' అని షరీఫ్ అభివర్ణించారు. రెండు దేశాలమధ్య చారిత్రక సంబంధాలు ఉన్నాయని, ఈ వాస్తవాలను గుర్తుంచుకోవాలన్నారు. అదేవిధంగా భారతదేశంతో సింధు జలాల నీటి సమస్య, కశ్మీరు సమస్య, ఇతర వివాదాస్పద సమస్యలన్నీ పరిష్కారం అవుతాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.

## ఉక్రేన్–గాజాలలో శాంతికి పోప్ లియో పిలుపు
### బందీలను విడుదల చేయాలని విజ్ఞప్తి



**వాటికన్ సిటీ :** ఉక్రేన్, గాజాలలో శాంతి పాటించాలని, యుద్ధాలు విరమించాలని కొత్తగా ఎన్నికైన రోమన్ క్యాథలిక్ మతగురువు పోప్ లియో–14 పిలుపు ఇచ్చారు. గాజాలో బందీలుగా ఉన్న ఇజ్రాయెల్ పౌరులను, ఇతర విదేశీ పౌరులను వెంటనే విడుదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పోప్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొట్టమొదటి ఆదివారంనాడు జరిగిన ప్రార్థనల సందర్భంగా లియో–14 ప్రజలకు తొలి శాంతి సందేశం ఇచ్చారు. గాజాలో శాంతి సాధనకు వీలుగా ముందు, అక్కడి ప్రజలకు ఆహారం సరఫరా చేయాలని, వారికి కడుపునిండా అన్నం పెట్టాలని కోరారు. ''మళ్ళీ మనకు యుద్ధం వద్దు'' అని సెయింట్ పీటర్స్ బాసిలికా నుండి ఆయన సందేశం ఇచ్చారు. 80 సంవత్సరాల క్రితం ముగిసిన రెండవ ప్రపంచ యుద్ధకాలంనాటి పరిస్థితులను ఆయన ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. ఈ యుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక యుద్ధాలు జరిగాయన్నారు. ఇక మళ్ళీ భూగోళంపై వివాదాలు ముదిరి ఘర్షణలు వస్తే అది మూడో ప్రపంచ యుద్ధానికి దారితీస్తుందని ఆయన హెచ్చరించారు. అమెరికాకు చెందిన మొట్టమొదటి పోప్ లియో మాతృదినోత్సవాన్ని కూడా గుర్తుచేశారు. ప్రపంచవ్యాప్తంగా తల్లులందరికీ తన అభినందనలు తెలియజేశారు. స్వర్గంలో ఉన్న తల్లులకు కూడా ''హ్యాపీ మదర్స్ డే'' అని చెప్పారు. పోప్ పదవికి తాను అనర్హుడనని తనకుతాను ప్రకటించుకుంటూ ఆ వారసత్వాన్ని విజయవంతంగా ముందుకు తీసుకువెళతానన్నారు. 19వ శతాబ్దంనాటి పోప్ లియో సామాజిక న్యాయం కోసం పోరాటం చేశారని, ఆయన స్మృత్యర్థం ఆ పేరునే తాను లియో–14గా ఎంపిక చేసుకుని పెట్టుకున్నాననీ వివరణ ఇచ్చారు. మిషనరీ కార్యకలాపాలకు తాను ఎక్కువ ప్రాధాన్యం ఇస్తానన్నారు. మానవ సమాజ గౌరవ మర్యాదలను కాపాడేందుకు వీలుగా వాటికన్ సిటీ కూడా కృత్రిమ మేధ వంటి ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానాన్ని సంతరించుకోవాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇంతకుముందు పోప్ ఫ్రాన్సిస్ అర్జెంటీనాకు చెందినవారు. ఇప్పుడు పోప్ లియో అమెరికాకు చెందినవారు. గనుక వాటికన్ సిటీ మాత్రం పోప్ లియోను అమెరికా నుండి వచ్చిన మొదటి పోప్‌గా కాకుండా రెండవ పోప్‌గా పరిగణిస్తున్నది. పోప్ తొలి సందేశం సందర్భంగా వాటికన్ సిటీలో ప్రజలు ప్రత్యేక బ్యాండ్ వాయిజ్యాలతో ప్రదర్శన చేశారు. గురువారంనాడు రాత్రి పోప్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత లియో–14 మొదటి ఆదివారంనాడు పవిత్ర సందేశం ఇవ్వడం వాటికన్‌సిటీలో ఎంతో ప్రాధాన్యత సంతరించుకుంది.

## ఇరాన్–అమెరికా నాలుగోవిడత చర్చలు

**దుబాయ్ :** ఇరాన్–అమెరికా మధ్య నాలుగో విడత చర్చలు ఓమన్‌లో ఆదివారంనాడు ప్రారంభమయ్యాయి. రెండు దేశాల మధ్య పరోక్ష చర్చలకు ఒమన్ విదేశాంగ మంత్రి బద్ర్ అల్–బుసైదీ ఈ రెండు దేశాలకూ మధ్యవర్తిగా వ్యవహరిస్తున్నారు. ఈ చర్చలు అటు ప్రత్యక్షంగా, ఇటు పరోక్షంగా రెండు పద్ధతులలోనూ జరుగుతాయని అమెరికా తరపున ప్రతినిధులు ఆశిస్తున్నారు. రెండు దేశాల ప్రతినిధులూ చెరో గదిలోనూ కూర్చుని ఉంటే వారి అభిప్రాయాలను వీరికీ, వీరు చెప్పిన అభిప్రాయాలను వారికీ ఒమన్ విదేశాంగ మంత్రి చేరవేస్తూ ఉంటారు. ఈవిధంగా రెండు దేశాల ప్రతినిధులు పరోక్ష చర్చలు జరుపుతారు. అమెరికాతో ప్రత్యక్ష చర్చలకు ఇరాన్ దేశం మొదటినుండీ తిరస్కరిస్తూ వచ్చింది. ఇరాన్ వద్ద అణుబాంబులు ఉండకూడదని అమెరికా స్పష్టంగా చెబుతున్నది. కానీ ఇరాన్ తన అణు కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళుతోందని, దీనిని అడ్డుకునేందుకు మరింత మెరుగైన ఒప్పందం చేసుకోవాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆశిస్తున్నారు. చర్చలకు లొంగకపోతే బలప్రయోగం చేస్తామని కూడా ఇరాన్‌కు ట్రంప్ పదే పదే హెచ్చరికలు కూడా జారీ చేశారు. ఈ నేపథ్యంలో రెండు దేశాలమధ్య నాలుగోవిడత చర్చలు జరుగుతున్నాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, అమెరికా మధ్యప్రాచ్య ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కాఫ్ చర్చల్లో పాల్గొంటున్నారు. విద్యుత్ అవసరాలకు మించినస్థాయిలో ఇరాన్ యురేనియంను శుద్ధిచేస్తోందని అమెరికా ఆందోళన వ్యక్తం చేస్తున్నది.



## శ్రీలంకలో బస్సు ప్రమాదం 21 మంది మృతి

**కొలంబో :** శ్రీలంకలో ఆదివారం జరిగిన బస్సు ప్రమాదంలో 21 మంది మరణించారు. 35 మందికిపైగా ప్రయాణికులు గాయపడ్డారని పోలీసులు చెప్పారు. ఒక కొండచరియ అంచుల నుండి వెళుతున్న ప్రభుత్వ బస్సు ఉదయం లోయలో పడిపోయింది. నువారా ఎలియా–గంపోలా ప్రధాన రహదారిపై శ్రీలంక ట్రాన్స్‌పోర్ట్ బోర్డ్ బస్సు వెళుతుండగా ఈ ఘటన జరిగింది. ఈ బస్సు కతరనాగ నుండి కురునెగల వెళుతోందని పోలీసులు చెప్పారు. కొండలపై ప్రయాణం చేస్తున్న బస్సు ఎడమవైపు టర్నింగ్ తీసుకునేందుకు బస్సు డ్రైవరు ప్రయత్నించిన సమయంలో ప్రమాదం సంభవించింది. సుమారు 75 మంది యాత్రికులు ఈ బస్సులో ప్రయాణం చేస్తున్నారు. శ్రీలంకలో ఇలాంటి ఘోరమైన రోడ్డు ప్రమాదాలు అత్యంత సహజమైన విషయంగా మారాయి.

## సుంకాలపై అమెరికా–చైనా రెండో దశ చర్చలు

**జెనీవా :** సుంకాలపై అమెరికా–చైనా మధ్య రెండో విడత చర్చలు ఆదివారం నాడు తిరిగి మొదలయ్యాయి. మొదటి విడత చర్చల్లో ఎలాంటి పురోగతి లేదు. కానీ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాత్రం చర్చల్లో బ్రహ్మాండమైన పురోగతి సాధించామన్నారు. ఈ విషయంలో చైనా, అమెరికా భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేశాయి. ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో రాస్తూ, బ్రహ్మాండమైన పురోగతి వచ్చిందన్నారు. కానీ చైనా మాత్రం దీనిపై ఎలాంటి వ్యాఖ్యలూ చేయలేదు. ఈ చర్చల ద్వారా ప్రపంచ మార్కెట్లను స్థిరీకరించే ప్రయత్నం చేస్తున్నామని పేరు చెప్పడానికి ఇష్టపడని అమెరికా ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. సుంకాలయుద్ధం వల్ల ప్రపంచవ్యాప్తంగా మాంద్యం పరిస్థితులు, స్టాక్ మార్కెట్లలో తీవ్ర అస్థిరత ఏర్పడటంతో అనివార్యంగా రెండు దేశాలూ చర్చలకు సిద్ధపడ్డాయి. ఈ సుంకాలను 145 శాతం నుండి 80 శాతానికి తగ్గిస్తామని ట్రంప్ చర్చలకు ముందుగా ప్రతిపాదించారు.

## ఇజ్రాయెల్ దాడిలో పదిమంది మృతి

**గాజా :** గాజాలో ఇజ్రాయెల్ చేసిన దాడుల్లో ఆదివారంనాడు పదిమంది పాలస్తీనియన్లు మరణించారు. వీరిలో ఎక్కువమంది పిల్లలు, మహిళలే ఉన్నారు. ఖాన్ యూనిస్‌లో రెండుచోట్ల ఇజ్రాయెల్ దాడులు చేసింది. కేవలం హమాస్ ఉగ్రవాద కేంద్రాలపైన మాత్రమే తాము దాడులు చేశామని ఇజ్రాయెల్ చెప్పింది. మార్చి రెండో తేదీ నుండి గాజాలోకి ఎలాంటి ఆహార సరఫరాలు రానివ్వకుండా ఇజ్రాయెల్ అడ్డుకోవడంతో పాలస్తీనా ప్రజలు కరువుతో అల్లాడుతున్నారు. దాదాపు 3000 వాహనాలు గాజా వెలుపల ఆగిపోయాయి. వాటిని ఇజ్రాయెల్ సైన్యం లోనికి పంపడంలేదు.

## ఉక్రేన్‌పై రష్యా యుద్ధం పునఃప్రారంభం

**మాస్కో :** నాజీ నియంత హిట్లర్‌పై రెండవ ప్రపంచ యుద్ధంలో విజయం సాధించిన రష్యా మే 9వ తేదీన 80వ విజయోత్సవ వేడుకలు చేసుకోవడం కోసం ఈనెల ఎనిమిదో తేదీ నుండి పదో తేదీ వరకూ ఉక్రేన్‌లో కాల్పుల విరమణ పాటించింది. రష్యాలో విజయోత్సవ వేడుకలు విజయవంతంగా జరిగాయి. ఆ మరునాడే పదకొండవ తేదీన ఆదివారంనాడు ఉక్రేన్‌పై రష్యా తిరిగి సైనిక దాడులు ప్రారంభించింది. ఆదివారంనాడు రష్యా 108 డ్రోన్లతో అనేక దాడులు చేసిందని ఉక్రేన్ ప్రకటించింది. ఐతే వీటిల్లో 101 డ్రోన్ల వల్ల ఎలాంటి నష్టం వాటిల్లలేదని ప్రకటించింది. మే 15వ తేదీ నుండి ఇస్తాంబుల్‌లో ఉక్రేన్‌తో శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని పుతిన్ శనివారం అర్ధరాత్రి దాటాక ప్రకటించారు. ఐతే రష్యాలో విజయోత్సవ వేడుకలు జరుగుతున్న సమయంలో ఉక్రేన్ మూడు రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని 14,000 సార్లు ఉల్లంఘించిందని రష్యా రక్షణమంత్రి ప్రకటించారు. రష్యా ప్రతిపాదించిన మూడు రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించడం ద్వారా ఉక్రేన్ సైద్ధాంతిక ఆలోచన అర్థమవుతోందని ఆయన విమర్శించారు.

## చర్చ జరగాలి
**(మొదటి పేజీ తరువాయి)**

ప్రతిపక్ష నాయకులు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఉగ్రవాదంపై సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి పార్లమెంటు ఉభయ సభల ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే డిమాండ్‌ను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు (ఎల్‌ఒపి) రాహుల్ గాంధీ, రాజ్యసభలో ప్రతిపక్షనేత మల్లికార్జున్‌ఖర్గే ప్రధానమంత్రికి లేఖ రాశారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలనే ప్రతిపక్షం చేసిన ఏకగ్రీవ అభ్యర్థనను పునరుద్ఘాటిస్తున్నాను. పహల్గామ్ ఉగ్రవాద దాడి, ఆపరేషన్ సిందూర్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదట ప్రకటించిన కాల్పుల విరమణ విషయంపై ప్రజలు, ప్రజాప్రతినిధులు చర్చించడం చాలా ముఖ్యం. రానున్న సవాళ్లను ఎదుర్కోవడానికి మన సమష్టి సంకల్పాన్ని ప్రదర్శించడానికి ఇది ఒక అవకాశం అవుతుంది' అని రాహుల్ గాంధీ తన లేఖలో పేర్కొన్నారు. ఈ డిమాండ్‌ను తీవ్రంగా, త్వరగా పరిశీలిస్తారని తాను విశ్వసిస్తున్నానన్నారు. ఏప్రిల్ 22న పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో 26 మంది, ముఖ్యంగా పర్యాటకులు మరణించిన నేపథ్యంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ప్రధానమంత్రిని కోరుతూ తాను, రాహుల్ గాంధీ ఏప్రిల్ 28న రాసిన లేఖలను ఖర్గే గుర్తుచేశారు. తాజా పరిణామాల దృష్ట్యా, పహల్గామ్ దాడి, ఆపరేషన్ సిందూర్, కాల్పుల విరమణ ప్రకటనలపై చర్చించడానికి పార్లమెంటు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలనే అన్ని ప్రతిపక్ష పార్టీల ఏకగ్రీవ అభ్యర్థనను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు ఇప్పటికే మరోసారి లేఖ రాశారన్నారు. రాజ్యసభలో ప్రతిపక్ష నాయకుడిగా తాను ప్రతిపక్షాల అభ్యర్థనకు మద్దతుగా లేఖ రాస్తున్నానన్నారు. దీనిని అంగీకరిస్తారని భావిస్తున్నట్లు ప్రధానికి రాసిన లేఖలో ఖర్గే పేర్కొన్నారు.

## పది ర్యాంకులూ బాలురవే
**(మొదటి పేజీ తరువాయి)**

మాదాపూర్‌కు చెందిన ఉదగండ్ల రామచరణ్ రెడ్డి రెండవ ర్యాంకును సాధించారు. ఫార్మా, అగ్రికల్చర్ విభాగంలో మేడ్చల్ జిల్లాకు చెందిన సాకేత్‌రెడ్డికి మొదటి ర్యాంక్, కరీంనగర్‌లోని వావిరాల రామిరెడ్డి నగర్‌కు చెందిన సబ్బాని లలిత్ వరేణ్య రెండవ ర్యాంక్‌ను సాధించారు. 'ఎప్‌సెట్' ఫలితాలను హైదరాబాద్, జుబ్లీహిల్స్‌లోని సిఎం నివాసంలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆదివారం ఫలితాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణ, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఇటిక్యాల పురుషోత్తం, కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ఎ.శ్రీదేవసేన, జెఎన్‌టియుహెచ్ వైస్‌ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ టి.కిషెన్ కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎప్‌సెట్‌లో మొత్తం 3,07,088 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. ఏప్రిల్ 29, 30వ తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా, మే 2, 3, 4వ తేదీలల్లో ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షలను నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 16 టెస్ట్ జోన్ల పరిధిలోని 124 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇంజనీరింగ్ విభాగంలో మొత్తంగా 2,20,326 అభ్యర్థులు నమోదు చేసుకోగా, 2,07,190 మంది పరీక్షలు రాశారు. ఇందులో 1,51,779 (73.26 శాతం) మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా బాలురు 1,19,051మంది, బాలికలు 88,139 మంది ఉత్తీర్ణత సాధించారు. అలాగే అగ్రికల్చర్, ఫార్మావిభాగంలో మొత్తం 86,762 మంది నమోదు చేసుకోగా, 81,198 మంది(87.82 శాతం) ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 19,867 మంది, బాలికలు 61,331 మంది ఉత్తీర్ణులయ్యారు.

**ఇంజనీరింగ్ విభాగం:** మొదటి ర్యాంక్ పల్లా భరత్ చంద్ర (ఎపి, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడ). రెండవ ర్యాంక్ ఉదగండ్ల రామచరణ్ రెడ్డి (రంగారెడ్డి జిల్లా మాదాపూర్). మూడవ ర్యాంక్ హేమసాయి సూర్య కార్తీక్ (ఎపి,విజయనగరం). 4వ ర్యాంక్ మెండె లక్ష్మీ భార్గవ్ (హైదరాబాద్, నాచారం). 5వ ర్యాంక్ మంత్రిరెడ్డి వెంకట గణేశ్ రాయల్ (రంగారెడ్డి జిల్లా, మాదాపూర్). 6వ ర్యాంక్ సుంకర సాయి రిశాంత్ రెడ్డి (రంగారెడ్డి జిల్లా, మాదాపూర్. 7వ ర్యాంక్‌రష్మిత్ బండారి (రంగారెడ్డి జిల్లా, మాదాపూర్). 8వ ర్యాంక్‌బనిబ్రత మాజీ (రంగారెడ్డి జిల్లా, బడంగ్‌పేట). 9వ ర్యాంక్‌కొత్త ధనుష్ రెడ్డి (హైదరాబాద్). 10వ ర్యాంక్ కొమ్మ శ్రీకార్తీక్ (మేడ్చల్ హైదరాబాద్)

**అగ్రికల్చర్, ఫార్మా :**
మొదటి ర్యాంక్‌పెద్దకాగరి సాకేత్ రెడ్డి (మేడ్చల్‌హైదరాబాద్).రెండవ ర్యాంక్ సబ్బాని లలిత్ వరేణ్య (కరీంనగర్, వావిలాల రామ్‌రెడ్డి నగర్). మూడవ ర్యాంక్ చాడ అక్షిత్ (వరంగల్).4వ ర్యాంక్ పెద్దింటి రాచల సాయి నంద్ (వనపర్తి జిల్లా కొత్తకోట). 5వ ర్యాంక్ బ్రాహ్మణి రెండ్ల (రంగారెడ్డి జిల్లా ,మాదాపూర్). 6వ ర్యాంక్‌గుమ్మడిదల తేజస్ (మేడ్చల్ జిల్లా, కూకట్‌పల్లి). 7వ ర్యాంక్‌కొలన్ అఖిరనద్ రెడ్డి (హైదరాబాద్, నిజాంపేట్). 8వ ర్యాంక్‌భానుప్రకాష్ రెడ్డి సాదు (రంగారెడ్డి జిల్లా, సరూర్‌నగర్). 9వ ర్యాంక్ అర్జ శామ్యూల్ సాత్విక్ (రంగారెడ్డి జిల్లా, హైదర్‌గూడ). 10వ ర్యాంక్‌శశికిరణ్‌రెడ్డి అద్దుల (రంగారెడ్డి జిల్లా, బాలాపూర్).

## ఎందుకు అవకాశమిచ్చారు?
**(మొదటి పేజీ తరువాయి)**

విరమణ ఒప్పందానికి అక్షరాలా కట్టుబడాలని సిపిఐ పిలుపు ఇచ్చింది. అదేసమయంలో రెండు దేశాలూ సామ్రాజ్యవాదుల జోక్యాన్ని, బాహ్యశక్తుల జోక్యాన్ని తిరస్కరించడంద్వారా ప్రాంతీయ స్వయంప్రతిపత్తిని పరిరక్షించాల్సిన అవసరం ఉందని విజ్ఞప్తి చేసింది. పరస్పర విశ్వాసం ప్రాతిపదికపై, రెండు దేశాల ప్రజల ఆశయాలను గౌరవిస్తూ ద్వైపాక్షిక రాజకీయ ప్రక్రియను పునరుద్ధరించాలని సిపిఐ విజ్ఞప్తి చేసింది. అసలు ఈ రెండు దేశాలమధ్య అమెరికా చేసిన మధ్యవర్తిత్వం ఏమిటో ప్రజలకు మోదీ వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. వీలైనంత త్వరగా పార్లమెంటు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఈ మొత్తం వ్యవహారంపై ఎలాంటి దాపరికాలు లేకుండా సమగ్ర చర్చలు జరపాలని కోరింది. సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం ఆదివారంనాడు ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. భారత్–పాకిస్థాన్ దేశాలమధ్య కాల్పుల విరమణ అంగీకారాన్ని సిపిఐ స్వాగతించింది. పూర్తిస్థాయి యుద్ధాన్ని నివారించి, దక్షిణాసియాలో శాంతి సంరక్షణ దిశగా పాకిస్థాన్ సానుకూలమైన, చర్య తీసుకోవడంపట్ల హర్షం ప్రకటించింది. ఈ పరిణామం వాస్తవాధీనరేఖ వెంబడి నివసిస్తున్న ప్రజలకు ఎంతో ఉపశమనం కలిగిస్తుందని, రెండు దేశాలమధ్య దీర్ఘకాలంగా శత్రుత్వం కొనసాగుతోందని పేర్కొంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఘర్షణలకు ఆజ్యంపోసే చరిత్రగల సామ్రాజ్యవాద అమెరికా దేశాన్ని మధ్యవర్తిత్వం చేసేందుకు భారత్–పాకిస్థాన్ ప్రభుత్వాలు ఎలా అంగీకరించాయని ప్రశ్నించింది. ఈ రెండు దేశాలమధ్యా ఒక ద్వైపాక్షిక సమస్యగా ఉన్న విషయంలో ఘర్షణలకు ఆజ్యం పోసే బాహ్యశక్తి మధ్యవర్తిత్వాన్ని అనుమతించడం ఇబ్బందికరంగా మారిందని సిపిఐ పేర్కొంది. మధ్యవర్తిత్వానికి అమెరికా చొరవను అంగీకరించడం ద్వారా భారత ప్రభుత్వం సిమ్లా ఒప్పంద సారాంశాన్ని ఉల్లంఘించిందనీ, తద్వారా కశ్మీరు సమస్యను అంతర్జాతీయాకరణ చేసేందుకు అవకాశం ఇచ్చిందని సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది.

## రుచిచూపించాం
**(మొదటి పేజీ తరువాయి)**

చెప్పాలన్నదే ఆపరేషన్ సిందూర్ లక్ష్యం. సరిహద్దు అవతల ఉన్న ఉగ్ర శిబిరాలను కచ్చితమైన ఆధారాలతో గుర్తించాం. స్పష్టమైన ఆధారాలతో 9 ఉగ్రవాద శిబిరాలపై దాడులు నిర్వహించాం. ఈ దాడుల్లో 100 మంది ఉగ్రవాదులు చనిపోయారు. ఆ దాడులతో పాకిస్థాన్ వణికిపోయింది. ఆ తర్వాత మన పౌరులే లక్ష్యంగా పాకిస్థాన్ దాడులకు పాల్పడింది. అనంతరం తగిన మూల్యం చెల్లించుకుంది. భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా ఉగ్రస్థావరాలపై దాడిలో ఇండియన్ ఎయిర్ లైన్స్ ఫ్లైట్ ఐసి814 హైజాకర్లు, పుల్వామా దాడుల్లో పాల్గొన్న ముష్కరులు హతమయ్యారు. వీరిలో యూసుఫ్ అజహర్, అబ్దుల్ మాలిక్ రౌఫ్, ముదాసిర్ అహ్మద్ తదితరులు ఉన్నారు' అని ఆర్మీ డిజిఎంఒ రాజీవ్ ఘాయ్ వెల్లడించారు.

**40 మంది పాక్ సైన్యం మృతి!**

'ఈ నెల 8, 9వ తేదీ రాత్రి భారత్‌పై గగనతల దాడికి పాకిస్థాన్ యత్నించింది. డ్రోన్లు, మానవ రహిత విమానాలు మనవైపు దూసుకొచ్చాయి. వాటన్నింటినీ భారత గగనతల రక్షణ వ్యవస్థ సమర్థంగా తిప్పికొట్టింది. పౌరులపై దాడులను అడ్డుకున్నాం. డ్రోన్ దాడులకు ప్రతిగా పాక్ రాడార్ స్టేషన్లు, సైనిక స్థావరాలపై బలమైన దాడులు నిర్వహించాం. గగనతలం నుంచి భూతలంపై ఉన్న లక్ష్యాలను ఛేదించాం. లక్ష్యాల సాధనలో భారత్ వైపు ఎలాంటి నష్టం లేకుండా దాడులు చేశాం. భారత్‌వైపు వచ్చిన ప్రతి డ్రోన్‌ను నిర్వీర్యం చేశాం. లాహోర్, గుజ్రన్ వాలా రాడార్ కేంద్రాలను ధ్వంసం చేశాం. డ్రోన్ల దాడుల సమయంలో పాకిస్థాన్ పౌరవిమానాలనూ ఆకాశంలోకి అనుమతించింది. పరిస్థితి గమనిస్తూ.. కచ్చితమైన లక్ష్యాలతో పాక్ సైనిక స్థావరాలపై దాడులు చేశాం. మొత్తంగా మూడు రోజులపాటు కొనసాగిన దాడుల్లో 35 నుంచి 40 మంది పాకిస్థాన్ సైనికులు చనిపోయినట్లు అంచనా వేస్తున్నాం' అని డిజిఎంఒ స్థాయి అధికారులు పేర్కొన్నారు.

**మళ్లీ దాడులు చేస్తే..**

'పాక్ ఎన్ని దుశ్చర్యలకు పాల్పడినా దీటుగా స్పందించేందుకు సిద్ధంగా ఉన్నాం. పాక్ ప్రతిపాదన మేరకే కాల్పుల విరమణపై అవగాహనకు వచ్చాం. అయినా కొన్ని గంటల్లోనే మళ్లీ డ్రోన్ దాడులు కొనసాగించింది. ఇదే పరిస్థితి నేడు కొనసాగితే తీవ్ర ప్రతిచర్యలు ఉంటాయి. ఉల్లంఘనలపై దీటుగా స్పందించేందుకు క్షేత్రస్థాయి అధికారులకు సైన్యాధ్యక్షుడు పూర్తి అధికారాలు ఇచ్చారు' అని డిజిఎంఒ అధికారి స్పష్టం చేశారు.

**పాక్ విమానాలను కూల్చేశాం**

ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్థాన్‌కు చెందిన కొన్ని అత్యాధునిక విమానాలను కూల్చేశామని ఎయిర్ మార్షల్ ఎకె భారతీ వెల్లడించారు. భారత యుద్ధ విమానాలను పాకిస్థాన్ నిర్బంధించినట్లు వచ్చిన వార్తలపై స్పందిస్తూ.. భారత పైలట్లందరూ సురక్షితంగా తిరిగి వచ్చారని చెప్పారు. మన స్థావరాలపై దాడి చేసేందుకు వారు చేసిన ప్రయత్నాలను గగనతల రక్షణ వ్యవస్థలు అడ్డుకున్నాయని అన్నారు.

**సంసిద్ధంగా నౌకాదళం**

ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత నౌకాదళం కూడా పూర్తి సంసిద్ధతతో ఉందని ఇండియన్ నేవీ వెల్లడించింది. పహల్గాం దాడి తర్వాత వెంటనే అప్రమత్తమయ్యామని, బలగాలతో పాటు సబ్ మెరైన్లను సముద్రంలో మోహరించామని తెలిపింది. అవసరమైతే కరాచీ పోర్టు కూడా తమ లక్ష్యాల్లో ఒకటని పేర్కొంది. తాత్కాలిక కాల్పుల విరమణ అవగాహన నేపథ్యంలో పాకిస్థాన్ నేవీ, ఎయిర్ బేస్‌లపై నిఘా పెట్టామని.. ఈసారి పాక్ ఉల్లంఘనలకు పాల్పడితే భారత్ ఏం చేయనుందో వారికి తెలుసునని వైస్ అడ్మిరల్ ఎఎన్ ప్రమోద్ పేర్కొన్నారు.

## ఇవ్వాల్సిందే
**(మొదటి పేజీ తరువాయి)**

ఉగ్రవాదులు గతంకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది, కోరుకున్నచోట ఉగ్రవాదుల సహకారాన్ని ఆశించినప్పటికీ, ఇక పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని కొనసాగించదు అని వర్గాలు పేర్కొన్నాయి. 1947వ సంవత్సరం నుండీ రెండు దేశాలమధ్యా కొనసాగుతున్న వివాదాన్ని పరిష్కరించడానికి మధ్యవర్తిత్వం చేస్తామని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ సంసిద్ధత వ్యక్తం చేసిన తర్వాత ప్రభుత్వం తన వైఖరిని వెల్లడించింది. పాకిస్థాన్ ఆక్రమణలో ఉన్న భారత భూభాగాన్ని తిరిగి ఇవ్వడం ఒక్కటే మిగిలి ఉంది. కశ్మీరుకు సంబంధించి ఇక ఆ ఒక్క విషయం గురించే మాట్లాడతాం అని ప్రభుత్వ వర్గాలను ఉటంకిస్తూ పిటిఐ వార్తాసంస్థ వెల్లడించింది. పిటిఐ తెలిపిన సమాచారం ప్రకారం, అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ శనివారంనాడు ప్రధానమంత్రి నరేంద్రమోదీతో టెలిఫోన్‌లో సంభాషించారు. రెండు దేశాలమధ్య ఉద్రిక్తతలు తగ్గించడం గురించి మాట్లాడారు. ''వాళ్ళు దాడి చేస్తే, భారతదేశం ఇంకా బలంగా, మరింత శక్తిమంతంగా ఎదురుదాడి చేస్తుంది'' అని మోదీ ఆయనకు తెలియజేశారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ చేసే ప్రతీ చర్యకూ మరింత బలంగా ప్రతిస్పందించాలని సాయుధ బలగాలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆదేశించారని కేంద్ర ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. సరిహద్దుల్లో ఉగ్రవాదాన్ని గతంకంటే భిన్నంగా అసాధారణంగా ప్రతిఘటించాలని ఆజ్ఞాపించారన్నారు. ''అటువైపు నుండి ఒక తూటా మనమీదకు వస్తే మీరు వారిపై ఇటువైపు నుండి గుళ్ళవర్షం కురిపించండి'' (వహన్ సే గోలీ చలేగీ, తో యహన్ సే గోళా చలేగా) అని ఆపరేషన్ సిందూర్' అనంతర పరిణామాల నేపథ్యంలో సాయుధబలగాలకు మోదీ ఆదేశించారని ఆదివారంనాడు కేంద్ర ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. విదేశాంగశాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శనివారంనాడు సాయంత్రం పత్రికాగోష్ఠిలో మాట్లాడుతూ, భూ, జల, గగనతల మార్గాలలో సైనిక చర్యలు చేయకుండా రెండు దేశాలూ అంగీకరించాయని, ఆ మేరకు ఒక అవగాహనకు వచ్చాయన్నారు.

నాలుగురోజులపాటు ఉద్ధృతంగా అనధికార యుద్ధం జరిగిన తర్వాత రెండు దేశాలూ ఈ అవగాహనకు వచ్చాయన్నారు. ఐతే ఈ కాల్పుల విరమణ పరిణామాన్ని మొదట అమెరికా ప్రకటించింది. డోనాల్డ్ ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియా ద్వారా పోస్టింగ్ పెట్టారు. రెండు దేశాలూ తక్షణం, పూర్తిస్థాయిలో కాల్పుల విమరణకు అంగీకరించాయని, అందుకు అమెరికా మధ్యవర్తిత్వమే కారణమని ట్రంప్ ప్రకటించుకున్నారు. ఆ తర్వాతే మిస్రి పత్రికాగోష్ఠిలో కాల్పుల విరమణ అంగీకారం గురించి చెప్పారు. తామే మధ్యవర్తిత్వం చేశామని ట్రంప్ చెప్పుకుంటున్న తరుణంలో ఆ విషయం నిజమేనని మిస్రీ చెబుతూ, పాకిస్థాన్‌కు చెందిన డిజిఎంఒ స్వయం గా భారత డిజిఎంఒకు శనివారం మధ్యాహ్నం 3.35 గంటలకు ఫోన్ చేశారు, ఉద్రిక్తతలు తగ్గించుకుందాం అని అడిగారని మిస్రీ చెప్పారు.

## మధ్యవర్తిత్వం చేస్తాం ట్రంప్
**(మొదటి పేజీ తరువాయి)**

దేశాలమధ్య యుద్ధంలో మరణించి ఉండేవారని ట్రంప్ అన్నారు. నాలుగు రోజులుపాటు రెండు దేశాలమధ్య శత్రుత్వం రగిలిపోయింది. అనధికారికంగా భీకరయుద్ధం జరిగింది. ఈ సందర్భంగా ట్రంప్ తన ప్రకటనలో, భారత్–పాకిస్థాన్ రెండు దేశాలతో వాణిజ్య సంబంధాలను విస్తృతం చేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా అనేక దశాబ్దాలుగా రెండు దేశాలమధ్యా నలుగుతున్న కశ్మీరు సమస్య పరిష్కారానికి మధ్యవర్తిత్వం చేస్తామని ట్రంప్ ప్రకటించారు.

''భారత్–పాకిస్థాన్ దేశాలు రెండూ ఎంతో విజ్ఞతతో వ్యవహరించాయి, వివేకంగా రాబోయే పరిణామాలను అర్థం చేసుకుని వ్యవహరించాయి. రెండు దేశాలలో ఉన్న శక్తిమంతమైన నాయకత్వం, బలమైన నాయకత్వం చూసి నేను ఎంతో గర్వపడుతున్నాను, ప్రస్తుత దురాక్రమణను ఆపడానికి ఇదే సరైన తరుణం, ఈ తరుణంలో ఈ నిర్ణయం తీసుకోకపోయి ఉంటే రెండు దేశాలమధ్య యుద్ధంలో లక్షలమంది మరణించి ఉండేవారు, అమాయకులు మరణించి ఉండేవారు, మీరు ధైర్యసాహసాలతో తీసుకున్న చర్యలు మీ వారసత్వాన్ని ఇనుమడింపజేశాయి, అమెరికా ఈ విషయంలో మీకు సహాయంచేయగల శక్తిసామర్థ్యాలు ఉన్నందుకు నేను ఎంతో గర్వపడుతున్నాను. ఈ చరిత్రాత్మకమైన, వీరోచిత నిర్ణయం తీసుకోవడానికి అమెరికా సహకరించింది, ఈ రెండు గొప్ప దేశాలతోనూ వాణిజ్యాన్ని విస్తారంగా పెంచుకోవాలని అమెరికా భావిస్తోంది, అదనంగా కశ్మీరు సమస్య పరిష్కారానికి మీ ఇద్దరితో కలిసి పని చేస్తాం, రెండు దేశాలు వ్యవహరించిన తీరుకు దేవుడు మిమ్మల్ని ఆశీర్వదించాలి'' అని ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో రాశారు. వెయ్యి సంవత్సరాలైనా కశ్మీరుకోసం పోరాటం చేస్తాం అని పాకిస్థాన్ గతంలో చెప్పిన విషయాన్ని కూడా ట్రంప్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## 'సీతారామ ప్రాజెక్ట్'కు అనుమతులు లేవన్నది అబద్ధం
### మాజీ మంత్రి హరీశ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సీతారామ ప్రాజెక్టుకు సెంట్రల్ వాటర్ కమిషన్(సిడబ్ల్యుసి) హైడ్రాలజీ అనుమతులులేవని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలను ప్రచారం చేస్తోందని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. 2018 అక్టోబర్ 30న గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాజెక్ట్‌కు సంబంధించిన డిపిఆర్‌ను కేంద్ర జల సంఘానికి అందజేసిందని, 2021 సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లోనే 113.795 టిఎంసిల నీళ్ల ప్రతిపాదిత సీతారామ ప్రాజెక్టుకు అందుబాటులో ఉన్నాయని సిడబ్ల్యుసి హైడ్రాలజీ విభాగం నిర్ధారించిందని హరీశ్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కింద 70.4 టిఎంసిల నీటిని వినియోగించి 6.74 లక్షల ఎకరాలకు సాగు నీటిని ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం,మహబూబాబాద్ జిల్లాలకు ఇవ్వవచ్చని, తాగునీటితో పాటు పారిశ్రామిక అవసరాలకు వినియోగించుకోవచ్చని కేంద్ర ప్రభుత్వం 2021లోనే నిర్ధారించిందని పేర్కొన్నారు.

అంత ర్రాష్ట్ర సమస్యలు, అటవీ అనుమతుల ఇబ్బందులను అధిగమించేందుకు గత సిఎం కెసిఆర్ సమీకృత సీతారామ ప్రాజెక్టును రూపకల్పన చేశారని, ఈ ప్రాజెక్ట్ ద్వారా రాజీవ్ సాగర్, ఇందిరాసాగర్ ప్రాజెక్టుల్లో ప్రతిపాదించిన 3.33 లక్షల ఎకరాల ఆయకట్టతో పాటు, అదనంగా మరో 3.41 లక్షల ఎకరాలకు నీరును అందించి,నిల్వ సామర్థ్యాన్ని 1.2 టిఎంసి నుంచి 10 టిఎంసిలకు పెంచి, 7,967 కోట్లతో పనులు ప్రారంభించారని హరీశ్‌రావు తెలిపారు. టిఎసి తప్ప అన్ని అనుమతులను తాము అధికారంలో ఉన్నప్పుడే పూర్తి చేశామని, ఈ ప్రాజెక్ట్‌కు అనుమతులు లేవని మంత్రి ఉత్తమ్ మాట్లాడడం అవగాహన రాహిత్యమేనని, అధికారులతో మాట్లాడి వాస్తవాలు తెలుసుకోవాలని హరీశ్‌రావు సూచించారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో 6.74 లక్షల ఎకరాలకు సాగు నీరు, వందలాది గ్రామాలకు తాగునీరు అందించే ఈ ప్రాజెక్ట్ ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేస్తుంటే, రాజకీయ భవిష్యత్తు ఉండదన్న అక్కసుతోనే కాంగ్రెస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధాలతోనే పాలనను కొనసాగిస్తోందని ఆయన ఆరోపించారు.

రాష్ట్ర ప్రయోజనాలను తమ సొంత రాజకీయ ప్రయోజనాలకు తాకట్టు పెట్టే కాంగ్రెస్ నాయకులు, బిఆర్‌ఎస్ ,కెసిఆర్ గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలనలో కనీసం ఒక్క ఎకరాకు కూడా నీళ్లు ఇవ్వలేదని, ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని పే ర్కొన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు జాతీయ సాంకేతిక దినోత్సవ శుభాకాంక్షలు :సిఎం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ సాంకేతిక దినోత్సవం (నేషనల్ టెక్నాలజీ డే) పురస్కరించుకుని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శాస్త్రవేత్తలు,ఇంజనీర్లు, సాంకేతిక నిపుణులకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్ అభివృద్ధికి చిరునామాగా నిలిచే టెక్నాలజీ రంగంలో నూతన ఆవిష్కరణలకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహాయ, సహకారాలను అందిస్తామని పేర్కొన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకొని భారత టెక్నాలజీ శక్తిని ప్రపంచానికి చాటేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని సిఎం ఆకాంక్షించారు.

**మాతృమూర్తులకు సిఎం శుభాకాంక్షలు**

మాతృదినోత్సవ సందర్భంగా మాతృమూర్తులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. జన్మకు ఆధారం, అమూల్య ప్రేమకు, ప్రతిరూపం, ప్రతి ఇంటా కొలువుండే దైవం అమ్మ అని పేర్కొన్నారు. మానవ సమాజానికి పునాది అమ్మ ఒడి, ఆప్యాయత, ఓర్పు, శక్తికి ప్రతిరూపమైన ప్రతి తల్లికి మెరుగైన జీవనం అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ ధ్యేయమని తెలంగాణ తల్లి, ఆశీస్సులతో మహిళా శక్తిని చాటుదామన్నారు.

### నేటి నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో

# స్లాట్ బుకింగ్



మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలోని మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో సోమవారం నుంచి 'స్లాట్ బుకింగ్' విధానాన్ని అమలు చేయనున్నారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్ర వ్యాప్తంగా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నది. ప్రజల సమయాన్ని ఆదా చేసేందుకు, రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలకు స్వీకారం చుట్టామని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఆస్తుల రిజిస్ట్రేషన్‌కు వచ్చే కొనుగోలుదారులు, అమ్మకందారులు గంటల తరబడి చెట్ల కింద నిరీక్షించాల్సిన పరిస్థితిని మార్చుతూ, సబ్ రిజిస్టర్ కార్యాలయాలను ఆధునికీకరించడంతో పాటు, స్లాట్ బుకింగ్ విధానాన్ని దశలవారీగా అమలులోకి తీసుకొస్తున్నామన్నారు. ఇప్పటికే గత నెల 10వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో చేపట్టిన స్లాట్ బుకింగ్ విజయవంతం కావడంతో, సోమవారం (ఈ నెల 12వ తేదీ) నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేయబోతున్నామని మంత్రి ప్రకటించారు. వచ్చే నెల చివరినాటికి రాష్ట్రంలోని 144 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఈ విధానాన్ని అమలులోకి తీసుకురావడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజలకు వేగవంతమైన, సమర్థమైన సేవలందించడమే లక్ష్యంగా సంస్కరణలు తీసుకురావడంతో పాటు వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులదే అని మంత్రి స్పష్టం చేశారు.

**నేటి నుంచి స్లాట్ బుకింగ్ అమలు కానున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు :**

హైదరాబాద్ ఆర్ఓ కార్యాలయం, హైదరాబాద్ ఆర్ఓ ఆఫీస్ సౌత్,నారపల్లి, ఘట్‌కేసర్, మల్కాజిగిరి, ఉప్పల్, కాప్రా, బిబినగర్, సిద్ధిపేట, సిద్దిపేట్ రూరల్, గజ్వేల్, మంచిర్యాల, పెద్దపల్లి, వరంగల్ ఆర్ఓ ఆఫీసు, జనగాం, ఘన్‌పూర్, నర్సంపేట, కల్వకుర్తి, నారాయణపేట, మహేశ్వరం, రంగారెడ్డి ఆర్.ఓ ఆఫీసు, షాద్‌నగర్, ఫరూక్‌నగర్, వనస్థలిపురం, శేరిలింగంపల్లి.

**రిజిస్ట్రార్ కార్యాలయాల పునర్వ్యవస్థీకరణ**

స్లాట్ బుకింగ్ విధానాన్ని దృష్టిలో పెట్టుకుని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను పునర్వ్యవస్థీకరణ చేస్తున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు. అధిక, తక్కువ రద్దీ ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిని విలీనం చేసి, పనిభారాన్ని సమానం చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇప్పటికే రంగారెడ్డి జిల్లాలోని చంపాపేట, సరూర్‌నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల అధికార పరిధి విలీన ప్రక్రియ విజయవంతమైందని, షాద్ నగర్, ఫారూక్ నగర్ సిద్దిపేట, సిద్దిపేట (రూరల్) విలీనం చేశారన్నారు.

**48 స్లాట్స్ దాటితే అదనపు సబ్ రిజిస్ట్రార్లు**

పని ఒత్తిడి ఎక్కువగా ఉన్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని సులభతరం చేస్తున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 48 స్లాట్స్ కంటే ఎక్కువ స్లాట్స్ అవసరమైన కార్యాలయాలలో ప్రస్తుత సబ్ రిజిస్ట్రార్లకు తోడుగా అదనపు సబ్ రిజిస్ట్రార్లను నియమిస్తామని, ఇప్పటికే ప్రయోగాత్మకంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని కుత్బుల్లాపూర్ కార్యాలయంలో అదనంగా ఇద్దరు సబ్ రిజిస్ట్రార్లు, సిబ్బందిని నియమించామని వివరించారు. ఈ విధానాన్ని ఉప్పల్, మహేశ్వరం, మంచిర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో ప్రవేశపెట్టనున్నామని, అదనంగా ఒక్కొక్క సబ్ రిజిస్ట్రార్‌ను నియమిస్తామన్నారు.

# త్యాగాలకు చిరునామా ప్రకాశరావు కుటుంబం

భవిష్యత్తు పోరాటాలకు సంస్మరణ సభలు నాంది పలకాలి

సుశీలమ్మ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/ఖమ్మం :** తుదిశ్వాస వరకు పేదల పక్షాన నిలిచి అనేక పోరాటాలకు కేంద్ర బిందువుగా నిలిచిన తూము ప్రకాశరావు కుటుంబం త్యాగాలకు చిరునామాగా నిలిచిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. మధిర తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ పునర్ నిర్మాణంలో తూము ప్రకాశరావు చేసిన కృషి అజరామరమని ఆయన మరణానంతరం కమ్యూనిస్టు పార్టీకి దన్నుగా నిలిచిన సుశీలమ్మ ధన్యజీవి అని ఆయన తెలిపారు. ఇటీవల మరణించిన బోనకల్ మండలం రాయన్నపేట మాజీ సర్పంచ్ సిపిఐ నాయకురాలు తూము సుశీలమ్మ సంస్మరణ సభ ఆదివారం రాయన్నపేట గ్రామంలో జరిగింది. తోట రామాంజనేయులు అధ్యక్షతన జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా పేదల హక్కుల కోసం ముఖ్యంగా భూ పంపిణీ కోసం ప్రకాశరావు చేసిన పోరాటంతో అనేక మంది పేదలకు భూములు దక్కాయని ఆయన తెలిపారు. కలకోట చెరువుపై హక్కులు పేదలకు చెందాలని ప్రకాశరావు తుదిశ్వాస వరకు పోరాడారన్నారు. ఆయన అమరత్వం తర్వాత సుశీలమ్మ గ్రామ సర్పంచ్‌గా, సిపిఐ నాయకురాలిగా కమ్యూనిస్టు పార్టీకి దన్నుగా నిలిచారని ఆ అమర దంపతుల వారసత్వాన్ని కొనసాగిస్తూ వారి కుటుంబం కమ్యూనిస్టు పార్టీకి అండగా నిలవడమే కాకుండా విభిన్న రీతిలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయం, ఆదర్శనీయమని కూనంనేని తెలిపారు. సిద్ధాంత బలమే శతాబ్ద కాలంగా కమ్యూనిస్టు పార్టీని నిలబెడుతుందని కమ్యూనిజం అజరామరం, విశ్వవ్యాప్తమని సాంబశివరావు తెలిపారు. అధికారంలో లేకున్నా కమ్యూనిస్టులు తమ పక్షానే నిలుస్తున్నారని ఇందుకు సింగరేణి ఎన్నికల్లో గెలుపే నిదర్శనమన్నారు. పోరాట వారసత్వాన్ని కొనసాగించడమే సరైన నివాళి అని కూనంనేని తెలిపారు.

**సమాజ చైతన్యం కోసం పోరాడేది కమ్యూనిస్టులే : ఎమ్మెల్సీ తాతా మధు**

సమాజ చైతన్యం కోసం పోరాడేది కమ్యూనిస్టులు మాత్రమేనని బిఆర్ఎస్ అధ్యక్షులు, శాసన మండలి సభ్యులు తాతా మధుసూదన్ తెలిపారు. సుశీలమ్మ సంస్మరణ సభలో తాతా మధుసూదన్ మాట్లాడుతూ తూము ప్రకాశరావుది చరిత్ర కలిగిన కుటుంబమని సౌకర్యాలు లేని రోజుల్లో ప్రకాశరావు నిర్వహించిన సేవ నేటికీ ప్రజల గుండెల్లో నిలిచిపోయిందన్నారు. ప్రకాశరావు కుటుంబ సభ్యులు, మనువలు సేవా వారసత్వాన్ని కొనసాగించడం అభినందనీయమని ఆయన తెలిపారు. ఈ సభలో టిడిపి నాయకులు వాసిరెడ్డి రామనాథం, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, వివిధ పార్టీల నాయకులు చిదిరాల వెంకటేశ్వరరావు, జమ్ము ల జితేందర్‌రెడ్డి, చింతలచెరువు కోటేశ్వరరావు, బత్తినేని చారిటబుల్ ట్రస్టు నిర్వహకులు బత్తినేని ప్రకాష్, ప్రకాశరావు, సుశీలమ్మల కుమార్తెలు బత్తినేని నీరజ, పారా వనజ, తూము రోషన్‌కుమార్, వట్టికొండ చంద్రమోహన్, యంగల ఆనందరావు తదితరులు ప్రసంగించగా వేదికపై సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏపూరి లతాదేవి, శింగు నర్సింహారావు, పోటు కళావతి, బెజవాడ రవిబాబు, తాటి వెంకటేశ్వరరావు, ఏపూరి రవీంద్ర బాబు, కాంగ్రెస్ నాయకులు రంగిశెట్టి కోటేశ్వరరావు, బత్తినేని నాగప్రసాదరావు, ఉమ్మనేని కోటయ్య, తాటి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులపై మంత్రి అసహనం

ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి/కాళేశ్వరం :** సరస్వతి పుష్కర పనుల్లో నాణ్యత పాటించాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అధికారులను ఆదేశించారు. ఆదివారం కాళేశ్వరంలో విఐపి ఘాట్, సరస్వతి మాతా విగ్రహం, జ్ఞానతీర్థం, నదిలో భక్తుల స్నానమాచరించు ప్రదేశం, టెంట్ సిటీ తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం టెంట్ సిటీలో అన్ని శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి ముఖ్యమంత్రి రాక సందర్భంగా బందోబస్తు, పనులు పూర్తి చేయు అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పనులు చాలా మెల్లగా జరుగుతున్నాయని మీరే జవాబు చెప్పాలని అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. పట్టణం మొత్తాన్ని విద్యుద్దీకరణతో ముస్తాబు చేయాలని 12 రోజులు పండుగ వాతావరణంలో పుష్కరాలు నిర్వహించాలని సూచించారు. పిండ ప్రధాన భవనం అసంపూర్తిగా ఉందని దేవాదాయ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భక్తులు హారతి కార్యక్రమాన్ని వీక్షించేందుకు పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు నదిలోకి స్నానాలకు వెళ్ళడానికి తాత్కాలిక రహదారి ఏర్పాటుతో పాటు స్క్వియర్ మాట్ ఏర్పాటు చేయాలని తెలిపారు. భక్తులు నదిలోకి వెళ్లకుండా వెళ్లకుండా బారికేడ్స్, ప్రమాద హెచ్చరికల బోర్డ్స్ ఏర్పాటు చేయాలన్నారు. నదిలో 50 మంది గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచడంతో పాటు నాటుపడవలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. పుష్కరాలు సందర్భంగా మొట్టమొదటిసారిగా కాళేశ్వరంలో టెంట్ సిటి ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమాలు సజావుగా, సక్రమంగా పకడ్బందీగా జరిగేందుకు మినిట్ టు మినిట్ కార్యక్రమం తయారు చేయాలని సూచించారు. రహదారులకు మరమ్మత్తులు నిర్వహించాలని ఎక్కడ గుంతలు ఉండొద్దని ఆర్ అండ్ బి, జాతీయ రహదారుల అధికారులను ఆదేశించారు. తాత్కాలిక బస్టాండ్ వద్ద తాత్కాలిక లైటింగ్, మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. పనులు పర్యవేక్షణకు నియమించిన నోడల్ అధికారులు పూర్తి బాధ్యత తీసుకోవాలని ఆయన ఆదేశించారు. పనులలో నాణ్యత పాటించాలని నాణ్యత పాటించకపోతే చర్యలు తప్పవని మంత్రి కాంట్రాక్టర్లును హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ వెంకటరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, దేవాదాయ శాఖ ఆర్జెసి రామకృష్ణారావు, అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఇరిగేషన్, పంచాయతీరాజ్, ఆర్ డబ్ల్యూఎస్, వైద్య, ఆర్ అండ్ బి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి



విధుల్లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

హెల్త్ హబ్‌గా జగిత్యాల

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ

**ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి :** రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాలను ప్రాధాన్యతనిచ్చి ప్రోత్సహించాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజానర్సింహ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలోనే జగిత్యాల జిల్లాను అత్యుత్తమ హెల్త్‌కేర్ హబ్‌గా తీర్చిదిద్దటానికి అన్ని చర్యలు తీసుకుంటామని రాజనరసింహ పేర్కొన్నారు. ఆదివారం జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో మెడికల్, హెల్త్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ డీఎంఈ పరిధిలో ఉన్న ఆస్పత్రుల బలోపేతంపై ఆయా విభాగాల అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు. వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన అన్ని వివరాలను మంత్రి దామోదర్ రాజనర్సింహ అడిగి తెలుసుకున్నారు. వైద్యశాఖ అధికారుల నుంచి ఆసుపత్రులు పనితీరు వైద్యుల సేవలు, ప్రజల స్పందన, ఇబ్బందులు, దవాఖానాల్లో నెలకొన్న సమస్యలను మంత్రి క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ జిల్లాలో అవసరమైన వైద్య పరికరాలు అందజేస్తామన్నారు. జగిత్యాల జనరల్ హాస్పిటల్‌కు ఎమ్మారై స్కాన్‌ను మంజూరు చేస్తామని తెలిపారు. జిల్లాలో గల మూడు డయాలసిస్ సెంటర్లలో రోగులకు అత్యుత్తమైన సేవలు అందించాలని, వారి పట్ల నిర్లక్ష్యంగా ఉండవద్దని సూచించారు. వైద్యులు బాధ్యతయుతంగా పని చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. ఇందుకు గ్రామ,గ్రామాన అంగన్వాడి కార్యకర్తలు, ఆశా వర్కర్లు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. రోడ్ ప్రమాద బాధితులకు జగిత్యాల, ధర్మపురి పరిధిలో ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటుచేస్తామనీ వెల్లడించారు. ఆస్పత్రుల్లో వైద్యులు రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించవద్దని, వారి పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ అత్యుత్తమైన సేవలందించాలని సూచించారు. అయితే అధికారులు, సిబ్బంది పని తీరును మరింత మెరుగుపరుచుకోవాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలు అందించి ప్రభుత్వ ఆసుపత్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్‌కి వెళ్లి డబ్బులు వృధా చేసుకోవద్దని, ప్రభుత్వాసుపత్రుల్లో అత్యాధునికమైన అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలంతా వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సమీక్షలో ప్రభుత్వ విప్, ధర్మపురి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కోరుట్ల శాసనసభ్యులు డా.సంజయ్, జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, అదనపు కలెక్టర్ బిఎస్ లత, డిఎం అండ్ హెచ్ ఓ డా.ప్రమోద్, మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ డా. ఖాద్రి, జి జి హెచ్ హాస్పిటల్ సూపరింటెండెంట్ డా. సుమన్, జిల్లాకు చెందిన వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ఐదారు రోజులు వర్షాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రానున్న ఐదారు రోజులు రాష్ట్రంలో పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆదిలాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. సోమవారం, మంగళవారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్ నగర్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో 5060 కి.మీల వేగంతో భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించారు. బుధవారం, గురువారం నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో 5060 కి.మీ వేగంతో ఈదురు గాలు, మెరుపులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పారు.

## 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కార్మికులకు పూర్తిగా వ్యతిరేకంగా ఉన్న 4లేబర్ కోడ్స్ తక్షణమే రద్దు చేయాలని, ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న జరగనున్న దేశవ్యాప్త స్వారత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎం.నరసింహ, అధ్యక్షులు మారగోని ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం సార్వత్రిక సమ్మె పోస్టర్లలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడవసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తన కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాలలో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కార్పొరేట్లుకు అనుకూలంగా తీసుకువచ్చిన 4 లేబర్ కోడ్ ద్వారా పూర్తిగా కార్మిక హక్కులను హరించే ప్రయత్నం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర బిజెపి ప్రభుత్వ కార్మిక ప్రజావ్యతిరేక విధానాలను వెనక్కి కొట్టేందుకు భారత రాజ్యాంగం కల్పించిన ప్రాథమిక హక్కులను రక్షించుకునేందుకు మే 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గన్నారపు రమేష్,ఉపాధ్యక్షులు జి.రాజు, గాదె లక్ష్మీ నారాయణ, జి.పరమేష్ సహాయ కార్యదర్శి కమతం యాదగిరి, సామల మల్లేష్ ,కే.వెంకటేష్, శివశంకర్, పిట్టల సమ్మయ్య, కడారి రాములు కోశాధికారి కన్యాగారి నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో 86 మంది తెలంగాణ వాసులు.. స్వస్థలాలకు పయనం!



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భారత్–పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇతర రాష్ట్రాలకు చెందిన వారు బిక్కుబిక్కుమంటూ స్వస్థలాలకు చేరుతున్నారు. శనివారం ఐఐటీ జమ్మూలోని 8 మంది తెలంగాణ విద్యార్థులు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు దాదాపు 86 మంది తెలంగాణ వాసులు తాజాగా ఢిల్లీలోని తెలంగాణ భవన్‌కు చేరుకున్నారు. ఇప్పటివరకు 26 మందిని వారి స్వస్థలాలకు పంపించినట్లు భవన్ అధికారులు తెలిపారు. భవన్‌లో ఉన్నవారికి తెలంగాణ ప్రభుత్వం ఆశ్రయం, ఆహారం, రవాణా సదుపాయం కల్పిస్తోంది. ఉద్రిక్తతలు పెరిగితే మరో 100 మంది వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. సహాయం చేయడానికి ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ పనిచేస్తోందని అక్కడి అధికారులు చెబుతున్నారు. కాగా, ఢిల్లీలోని కంట్రోల్ రూమ్ నంబర్లు ల్యాండ్లైన్: 01123380556, రెసిడెంట్ కమిషనర్ ప్రైవేట్ సెక్రటరీ లైజన్ హెడ్ మొబైల్: 9871999044 , రెసిడెంట్ కమిషనర్ వ్యక్తిగత సహాయకుడు మొబైల్: 9971 387500, లైజన్ ఆఫీసర్ మొబైల్: 9643723157, పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ మొబైల్: 9949351270 నెంబర్లలో సంప్రదించవచ్చని ఢిల్లీలోని తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో తండ్రీ కూతురు మృతి...!



**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** నిర్మల్ రూరల్ మండలంలోని నీలాయపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆదిలాబాద్ పట్టణానికి చెందిన తండ్రి, కూతురు దుర్మణం చెందారు. ఆదిలాబాద్ రవీంద్ర నగర్ కాలనీకి చెందిన బ్యాటరీ వ్యాపారి బండి శంకర్(49) హైదరాబాదులో బీటెక్ చదువుతున్న కూతురు కృతిక (21) తీసుకురావడానికి కారులో డ్రైవర్‌తో కలిసి హైదరాబాద్ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో కారు డ్రైవర్‌కు నిద్ర రావడంతో కాసేపు డ్రైవరును వెనుక సీట్లో, తన కూతురు కృతికను ముందు సీట్లో కూర్చోబెట్టి బండి శంకర్ డ్రైవింగ్ చేస్తుండగా నీలాయిపేట వద్ద ఎదురుగా వస్తున్న డిసిఎం వాహనం ఢీ కొట్టింది. దీంతో తండ్రి కూతు రు ఇద్దరూ అక్కడికక్కడే మృతించారు. కారు డ్రైవర్‌తో పాటు డీసీఎం డ్రైవర్‌కు కూడా గాయాలయ్యా యి. మృతి చెందిన శంకర్‌కు ఇద్దరు కవల అడపిల్లలు, ఒక కుమారుడు ఉన్నారు. తండ్రి కూతురు ఇద్దరు మృతి చెందిన సంఘటన రవీంద్ర నగర్ కాలనీలో తీరని విషాదం నింపింది. నిర్మల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు సాగిస్తున్నారు.

# సంక్షోభంలో ప్రభుత్వ విద్య



**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ విద్య ఏడాది ఏడాదికి సంక్షోభంలో కూరుకుపోతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతుంది. ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు, ముగ్గురు ఉన్న పాఠశాల సంఖ్య పెరిగిపోతుంది. విద్యార్థులు లేని కారణంగా మూతపడే పాఠశాలలు ప్రతి విద్యా సంవత్సరంలోనూ పెరుగుతూ వస్తున్నాయి. ఖమ్మం జిల్లాలో సుమారు 64 పాఠశాలలు మూతపడినట్లు సమాచారం. గ్రామీణ ప్రాంతాల్లో మధ్యతరగతి, ఎగువ మధ్యతరగతి మొదలు సంపన్న వర్గాలకు చెందిన పిల్లలు ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో విద్యను అభ్యసిస్తుండగా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు గురుకులాల బాట పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ విద్య పరిరక్షణ పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించటం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రత్యక్షంగా ప్రభుత్వ విద్యను పరోక్షంగా ప్రైవేటు ముఖ్యంగా కార్పొరేట్ విద్యను ప్రోత్సహిస్తుందన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం కేవలం ప్రకటనలకే పరిమితం అవుతుందని, కార్యాచరణ కరువైందని ఉపాధ్యాయ సంఘాలు అంటున్నాయి. ప్రభుత్వ విద్య సంక్షోభంలోకి కూరుకుపోవటానికి విద్యార్థుల తల్లిదండ్రుల్లో పెరిగిన ప్రైవేటు మోజు ఒక కారణమైతే ప్రభుత్వ వైఖరి మరో కారణమవుతుంది. ప్రైవేటులో చదివితేనే చదువు ప్రభుత్వ బడిలో చదువు చదువు కాదన్న ఫోబియా నుంచి ప్రజలను మళ్లించటంలో విఫలమవుతున్నారు. దీనికి తోడు బిల్లు, బెల్లుకు పరిమితమై అంకిత భావంతో పనిచేసే వారి సంఖ్య తగ్గిపోయింది.

**పర్యవేక్షణ కరువు :**

మండల విద్యాశాఖాధికారులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కరువవుతుంది. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకే ఎంఈవో బాధ్యతలు అప్పగించడం, వారు పూర్తి కాలం పని చేయకపోవడం ప్రభుత్వ విద్యపై తీవ్ర ప్రభావం చూపుతుంది. ప్రభుత్వ ఉపాధ్యాయుల తీరు కూడా ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రులకు నమ్మకం కోల్పోయేలా చేస్తుంది. ప్రైవేటు వ్యాపారాల్లో మునిగి తాము పనిచేస్తున్న బడిని పట్టించుకోకపోవడం, అసలు కొందరు పాఠశాలకే రావడం లేదన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వ విద్యను పరిరక్షించాలంటే ముందు మౌలిక వసతుల కల్పన, బోధనా సిబ్బంది, నిరంతర పర్యవేక్షణ అవసరం ఈ మూడింటిపై దృష్టి సారించకుండా సమీక్షలతో సరిపెడితే మరింత సంక్షోభంలోకి కూరుకుపోయి కనుమరుగు కాక తప్పదు. ప్రభుత్వ విద్య పరిరక్షణ పోరాటాలు ఉధృతం కాక తప్పదు.

**ఫలితం ఇవ్వని బడిబాట :**

ప్రభుత్వం చేపట్టిన బడిబాట ఆశించిన ఫలితం ఇవ్వటం లేదు. ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాలని కోరుతున్నా తల్లిదండ్రుల నుంచి సానుకూల స్పందన రావటం లేదు. కొందరు ఉపాధ్యాయులను మీ పిల్లలు ఎక్కడ చదువుతున్నారంటూ ఎదురు ప్రశ్న వేస్తున్నారు. ఇటీవల ఓ ఉపాధ్యాయుడు నోరుజారి ప్రభుత్వ బడికి పిల్లలను పంపక పోతే రేషన్ బంద్ అవుతుంది అనగానే మీ పిల్లలను పంపటం లేదుగా జీతాలు తీసుకోరా అంటూ ఓ విద్యార్థి తండ్రి ప్రశ్నించిన ఘటన చర్చనీయాంశమైంది. రా రమ్మని పిలిచే బదులు మౌలిక వసతుల కల్పన, ఉత్తమ విద్యా బోధన జరిగితే విద్యార్థులు ఆకర్షితులవుతారన్న వాస్తవాన్ని మరిచిపోతున్నారు. 120 మంది బడిఈడు పిల్లలు ముఖ్యంగా ప్రాథమికోన్నత విద్య అభ్యసించే విద్యార్థులుంటే ఆ గ్రామ ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిది మంది మాత్రమే ఉన్నారంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు ఉపాధ్యాయులతో పాటు గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపిడివోలకు ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచే బాధ్యతను అప్పగించారు . మరి ఫలితం ఎలా ఉంటుందో.

## నీరా, కల్లును సేవించిన మిస్ వరల్డ్ పోటీదారులు




**ప్రజాపక్షం/హైదరాబాద్:** మిస్‌వరల్డ్ పోటీల కోసం ఆయా దేశాల నుంచి హైదరాబాద్‌కు వచ్చిన అందగత్తెలు.. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన కల్లు తాగారు. తెలంగాణలో సహజంగా దొరికే నీరాకల్లును.. మిస్ వరల్డ్ పోటీదారులు సేవించారు. మేకప్ వేసుకునే ఈ నీరా కల్లు సేవించి... చాలా ఎంజాయ్ చేశారు. తెలంగాణ కల్లు చాలా అద్భుతంగా ఉందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. తెలంగాణ రాష్ట్రంలో మిస్ వరల్డ్ పోటీలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ పోటీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చాలా అట్టహాసంగా నిర్వహిస్తోంది. శనివారం రోజు నుంచి ప్రపంచ సుందరి పోటీలు హైదరాబాద్ మహానగరంలో అంగరంగ వైభవంగా ప్రారంభం అయ్యాయి.


# సాహితీ విహారి



# సాహిత్యం.. యుద్ధానికి వ్యతిరేకం..

భారత్, పాకిస్తాన్ దేశాలు కాల్పుల విరమణ ప్రకటించాయి. కానీ, పాకిస్తాన్ ఒప్పందాన్ని ఉల్లంఘించి, సరిహద్దుల వెంట కాల్పులకు తగబడుతున్నదని, డ్రోన్లతో దాడులకు దిగుతున్నదని వార్తలు వస్తున్నాయి. ఏక్షణమైనా పూర్తి స్థాయి యుద్ధం ముంచుకొచ్చే ప్రమాదం లేకపోలేదు. పహల్గావ్‌లో ఉగ్రదాడి... అందుకు ప్రతీకారంగా భారత్ దాడులపై చర్చలు పక్కకు ఉంచితే, యుద్ధం ఎవరికీ మంచిది కాదనేది మాత్రం వాస్తవం. ఎందుకంటే, యుద్ధాలు వినాశనాన్నే తప్ప వికాసాన్ని కోరుకోవు. నిశ్శబ్ద వాతావరణంలో బాంబుల మోతలు హోరెత్తుతాయి. తమకు ఏ మాత్రం సంబంధం లేకుండానే, ఎంతో మంది ప్రాణాలు కోల్పోతారు... అంతకు మించిన సంఖ్యలో క్షతగాత్రులై, జీవచ్ఛవాలుగా మారిపపోతారు. తల్లి శవంపైపడి ఏడుస్తున్న పసికందును ఎవరు ఓదారుస్తారు? కన్నీటి చుక్కలతో రాసిన నరమేధానికి బలవుతున్న సామాన్యుడు కోలుకునేది ఎప్పుడు? తన ఇంటిని తినేసిన అగ్ని,తన కొడుకు శరీరాన్ని చివరి సారి చూసి రోదిస్తునే ఉన్న ఓ తల్లి కళ్లు తడారిపోయిన వైనానికి కారణం ఎవరన్న ప్రశ్నకు సమాధానం ఎవరిస్తారు? ప్రేమ గదులు, పిల్లల కలలు, బతుకు కథలు... అన్నీ తృటిలో మాయమైతే, సైనికుల బూట్ల సవ్వడిలో తెలియని భయం. 'శాంతి అంటే ఏమిటి?' అన్నది ఓ పసికూన ప్రశ్న. సమాధానం లేదుగానీ... తల్లివో.. తండ్రివో.. తోబుట్టువులో లేక సన్నిహితులవో.. నిశ్శబ్దంగా రక్తపు మరకలు ఎర్రగా మెరుస్తునే ఉన్నాయి. అప్పటి వరకూ అతని ముఖంపై కదలాడిన నవ్వు చీకటిలో కనుమరుగై, బాంబు శబ్దాలతో కలిసి నశించింది. యుద్ధం వచ్చిపడింది... ఇక పక్షుల పాటలు వినిపించవు.. నీలాకాశం కనిపించదు. పసికందుల కేరింతలు... పిల్లల ఆటపాటలు ఉండవు. యుద్ధం... నిర్దయం కొందరిది... కానీ బాధ మాత్రం లక్షలమందికి. శాంతి ఒక్కటే ఈ దారుణ ముఖచిత్రాన్ని మార్చివేయగలదు. రక్తపు నదులు పారకుండా నివారించగలదు. సర్వం కోల్పోతున్న సామాన్యుడి రోదనకు తెరవేయగలదు. శాంతి స్థాపనలో సాహిత్యం పాత్ర అత్యంత కీలకం. విషం కక్కే కొంత మంది కుల, మత ఛాందసవాదుల రచనలను విసిరేస్తున్నా, ప్రపంచ వ్యాప్తంగా ఏ దేశంలోనైనా సాహిత్యం యుద్ధాన్ని వ్యతిరేకించింది. యుద్ధవిధ్వంసం ఉంది. యుద్ధం అనే మాట వినగానే మన ముందు పేలుళ్లు, శవాలు, తల్లి చెంత చనిపోయిన శిశువు, కాలిన గ్రామాలు, మానవత్వం లేని కిరాతకత్వం వంటి ఎన్నో చిత్రాలు కనిపిస్తాయి.. కానీ ఈ మారణహోమాల వెనుక మౌనంగా నిలిచే ఓ శక్తి ఉంది.. అదే సాహిత్యం. ఇది మారణాయుధాలు, అస్త్రశస్త్రాలకు ప్రతిగా మానవ విలువలను నెమ్మదిగా, దీర్ఘకాలికంగా సమాజంలో నాటుతుంది. యుద్ధాన్ని వ్యతిరేకిస్తూ రచనలు చేయడం అనేది ఒక మానవతా ప్రకటన మాత్రమే కాదు.. ఓ నైతిక బాధ్యత కూడా. యుద్ధ వ్యతిరేక సాహిత్య చారిత్రక, సాంస్కృతిక, సామాజిక పరిణామాలను విశ్లేషిస్తే, శాంతి స్థాపన కోసం రచయితలు పడిన తపన కళ్లకు కట్టినట్టు కనిపిస్తుంది. చరిత్రలో యుద్ధ వ్యతిరేక సాహిత్యం అనేది యుద్ధం పుట్టకముందు నుంచే శాంతికి వేదికగా నిలిచింది. పురాణాల్లోనూ, శతకాల్లోనూ శాంతిని ప్రధానం చేసిన రచనలు కనిపిస్తాయి. పాశ్చాత్య సాహిత్యంలో లియో టోలిస్టాయ్ రచించిన 'వార్ అండ్ పీస్' ఒక గొప్ప ఉదాహరణ. ఈ నవలలో రష్యన్ సామాజిక స్థితిగతులు, యుద్ధవ్యతిరేక భావనలు స్పష్టంగా కనిపిస్తాయి. అదే విధంగా, ఎర్నెస్ట్ హెమింగ్వే రాసిన 'ఎ ఫేర్‌వెల్ టు ఆర్మ్స్' లాంటి రచనల్లో యుద్ధపు నీచ స్వభావం, మానవ సంబంధాల మీద దాని ప్రభావాన్ని వివరిస్తారు. కవి 'డల్స్ ఎట్ డెకోరమ్ ఎస్ట్' కవితలో గ్యాస్ దాడిలో ప్రాణాలు కోల్పోతున్న సైనికుని ఉదంతాన్ని విల్ఫ్రెడ్ ఓవెన్ వర్ణించారు. ఆ దృశ్యం ఎంత బాధతో కూడుకున్నదో వివరిస్తూ, శాంతి స్థాపన అవసరాన్ని చెప్పకనే చెప్పారు. ఇది యుద్ధ గర్వాన్ని ప్రశ్నించే గాథ. అదే విధంగా, రాండాల్ జారెల్ రాసిన 'ది డెత్ ఆఫ్ ది బాల్ టర్రెట్ గన్నర్' కవిత యుద్ధపు క్రూరత్వాన్ని కేవలం అయిదు పంక్తుల్లో వ్యక్తపరచిన శక్తిమంతమైన ఉదాహరణ. రెండవ ప్రపంచ యుద్ధానంతర సాహిత్యంలో రెండవ ప్రపంచ యుద్ధ అనంతరం సాహిత్యం పూర్తిగా మారిపోయింది. హోలోకాస్ట్ అనుభవాలపై వచ్చిన రచనలు సర్వజన మానవతావాదంపై దృష్టిని కేంద్రీకరించాయి. ఎలీ విజెల్ రచించిన 'నైట్' అనే హృదయవిదారక నవల ఒక యూదుడిగా అతను అనుభవించిన బాధను ప్రపంచానికి తెలియజేసింది. ఇది యుద్ధానికి వ్యతిరేకంగా అక్షరాల రూపంలో ఏడుస్తూ, ప్రపంచ నైతికతను మేల్కొలిపే ప్రయత్నం. జపాన్ లో హిరోషిమా, నాగసాకి బాంబుల ప్రభావంపై వచ్చిన రచనలు కూడా ఇలాంటివే. ఉదాహరణకు, సాదాకో, వెయ్యి కాగితపు సారసాల కథ.. వంటి రచనలు యుద్ధపు వికృతరూపాన్ని పిల్లల దృష్టితో చూపించి శాంతికి పునాదులు వేసే ప్రయత్నం చేశాయి. ఇటో సేయ్ రాసిన 'బ్లాక్ రైన్' నవల, మసుజి ఇబుసే రచనగా, అణు బాంబు ప్రభావాన్ని అద్భుతంగా ప్రతిబింబిస్తుంది. అలాగే, కురోసో నాగా వంటి రచయితలు జపాన్‌లో యుద్ధానంతర జీవనాన్ని తీవ్రంగా అక్షరాలలో బిగించారు. ఇవి అంతర్జాతీయంగా పాఠకులను మానవ విలువలపై మళ్లీ ఆలోచించాల్సిన అవసరాన్ని గుర్తుచేశాయి.




భారతీయ సాహిత్యంలో యుద్ధ వ్యతిరేక భావనలు కనిపిస్తాయి. గాంధీ తత్వాలు యుద్ధ వ్యతిరేక భావనకు మార్గదర్శకం. గాంధీజీ తన రచనల ద్వారా 'అహింసా పరమో ధర్మః' అనే సందేశాన్ని పలు రూపాలలో చెప్పారు. ఆయన రచనలు యుద్ధం పట్ల తిరస్కారాన్ని సున్నితంగా, కాని గంభీరంగా వ్యక్తం చేశాయి. తెలుగు సాహిత్యంలో కూడా 1965, 1971 యుద్ధాల తర్వాత వచ్చిన రచనలు యుద్ధాన్ని వ్యతిరేకించాయి. ముఖ్యంగా సాహిత్య అకాడమీ అవార్డు పొందిన కవులు, కథా రచయితలు ఆ కాలంలో శాంతి సందేశంతో కూడిన రచనలకే ప్రాధాన్యత ఇచ్చారు. నైతిక, తాత్విక స్థాయిలో యుద్ధాన్ని ప్రశ్నించారు. వట్టికోట ఆళ్వారుస్వామి, జాషువా లాంటి రచయితలు సామాజిక న్యాయంతోపాటు శాంతి అవసరాన్ని కూడా తమ రచనలలో వ్యక్తం చేశారు. తమిళ రచయిత జే. మోహన్ రాసిన కథలు మరియు కురుంతొక్ వంటి రచనల్లో యుద్ధం వలన నష్టపోయే సామాన్యుల జీవితం ఏ విధంగా ఉంటుందో హృదయాలను కదిలించేలా వర్ణించబడింది. హిందీ సాహిత్యంలో అశోక్ వాజపేయి, కవితా సింహ్ వంటి రచయితలు యుద్ధం పట్ల తీవ్ర విమర్శాత్మక దృక్పథంతో రచనలు చేశారు. ఆధునిక కాలంలో యుద్ధ వ్యతిరేక సాహిత్యంప్రస్తుత కాలంలో, సోషల్ మీడియా, డిజిటల్ పబ్లిషింగ్ వేదికల ద్వారా యుద్ధ వ్యతిరేక సాహిత్యం మరింత వేగంగా వ్యా పిస్తోంది. పొద్దుతిరుగుతున్న ప్రపంచంలో మానవ హక్కు ల కోసం పోరాడే రచయితలు, జర్నలిస్టులు, బ్లాగర్లు నేటి యుద్ధ వ్యతిరేక వేదికలు. ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్ వంటి వేదికలపై వచ్చిన కవితలు, వీడియో ఎస్సేలు, డాక్యుమెంటరీలు కూడా సాహిత్యంగానే పరిగణించబడుతున్నాయి. పాలస్తీనాఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో నయా హషిమ్, మహ్మూద్ దర్వీష్ వంటి అరబ్ కవుల కవిత్వం అంతర్జాతీయంగా ప్రసిద్ధి పొందింది. అలాగే ఉక్రెయిన్ రచయిత సెర్గీ జాడాన్ యుద్ధంతో చుట్టుముట్టిన జీవితాలను వర్ణిస్తూ యూరప్ మానవతా వేదికలపై ప్రసిద్ధి చెందారు. ఇటీవలి కాలంలో, న్యూయార్క్ టైమ్స్, గార్డియన్ పత్రికలలో ప్రచురితమయ్యే రచనలు కూడా యుద్ధ వ్యతిరేక వేదికలుగా నిలుస్తున్నాయి. 'పిఇఎన్ ఇం టర్నేషనల్' వంటి సంస్థలు సాహిత్య స్వేచ్ఛకు మద్దతుగా, యుద్ధాలపై స్పందించే రచయితలకు వేదికలు కల్పిస్తున్నాయి. యుద్ధ వ్యతిరేక రచనల సామాజిక ప్రభావంఈ తరహా రచనలు శాంతికి మార్గం వేస్తాయి. విద్యార్థుల్లో, యువతలో చైతన్యం పెంచుతాయి. యుద్ధం అనేది ఒక సమూహానాశనం మాత్రమే కాకుండా, వ్యక్తిగతంగా మనస్సును ఎలా ముక్కలు చేస్తుందో ఈ రచనలు తెలియజేస్తాయి. విఖ్యాత రచయిత అర్చర్ బట్లర్ హుల్ పేర్కొన్నట్లు, మనిషి వేదనలో ముంచి రాసిన అక్షరాలు ఎప్పుడూ కత్తి కంటే బలంగా హృదయాల్లో నాటుకుంటాయి. సాహిత్యం గుండెను తాకే శక్తి కలిగి ఉండటం వలన, యుద్ధం మీద సంభావ్య స్పందనలు వ్యక్తులలో మా ర్పును తీసుకురాగలవు. అందుకే, యుద్ధ వ్యతిరేక రచనలు అవసరం. అలాంటి సాహిత్యం మనసును మేల్కొలిపే అక్షర యుద్ధం. ఇది మారణాయుధాలతో పోరాడే పని కాదు.. మార్గదర్శకంగా మారే కళ. రచయిత చేతిలో కలం శక్తిమంతమైన ఆయుధం. అది కలం మించిన శక్తి. యుద్ధాన్ని ఆపలేకపోయినా, శాంతికి బీజం వేయగలదు. ఈ రోజుల్లో, శాంతి గురించి మాట్లాడే ప్రతి కలం ఒక దీ పంలాంటిది. అలాంటి కలాల వెలుగులు, ఈ అంధకార యుద్ధ ప్రబల ప్రపంచంలో మార్గదర్శకంగా నిలుస్తాయి. అందుకే యుద్ధాన్ని వ్యతిరేకించే రచనలు అవసరం. ఇవే మానవతకి తిరిగి అర్థం చెప్పగల మార్గాలు.

– సత్య శ్రీ

## 'అదివాస్తవికత'కు చిరునామా నారాయణబాబు

మే 17న జయంతి





తెలుగు సాహిత్యంలో సర్రియలిజం లేదా అధివాస్తవికతను పరిచయం చేసిన ప్రముఖ కవిశ్రీరంగం నారాయణబాబు (మే 17, 1906 అక్టోబర్ 2, 1961). విజయనగరంలో, 1906, మే 17వ తేదీన జన్మించిన ఆయన ఆజన్మ బ్రహ్మచారిగా జీవితం గడిపారు. నారాయణబాబు పద్య రచనల కు, భావ కవిత్వానికి భిన్నంగా కొంతమందితో కలసి సర్రియలిజం అనే విదేశీయ ప్రక్రియ ను అనుసరించి రచనలు చేశారు. ఒక యదార్థ రూపాన్ని కవితలోనో, చిత్రలేఖనంలోనో చూపించినపుడు, ఆ విషయం యొక్క మూల స్వరూపాన్ని వివిధ విపరీత పరిస్థితులలో వర్ణించి మరువలేని చిత్రంగా ప్రదర్శించడాన్ని 'సర్రియలిజం' అంటారు. దీనిని 'అధివాస్తవికత' అని కొందరు అంటే, 'అతి వాస్తవికత' అంటే బాగుంటుందని మరికొందరు పేర్కొంటారు. 'మార్చు', 'విశాఖపట్నం', 'ఫిడేలు', 'నాయుడుగారి వేళ్ళు', 'గడ్డిపరక', 'గేదెపెయ్యి', 'తెనుగురాత్రి', 'రుధిరజ్యోతి', 'కపాలమోక్షం', 'కిటికీలో దీపం', 'ఊరవతల', 'పండగనాడు', 'మౌన శంఖం', 'సంపంగి తోట' వంటి ప్రసిద్ధ రచనలు చేశారు. వీటిలో 'రుధిరజ్యోతి'ని మహాకవి శ్రీశ్రీకి అంకితమిచ్చారు. నారాయణ బాబు రచనలు ఆయనను విభిన్న ధోరణుల రచయితగా, ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకున్న కవిగా నిలబెట్టాయి. 20వ శతాబ్దపు తొలి భాగంలో తెలుగు కవిత్వాన్ని ఆధునిక దిశగా నడిపించిన మహా వ్యక్తుల్లో ఆయన ఒకరు. స్వతంత్ర భావధోరణి, హృదయాన్ని హత్తుకునే శైలీ, సామాజిక స్పందనతో కూడిన రచనలు ఆయన సాహిత్యంలో కనిపిస్తాయి. నారాయణబాబు 1903లో ప్రకాశం జి ల్లాలోని ఒక బ్రాహ్మణ కుటుంబంలో జన్మించారు. బాల్యంలోనే సాహిత్యంతో ఆసక్తి పెంపొందింది. ఆయనకు ఆంగ్ల భాషపై మంచి పట్టు ఉండటం వల్ల పాశ్చాత్య సాహిత్యాన్ని చదివే అవకాశం లభించింది. రవీంద్రనాథ్ టాగూర్, పిబి షెల్లీ, జాన్ కీట్స్, ఆస్కార్ వైల్డ్ వంటి కవుల ప్రభావం ఆయన మీద కనిపిస్తుంది. అయితే, ఆ ప్రభావాన్ని మూలన పెట్టి తనదైన శైలిని నెలకొల్పడం లో ఆయన ప్రత్యేకత ఉంది. నారాయణబాబు కవిత్వంలో ఆధునికత, సామాజిక చైతన్యం, స్నేహతత్వ భావాలు, భావగంభీరత, సౌందర్యశాస్త్రపు స్ఫూర్తి స్పష్టంగా కనిపిస్తాయి. ఆయన కవిత్వం మానవతావాదానికి ప్రతీకగా నిలిచింది. అభ్యుదయ భావాలు, స్వేచ్ఛాప్రధానమైన వ్యక్తీకరణ ఆయన రచనల్లో ముఖ్యాంశంగా దర్శనమిస్తుంది. బహుశా, ఇది తెలుగు కవిత్వాన్ని పాశ్చాత్య సాహిత్యంతో కలిపే ప్రయత్నంగా భావించవచ్చు. ప్రేమ, స్నేహం, ప్రకృతి, పరవశత వంటి భావాలు ఆయన కవితల్లో ఉదాత్తంగా వ్యక్తమయ్యాయి. భా వం ఏదైనా గాఢతతో, హృదయాన్ని తాకేలా ఉంటుంది. ఆయన పద్య రూ పంలో కొత్త ప్రయోగాలకు శ్రీకారం చుట్టారు. పాశ్చాత్య కవిత్వంలోని 'ఫ్రీ వర్స్' ప్రభావం కలిగిన రీతిలో రచనలు చేసారు. ఆయన రచనల్లో మనిషి భా వోద్వేగాలు, ప్రేమలోని పరవశత, జీవితంలోని విపరిణామాలు చాలా చక్క గా వ్యక్తమవుతాయి. నారాయణబాబు రచనలు తదుపరి కవులపై తీవ్రమైన ప్రభావం చూపాయి. ముఖ్యంగా 1940ల తర్వాత తెలుగు సాహిత్యంలో వ చ్చిన మార్పుకు పునాదులు వేసిన వారిలో ఆయన ఒకరు. నిగూఢ భావనల్ని సరళంగా చెప్పగలగడం ఆయన ప్రత్యేకత. నారాయణబాబు కవిత్వంపై సాహిత్య విమర్శకులు విస్తృతంగా అధ్యయనం చేశారు. 'తెలుగు కవిత్వానికి ఒక కొత్త ఊపిరి' అని పలువురు విమర్శకులు ప్రశంసించారు. అనేక యూనివర్సిటీల్లో ఆయన రచనలు అధ్యయనపాఠ్యంగా ఉన్నాయి. నారాయణబాబు కవిత్వం తెలుగు సాహిత్యంలో ఒక మలుపు. భావ ప్రకటనలో స్వేచ్ఛ, భాషలో నయగర్భితత, భావనలలో ఆదునికత కలగలిసిన ఆయన రచనలు నేటికీ పాఠకులను మంత్రముగ్ధులను చేస్తున్నాయి. నారాయణబాబు తెలుగు కవిత్వాన్ని కొత్త ఎత్తులకు తీసుకెళ్లిన మార్గదర్శకుల్లో అగ్రగణ్యుడు.ఈ వ్యాసాన్ని మీరు వ్యాసరూపంగా పాఠశాల, కళాశాల ప్రాజెక్టుల కోసం ఉపయోగించవచ్చు. నారాయణబాబు పూర్తిపేరు శ్రీరంగం నారాయణస్వామిబాబు. బాల్యంలోనే మృదువైన స్వభావం, కలలకైనా కలల దృష్టి, రచనాపట్ల ఆకర్షణ మొదలయ్యాయి. చిన్నతనం నుంచి నారాయణబాబు సంప్రదాయ ధోరణులను నిలదీసేవారు. తర్వాతి కాలంలో ఈ స్వభావమే ఆయన విప్లవాత్మక కవిత్వానికి పునాదిగా నిలిచింది. నారాయణబాబు ఎదిగిన కాలం బ్రిటిష్ వలస పాలనలో గడిచింది. భారతదేశంలో స్వాతంత్ర్య చైతన్యం ఉదయించింది. ఉద్యమాలు, నిరసనలు, అహింసా భావం వంటి అంశాలు ఆయనను ప్రభావితం చేశాయి. అయితే ఆయన పూర్తిగా రాజకీయంగా కాక, సాహిత్య ద్వారా చైతన్యాన్ని అందించాలనుకున్నారు. తన ఆలోచనలకు కట్టుబద్దారు.

## తప్పక చదవాల్సిన పుస్తకం

## వేదకాలానికి అక్షర రూపం రుగ్వేద ఆర్యులు

హిందీ యాత్రాసాహిత్య పితామహుడు, బహుభాషావేత్త, తాత్వికుడు, మార్క్సిస్టు మేధావి, ప్రఖ్యాత చరిత్రకారుడు, రచయిత, యాత్రికుడు రాహుల్ సాంకృత్యాయన్ రచనల్లో ఒకటి 'రుగ్వేద ఆర్యులు'. చారిత్రకభౌతికవాదానికి ఇది నిలువటద్దం. దీనిని కేవలం సాధారణ ఆధ్యాత్మిక లేదా ధార్మిక గ్రంథంగా చూడడానికి వీల్లేదు. రుగ్వేదంలోని శ్లోకాలను ఆధారంగా చేసుకొని చారిత్రక విశ్లేషణ చేస్తుంది. రచయిత మార్క్సిసు భావజాలం ఉన్న వ్యక్తి కాబట్టి, ఆర్థిక వ్యవస్థ, సామాజిక సమీకరణాలు పై ఎక్కువ దృష్టి ఉంటుంది. రుగ్వేద యుగపు ఆర్యుల జీవన విధానం, చారిత్రక, సామాజిక, తాత్విక విశ్లేషణగా ఈ పుస్తకాన్ని పేర్కోవచ్చు. భారతీయ పురావస్తు చరిత్ర, ఆధ్యాత్మికత, సామాజిక నిర్మాణాలపై భౌతికవాద దృక్పథంతో రచయిత దీనిని హృద్యందంగా మలిచారు. సామాన్యులకు అర్థమయ్యే రీతిలో సులభమైన భాషను ఉపయోగించారు. తెలుగు అనువాదం కూడా కూడా అదే స్థాయిలో ఉంటుంది. ఈ పుస్తకం, భారతదేశంలో ప్రారంభకాలపు ఆర్యుల చరిత్రను వేదాల ఆధారంగా విశ్లేషించే ఒక అద్భుత గ్రంథం. ఇది వేద సాహిత్యాన్ని చారిత్రక దృష్టికోణంతో పరిశీలించి, అప్పటి సమాజాన్ని, ఆర్థిక పరిస్థితిని, రాజకీయ వ్యవస్థను, సాంస్కృతిక నిర్మాణాన్ని వెల్లడించే ప్రయత్నం. ఇది కేవలం భక్తి రసంతో కరగని వేదాలలోని సామాజిక వాస్తవాలను వెలికి తీయడమే కాకుండా, ఆర్యుల వలసల, వర్ణవ్యవస్థ ఆధారాలను వెలికితీసే ప్రయత్నంగా కూడా చెప్పవచ్చు. 'రుగ్వేద ఆర్యులు' పుస్తకంలో రాహుల్ సాంకృత్యాయన్ వేదాలను భక్తిపరంగా కాక, చారిత్రక, సమాజ శాస్త్ర, ఆర్థిక దృష్టితో విశ్లేషించారు. రుగ్వేదంలోని సూక్తులను ఆధారంగా తీసుకొని, అప్పటి కాలపు ఆర్యుల జీవన విధానం, వారి ఆచారాలు, రాజకీయం, ఆర్థిక వ్యవస్థ, శ్రమ విభజన వంటి అంశాలను విశ్లేషించారు. ఆయన పరిశీలనలో మార్క్సిస్ట్ సిద్ధాంతాల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. ఈ పుస్తకం వేదకాలం నాటి ఆర్యుల మూలాల అన్వేషణ,వారి సామాజిక, ఆర్థిక నిర్మాణం విశ్లేషణ, భారతదేశ చరిత్రలో వారి పాత్ర అనే మూడు ప్రధాన అంశాలపై దృష్టి సారిస్తుంది. రాహుల్ సాంకృత్యాయన్ రచనశైలిలో స్పష్టత, ఉదాహరణలు, పరిశోధనా దృక్పథం, భావనల్లో పారదర్శకత కనిపిస్తాయి. ఆయన వేదాలు అర్థం చేసుకోవడంలో సాంప్రదాయ భాష్యకారులకే కాక, ఆధునిక పాశ్చాత్య పరిశోధకుల దృష్టికోణాన్నీ కలగలిపారు. అయితే, ఆయన వివరణలు అంచనాలతో కాకుండా ఆధారాలతో నడవడమే ఈ పుస్తకానికి విశ్వసనీయతను కలిగించింది. సాంకృత్యాయన్ రచనలో ముఖ్యాంశంగా కనిపించే అంశంఆర్యులు భారత్‌కి వలస వచ్చినవారన్న సిద్ధాంతం. ఆయన వేదాల్లోని భాష, వర్ణనలు, భౌగోళిక సూచనలను అధ్యయనం చేసి ఆర్యుల వలస సిద్ధాంతాన్ని సమర్థించారు. ఆయన ప్రకారం, ఆర్యులు మధ్య ఆసియా ప్రాంతం నుంచి భారతదేశంలోకి ప్రవేశించారు. వేద కాలంలో వర్ణవ్యవస్థ ప్రారంభ దశలో ఉందని, అయితే అది అప్పటి శ్రమ విభజనకు సంబంధించినదిగా వర్ణించారు. కాలక్రమేణ వర్ణవ్యవస్థ కఠినమై, ఆర్థిక, సామాజిక అసమానతలకు దారి తీసిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఆర్యులు మూలంగా వ్యవసాయ వ్యవస్థను విస్తరించినప్పటికీ, పెద్దఎత్తున పశుపోషణ, దండయాత్రల ద్వారా సంపత్తి సంపాదన వృద్ధి చేశారని పుస్తకంలో వివరించారు. ఆయన వేదాలలోని ఆస్తి, సంపద, బలాత్కార యుద్ధాలు వంటి అంశాల ద్వారా ఆర్థిక శోషణ తత్వాన్ని వెలికితీశారు. వేదాల్లో మహిళల పాత్రపై చర్చిస్తూ, ఆ ప్రాథమిక సమాజంలో కొంత స్వేచ్ఛ ఉన్నా, అది పురుషాధిపత్య వ్యవస్థలో క్రమంగా కోల్పోయిందని ఆయన విశ్లేషించారు. సాంకృత్యాయన్ రచనలపై కార్ల్ మార్క్స్ సిద్ధాంతం తీవ్ర ప్రభావం కనిపిస్తుంది. రుగ్వేద ఆర్యులు పుస్తకంలో ఆయన వేదకాలిన సమాజాన్ని భౌతికవాద దృష్టితో విశ్లేషించారు. వర్గ పోరాటం, ఆర్థిక అసమానత, శ్రమ విభజన, అధికార కలపాటు వంటి అంశాలను వేదాలలో కనిపించే ఉదాహరణల ద్వారా ప్రదర్శించారు. ఇందులో విశ్లేషణాత్మక విశేషాలు కూడా ఉన్నాయి. వేదాల్లోని సహస్రసంఖ్యక దేవతలు, రితువులు, త్యాగాలు మొదలైన వాటిని ఆధ్యాత్మికంగా కాకుండా, సామాజిక ఆచారాల ప్రతీకలుగా ఆయన వివరించారు. పూర్వీకుల పట్ల భయభక్తి కలగాలనే ప్రయత్నంగా త్యాగ క్రమాలను చిత్రీకరించారు. వేదాలు ఆర్యుల విశ్వదృక్కోణం, వారి భూమి పట్ల ఆకాంక్ష, ఇతర జనజాతులపై వారి అగ్రహం వంటి విషయాలను చాటుతున్నాయని వివరించారు. ఈ పుస్తకానికి వ్యతిరేకంగా కొన్ని వర్గాలు విమర్శలు చేస్తారని తెలిసినా ఆయన వెనుకంజ వేయలేదు. వేదాలను పవిత్రమైన ధర్మగ్రంథాలుగా భావించే హిందూ సంప్రదాయవాదులు దీనిని శత్రుత్వ దృష్టితో చూసినప్పటికీ చలించలేదు. ఆర్యవాద దృక్పథాన్ని విస్మరించి, ద్రవిడ జాతుల స్థితిని స్పష్టంగా చర్చించలేదన్న విమర్శలు కూడా లేకపోలేదు. మార్క్సిస్టు భావజాలం ఆయన రచనలను ప్రభావితం చేసిందని, కొన్నిచోట్ల అర్థవంతమైన దృక్పథానికి లోటు వచ్చిందన్న అభిప్రాయాలు ఉన్నాయి. అయితే, ఈ విమర్శలు ఉన్నా, చారిత్రక పరిశోధనకు పునాది వేసిన రచనగా ఇది నిలిచింది. సాంకృత్యాయన్ రచించిన 'రుగ్వేద ఆర్యులు' పుస్తకం భారత చరిత్ర పరిశోధనకు కొత్త దిశను చూపింది. వేదాలను కేవలం ధార్మిక గ్రంథాలుగా కాకుండా, సామాజిక, ఆర్థిక, భౌతిక జీవితాన్ని ప్రతిబింబించే ఆధారాలుగా చూడాలన్న దృష్టిని ఇచ్చింది. ఇది భారతీయ చరిత్ర అధ్యయనానికి ఒక మార్గదర్శిగా మారింది. నేటి సూత్రాల పరంగా పుస్తక ప్రాముఖ్యతఈ గ్రంథాన్ని ఆధునిక భారత చరిత్రకారులు, సమాజ శాస్త్రవేత్తలు ఇప్పటికీ ప్రామాణిక గ్రంథంగా పరిగణిస్తున్నారు. ప్రాచీన భారత సమాజాన్ని అధ్యయనం చేయాలనుకునే పరిశోధకులకు ఇది ఒక ముఖ్యమైన గ్రంథంగా మారింది. ఇది ఉపన్యాసాలలో, యూనివర్సిటీలలో చారిత్రక విశ్లేషణలలో ప్రస్తావించే గ్రంథమైంది. ఈ పుసతకం సాంకృత్యాయన్ చారిత్రక దృష్టి, పరిశోధనా నైపుణ్యం, మార్క్సిస్టు ఆలోచనా విధానానికి ప్రతిరూపం. ఇది వేదాల్ని నూతన రీతిలో చూసే కళ్ళజోడుగా పనిచేసింది. హిందీ భాషలో రచించిన ఈ గ్రంథాన్ని అనేక భారతీయ భాషల్లోకి అనువదించారు. ఇది కేవలం పాఠ్యగ్రంథంగా కాకుండా, చారిత్రక దృష్టిని ప్రసారించే గొప్ప ప్రయత్నంగా నిలిచింది. సూక్ష్మంగా చెప్పాలంటే, 'రుగ్వేద ఆర్యులు' ఒక జ్ఞానపరమైన విప్లవాత్మక గ్రంథం. ఇది భారతదేశ పురాతన చరిత్రను రుగ్వేద శ్లోకాల ఆధారంగా, మార్క్సిస్టు దృష్టితో విశ్లేషించే అరుదైన రచన. వేదాలను తత్వాలుగా కాకుండా చారిత్రక పాఠ్యాంశాలుగా చూడాలనుకునే వారికి ఇది తప్పనిసరిగా చదవాల్సిన పుస్తకం.




మానవ చరిత్ర అభివృద్ధి అనేది సహజమైన పరిణామం. సమాజ మార్పులు క్రమంగా, వనరుల పరిమితి, వాతావరణం ఆధారంగా జరిగాయి. మత వ్యవస్థలు, సామాజిక నిర్మాణాలు మానవుని అవసరాల ప్రకారం రూపుదిద్దుకున్నాయి. మార్పు అనేది మానవ చరిత్రకు మూర్తిమత్వం. అయితే, రుగ్వేద కాలంలో తాత్వికత-గానీ, మత విధానాలుగానీ లేవు. ఆ కాలంలో కేవలం సామాజిక కట్టుబాట్లు, పనుల విభజన మాత్రమే ఉండేవి. వేదం అనగానే పురాణాలకు లేదా దేవతలకు సంబంధించిన అంశంగా చాలా మంది అనుకుంటారు. అయితే, రుగ్వేద ఆర్యులు పుస్తకం చదివిన ప్రతి ఒక్కరూ చరిత్రను కొత్త దృక్కోణంలో చూడగలుగుతారు. ఈ రచన మనిషి ప్రయాణాన్ని అత్యంత హృద్యంగా చూపి-స్తుంది. వాస్తవానికి, ఈ గ్రంథం మానవ వికాసం మీద ఒక విలువైన పాఠం. ఈ పుస్తకం చదవడం ఓ అపూర్వమైన ప్రయాణం. రుగ్వేద కాలాన్ని, జీవన విధానాన్ని ఈ పుసతకంప్రతిబింబిస్తుంది. రాహుల్ సంకృత్యాయన్ రచనా శైలి ఎంతో సహజమైనది. వలసలు, యుద్ధాలు, మతమార్పులు, ఆర్థిక మార్పులు వంటి సహజమైన పరిణామాలని ఆయన తన రచనల్లో చూపించారు. రచనల్లో కేవలం రాజులు, సామ్రాజ్యాల చరిత్ర కాకుండా, సామాన్య మానవుడి జీవన యాత్రను పట్టించుకున్నారు. అందుకే 'ఓల్గ నుంచి గంగకు' మాదిరిగానే రుగ్వేద ఆర్యులు కూడా ఒక ప్రత్యేక దృశ్యకావ్యాన్ని కళ్ల ముందు ఆవిష్కరిస్తుంది. ఇందులోని ప్రతి భాగం ఆనాటి సమాజపు ప్రతిబింబంగా గోచరిస్తుంది. మన ఆధునిక జీవితానికి మూలం ఏమిటో, మనం ఎలా ఈ స్థాయికి వచ్చామో ఈ పుస్తకం ద్వారా స్పష్టంగా అర్థమవుతుంది.ఇది కేవలం చరిత్ర కాదు.. అది మన చిత్తచైతన్యపు గమనం కూడా.

**పుస్తకం పేరు: రుగ్వేద ఆర్యులు**

రచన: రాహుల్ సంకృత్యాయన్
తెలుగు సేత: చాగంటి తులసి
ప్రతులకు: నవచేతన పబ్లిషింగ్ హౌస్
12-1-493/VA,
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
జిఎస్ఐ పోస్ట్,
హైదరాబాద్: 040 29884453/ 54.

## ఈ వారం కవితలు

### కామ్రేడ్ పశ్య కన్నమ్మకు జోహార్లు

సాయుధ పోరాట చరితలో
వీరవనితవు పశ్య కన్నమ్మ...
అందుకో జోహార్లు.... మాయమ్మ
ధీరవనిత పశ్య కన్నమ్మ..
అందుకో జోహార్లు మాయమ్మ....

॥ అందుకో ॥

అన్న శంబిరెడ్డి ఆశయ స్ఫూర్తితో
ఆంధ్ర మహాసభకు కదలి వెళ్ళినావు
ఉద్యమ నేత పశ్య రాంరెడ్డి
గుండె చప్పుడై గుభాలించావు
జంట పక్షులు లాగా పోరాట దారిలో
శత్రు దాడులను తిప్పి కొట్టినారు
ఎర్రజెండా.. పరిమళం ..నీవమ్మా
అందుకో జోహార్లు ..కన్నమ్మ

॥ అందుకో ॥

కష్టాల దారిలో కమ్యూనిస్టు జండెత్తి
పేదోళ్ల కష్టాల కడతేర్చకదిలావు
దుక్కి దున్నేటప్పుడు
నాటు వేసేటప్పుడు
పొలమంతా కోసి కుప్పపెట్టేటప్పుడు



కుప్పనూర్చేటప్పుడు చాటకొట్టేటప్పుడు
కళ్ళంలో ధాన్యాన్ని ఇల్లు చేర్చేటప్పుడు
మహిళలు పడుతున్న బాధలను చూసావు
మహిళా సంఘం పెట్టి బతుకంతా నడిచావు
కడదాకా కమ్యూనిస్టు జెండయ్యి బతికావు

॥ అందుకో ॥

విభేదాలు వచ్చి పార్టీ చీలినప్పుడు
సిపిఐ జెండా ఎత్తిపట్టినావు
భారత జాతీయ మహిళా సమాఖ్య
నాయకురాలిగా పోరాడి గెలిచావు
పేదలకు ఇండ్లు పెన్షన్లు ఇవ్వాలని

సొంత కాళ్ల మీద మహిళ బతకాలని
కుట్టు మిషన్ల శిక్షణ కేంద్రం
మహిళా మండలి భవనాన్ని కట్టావు
ఆదర్శ నేతవు నీవమ్మా....
కామ్రేడ్ పశ్య కన్నమ్మ.


॥ అందుకో ॥

సాయుధ పోరాట వీరులేసిన బాట
ఎర్ర ఎర్ర జెండాలు విరబూసిన తోట
తెలంగాణ మాగాణం తెగువ చూపిన తూట
మట్టి మనుషుల జేరి తట్టి లేపిన పాట
పేదోళ్ల ఇండ్లలో ఎగిరేటి బావుటా
ఆ బాటలో... పాటలో .... నీవమ్మా
నిన్ను మర్చిపోము మేము కన్నమ్మ
అందుకో జోహార్లు.... మాయమ్మ
వీర వనిత .... పశ్య కన్నమ్మ
రైతు నేత పశ్య కన్నమ్మ
'అందుకో ' జోహార్లు మాయమ్మ
మహిళా సంఘం నేత.. కన్నమ్మ
అందుకో జోహార్లు మాయమ్మ
సాహసాల చరిత నీవమ్మా
కమ్యూనిస్టు నేత కన్నమ్మ
జోహార్లు జోహార్లు నీకమ్మ
కామ్రేడ్ పశ్య కన్నమ్మ....

(తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు పశ్య కన్నమ్మ సంతాప సందర్భంగా ఆమెకు నివాళి అర్పిస్తూ...)

కె.వి.ఎల్., 9490952649

### జయహో సైనికా



పహల్గాం రక్త చరిత్ర
రాస్తున్నది మరోచరిత
ముచ్చటినే ఓపిక లేదిక
సహనం లేచింది
శాంతం ఉరిమింది

ఈ నేలలేచిన భుగభుగలు గగనతలంలో,
శత్రుతలాపున అగ్ని విస్ఫోటనం...
ఊళలేసె నక్కలఊపిరాగింది అక్కడ
క్కడ నక్కి ఉన్న నక్కలూ ఇక ఖతమే !
ఉగ్రసంహారం విజయారంభం
వీరజవాన్ నీకు వందనం

అస్తమించని సరిహద్దుల పొద్దులు
జాతి గుండె చప్పుడు మీరే
వీరపుత్రులారా!
హద్దేలేని మీత్యాగాలకు ఏమివ్వగలం..
ఉప్పొంగుతున్న హృదయంతో, గళ
మెత్తి నినదిస్తామంతే
జయహో భారత్

జయహో వీరజవాన్
హెచ్చిన మతోన్మాద
పైశాచిక పయనంలో
పుట్టలు పుట్టలుగా స్థావరాలు..
పాలు పోసి పెంచిన కోరల్లో
చిక్కుకొని వదరుతున్నవ్
మతి గతి తప్పి పౌర ప్రయోజనాలు
గాలికొదిలిన పాకిస్తాన్

సహకార దేశాల మంత్రాంగంలో
యంత్రాంగంలో మర బొమ్మవై
ప్రాణాలే పెట్టుబడిగా ఆయుధాలే
అవసరాలుగా బతుకుతున్నవు

ఇంత జరిగినా పంతమా!
కయ్యానికి కాలుదువ్వుతూ
తెగబడుతున్నావా ?
త్రివిధ దళాల ఉగ్రరూపం
త్రినేత్రం.. ఉప్పొంగిన
సింధుతరంగం..
మా కరుణ ధారలు
అగ్నిదారాలుగా మారి
మసికాకముందే మేలుకో..

మాశాంతం శిఖరాగ్రమే!
అహింసా మాధర్మమే! లంఘించి
దూకితే మాత్రం
ఏ దిక్కు దౌడు తీసిన దిక్కుండదు
మిగిలేవి శిథిలశకలాలే
'ధర్మహింసా తదైవచ'
యాదుంచుకో... ! యాజ్జేసుకో...!!

గడ్డం సులోచన
7702891559



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## ‘ఆపరేషన్ సిందూర్’ కొనసాగుతోంది

### ఇచ్చిన పనిని పర్‌ఫెక్ట్‌గా పూర్తి చేశాం : ఐఎఎఫ్

**న్యూఢిల్లీ :** భారత్–పాకిస్థాన్ ఉద్రిక్తతల వేళ భారత వాయుసేన కీలక ప్రకటన చేసింది. ‘ఆపరేషన్ సిందూర్’ కొనసాగుతోందని వెల్లడించింది. దీనిలో భాగంగా తమకు అప్పగించిన పనులను అద్భుత నైపుణ్యాలతో అత్యంత కచ్చితత్వంతో పూర్తి చేసినట్లు తెలిపింది. ఈ మేరకు ఎక్స్‌లో ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ ఓ పోస్ట్ పెట్టింది. ఆపరేషన్స్ ఇంకా కొనసాగుతున్నందున తర్వాత అధికారికంగా వివరాలు వెల్లడిస్తామని పేర్కొంది. అప్పటి వరకు తప్పుడు సమాచారానికి దూరంగా ఉండాలని వాయుసేన విజ్ఞప్తి చేసింది. జమ్ముకశ్మీర్‌లోని పహల్గామ్‌లో ఏప్రిల్ 22న ఉగ్రవాదులు పాశవికంగా పర్యటకులపై కాల్పులు తెగబడి 26మంది పొట్టనపెట్టుకున్నారు. దీంతో దేశం మొత్తం ఆగ్రహంతో రగిలిపోయింది. దీంతో భారత సైన్యం మే 6, 7 రాత్రి పాక్, పిఒకెలోని 9 ఉగ్రవాద శిబిరాలపై మెరుపుదాడులు చేసి ప్రతీకారం తీర్చుకుంది. ఆ తర్వాత పాకిస్థాన్ భారత సరిహద్దు ప్రాంతాలు లక్ష్యంగా కాల్పులకు దిగింది. దీంతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తీవ్ర స్థాయికి చేరాయి.

# శ్రమజీవుల ఆశాజ్యోతి పశ్యకన్నమ్మ



పశ్య పద్మ

స్వాతంత్ర సమరయోధురాలు, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు పశ్యకన్న మ్మ ఇటీవల తుది శ్వాస విడిచారు. 97 సంవత్సరా ల పరిపూర్ణ మైన జీవితంలో ఆమె నిర్వహించిన పాత్ర ఘనమైనది. చరిత్రాత్మకమైనది. అతి చిన్న వయసులోనే అనేక ప్రభావాలకు, ఒత్తిడులకు గురైంది .

భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరీ రద్దుకై, ఫ్యూడల్ జమీందారీ,జాగీర్దారీ విధానం రద్దుకై , నిరంకుశ నిజాం పాలనను అంతమొందించడానికి సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో పాల్గొన్నారు. సాంఘిక ఆర్థిక జీవితంలో ప్రజలు అడ్డు అదుపు లేకుండా సాగుతున్న ఫ్యూడల్ దోపిడీకి బలవుతున్న పరిస్థితుల పట్ల తీవ్రంగా ఆందోళనకు గురయింది .మహిళలపై అత్యాచారాలు, సామూహిక మానభంగాలు చిత్రహింసలు కొనసాగిన రోజులలో నిజాం పోలీస్ అరెస్ట్ చేయడానికి ఇంటికి వస్తే మిద్దె పైకి వెళ్లి దూకి చనిపోవాలనుకుంది. పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి ఆ సాయంత్రం విడుదల చేయటంతో ఊపిరి పీల్చుకుంది .ముఖ్యంగా రైతులు జాగీరు ప్రాంతంలో నీటిపారుదల సౌకర్యం ఉన్న భూమిపై పన్ను అధికంగా ప్రభుత్వ ప్రాంతాలలో వసూలు చేసే దానికి పది రెట్లు ఎక్కువగా ఉండేది. పన్ను కట్టలేని రైతులను భూస్వాముల గుండాలు చిత్రవధకు గురిచేసి చివరకు రైతుల నుండి జమీందారులు భూమిని లాక్కునేవారు. వీటితోపాటు వ్యవసాయ కుటుంబంలో పుట్టి పెరిగిన పశ్య కన్నమ్మగారి పై అనేక ప్రభావాలు తెలంగాణ సాయుధ పోరాటం లో పాల్గొనటానికి పురి కోల్పోయి. మా తాతయ్య పశ్య లక్ష్మీ నరసింహారెడ్డి (మా అమ్మగారి మేనత్త భర్త)1941 వ సంవత్సరంలో చిలుకూరులో జరిగిన 8 వ ఆంధ్ర మహాసభకు హాజరయ్యారు. ఊరి పెద్దమనిషి గా, ముఖ్యంగా వెట్టి చాకిరి చేసే హరిజనులు, రజకులతో ఇతర కష్టజీవులతో ఉన్న సంబంధాలే వారు 8 వ ఆంధ్ర మహాసభ కు హాజరు కావటానికి ప్రధాన కారణం. ఆ మహాసభ వివరాలను కుటుంబ సభ్యులందరికీ వివరించటం తో ఉత్తేజితులయ్యా రు. జమీందారులు, దేశముఖులకు వ్యతిరేకంగా ,వెట్టి చాకిరి కి వ్యతిరేకంగా ,అక్రమ నిర్బంధ వసూళ్లకు వ్యతిరేకంగా సాగుదారులను తమ భూముల నుండి బేదఖలు చేయడానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వాన ఆంధ్ర మహాసభ ఆధ్వర్యంలో 1944 ప్రారంభం నుండి సమరశీల పోరాటాలనేకం సాగుతున్నాయి.1944లో హుజూర్నగర్ తాలూకా ఆంధ్ర మహాసభ హుజూర్ నగర్ పట్టణంలో జరిగింది .దీనికి రావి నారాయణరెడ్డి హాజరయ్యారు. దీనితో యువకులలో ఉత్సాహపూరితమైన వాతావరణ ఏర్పడింది .1945 సంవత్సరంలో ఖమ్మం లో జరిగిన 12 వ ఆంధ్ర మహాసభకు దొంతి రెడ్డి శంబిరెడ్డి పశ్య కన్నమ్మ సోదరుడు దొంతి రెడ్డి శంబిరెడ్డి ప్రోత్సాహంతో పశ్యరాంరెడ్డి హాజరయ్యారు. అక్కడ చింతలపూడి రాములు కలిసారు. ఈ ముగ్గురు కలిసి హుజూర్నగర్ పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ శాఖ ను ఏర్పాటు చేశారు. పార్టీ సాహిత్యాన్ని ,పార్టీ వేసిన పలు కరపత్రాలను రహస్యంగా పంపిణీ చేసేవారు .ఇందులో భాగమే కన్నమ్మ పార్టీ సాహిత్యాన్ని గంపలో పెట్టుకుని ఆ పుస్తకాలపై జొన్నలు పోసి వాటిపై ఎరువు పోసి ఆ గంప ను పొలాల దగ్గరికి మొసుకొనివెళ్లి పార్టీ నాయకులకు అందించేవారు. కొన్ని సందర్భాలలో చేనులోనే పుస్తకాలను పాతిపెట్టి సమాచారాన్ని నాయకత్వానికి తెలియజేసేది.

1946వ సంవత్సరంలో లింగగిరి లో జరిగిన బహిరంగ సభకు పి.సి జోషి, పుచ్చలపల్లి సుందరయ్య హాజరయ్యారు. ఇది హుజూర్నగర్ ప్రాంత ప్రజలకు గొప్ప ప్రేరణ. 1946 సెప్టెంబర్ లో పార్టీ సభ్యుల సానుభూతి పరుల సమావేశాన్ని పశ్యకన్నమ్మ ఇంట్లో నిర్వహించారు. విసునూరు రామచంద్రారెడ్డి కిరాయి గుండాల చే హత్య గామింప బడిన దొడ్డి కొమరయ్య హత్యకు నిరసనగా 1946 అక్టోబరులో పెద్ద ప్రదర్శన హుజూర్నగర్ లో జరిగింది. ఈ ప్రదర్శనలో పాల్గొన్న వారిలో 30 మందిని అరెస్టు చేశారు .అందులో పశ్య లక్ష్మి నరసింహా రెడ్డి, , దొంతిరెడ్డి లక్ష్మీ నర్సింహారెడ్డి (కన్నమ్మ పెద్ద సోదరుడు) ఉన్నారు. 70 సంవత్సరాల మా తాత గారిని వారం రోజులు విడుదల చేసినా, ఎనిమిది నెలలకు పైగా కన్నమ్మ గారి సోదరుడు జైల్లో ఉన్నాడు. పశ్యరాంరెడ్డి, దొంతి రెడ్డి శంభిరెడ్డిలు ఇతర ముఖ్యులు అనేకమంది అరెస్టు కాకుండా తప్పించుకోగలిగారు.హుజూర్నగర్ తాలూకా మల్లారెడ్డిగూడెంలో 1946 డిసెంబర్‌లో జరిగిన కాల్పులు హుజూర్నగర్ తాలూకా ప్రజలను భయభ్రాంతులకు గురి చేసింది. ఈ కాల్పులలో ముగ్గురు మహిళలు మొత్తం ఆరుగురు అక్కడికక్కడే నేలకు ఒరిగారు. అనేకమందిని అరెస్టు చేసి హైదరాబాద్ చంచల్ గూడ జైలుకు పంపారు. నైజాం పోలీసును ప్రతిఘటిస్తూ రాళ్ల వర్షం కురిపించిన ప్రజలు వెనుకకు వెళ్ళరన్న ఆలోచనతో కలెక్టరు, పోలీస్ మైకులో ముగ్గురు నలుగురు పెద్దలను మాట్లాడటానికి పంపవలసిందిగా విజ్ఞప్తి చేశారు. మాట్లాడటానికి వెళ్లిన వారిపై కాల్పులు జరిపి గ్రామ ప్రజలపై చిత్ర వధకు గురి చేశారు.



హుజూర్నగర్ కు దగ్గరలో ఉన్న మఠంపల్లి నుండి ధాన్యం 100 ఎడ్ల బండ్ల ల్లో హుజూర్నగర్ కు తరలిస్తున్న విషయం తెలిసి ఆ ధాన్యం రైతుల నుండి వసూలు చేసిన లేవీ ధాన్యం కాబట్టి ఆ బండ్లను అడ్డుకొని ప్రజలకు పంచాలని నిర్ణయించుకొని 1000 మందిని దొంతి రెడ్డి శంబిరెడ్డి,పశ్యరాంరెడ్డి, చింతలపూడి రాములు నాయకత్వంలో పార్టీ ప్రజలను సమీకరించారు. నిజాం పోలీస్ కాల్పులు జరిపింది. నాయకుల వద్ద ఒక తుపాకీ ఒక బాంబు మాత్రమే ఉండటం ఎక్కువ ఆయుధాలు లేకపోవటం వల్ల ప్లాన్ సక్సెస్ కాలేదు. 1948 ఫిబ్రవరి మొదటి వారంలో దొంతి రెడ్డి శంభిరెడ్డి రెడ్డి ఆచూకీ చెప్పమని పశ్య కన్నమ్మ తండ్రి కుటుంబం పై రజాకార్లు దాడి చేశారు. తండ్రి దొంతి రెడ్డి అంతి రెడ్డి తల పగలటం ,వెన్నులో బరిశెదిగటం జరిగింది. 25 కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్లి జగ్గయ్యపేట హాస్పిటల్ లో తండ్రికి వైద్యం చేయిస్తున్న సమయంలోనే సోదరుడు దొంతి రెడ్డి శంభిరెడ్డి హుజూర్‌గర్ కు దగ్గరలో ఉన్న చింతలమ్మ గూడెం లో 1948 ఫిబ్రవరి 22వ తారీఖున నిజాం పోలీసులు ,రజాకార్లు ఎదురు కాల్పుల్లో చంపటం... ఈ ఘటన లన్నీ కన్నమ్మపై తీవ్రమైన ప్రభావాన్ని కలుగచేసాయి. కొందరు పోరాట యోధులు అమరులైనప్పుడు భయపడిన పశ్యకన్నమ్మ సాయుధ పంధాను వదిలి బయటకు రమ్మని సోదరున్ని కోరినప్పుడు ‘పట్టిన పట్టు విడవటం కన్నా చావటం మేలు’ అని దొంతి రెడ్డి శంభిరెడ్డి చెప్పిన మాటలు అనేకసార్లు మాకు ఏడ్చుకుంటూ చెప్పేది.తన చిన్నన్న తో పాటు పొనుగోడుకు చెందిన దాసరి లింగన్న, మఠంపల్లి కి చెందిన మిర్త్రీ గోపన్న అమరులు కావటం హుజూర్నగర్ పాత తాలూకా ప్రజలపై తీవ్రమైన ప్రభావం ఏర్పడింది. హుజూర్నగర్ లో కమ్యూనిస్టు పార్టీ నిర్మాతలలో ఒకరిగా1946 నుండి 1951 వరకు కమ్యూనిస్టు పార్టీ ఆర్గనైజర్ గా పనిచేసిన కాలంలో మూడు సార్లు పశ్య రాంరెడ్డి కన్నమ్మ భర్త జైలుకు వెళ్లడం, 1949లో హుజూర్‌నగర్ పోలీస్ కస్టడీలో ఐదు నెలల పాటు ఉన్న సమయంలో కుమారుడు మరణించటం, 1950లో మరో ఐదు నెలల పాటు పోలీస్ కస్టడీలో ఉంచి హుజూర్నగర్ సబ్ జైలుకు పంపి నీ పార్టీ వారు నిన్ను విడుదల చేసుకోవటానికి జైలు పై కాల్పులు జరుపుతారు అన్న నెపం తో నల్లగొండకు ఆ తర్వాత హైదరాబాద్ జైలుకు పంపడం జరిగింది. 1952 జనవరి 11వ తారీఖున విడుదల అయ్యేంతవరకూ, జైల్లో అనారోగ్యానికి గురైనప్పుడు ఒంటరిగా హైదరాబాద్ చేరుకుని డాక్టర్ జై సూర్య (సరోజినీ దేవి కుమారుడు) వద్దకు వచ్చి జైల్లో భర్తను కలవడానికి అవకాశం ఇప్పించమని కోరింది. డాక్టర్ జై సూర్య స్వయంగా నాటి హోమ్ మినిస్టర్ వద్దకు తీసుకువెళ్లి మాట్లాడారు. రోజూ ఆబిడ్స్ లో ఉన్న జై సూర్య ఇంటి (గోల్డెన్ భవనం )నుండి ముషీరాబాద్ జైలు వరకు నడిచి వచ్చి భర్త ఆరోగ్యం వాకబు చేసుకునేది. ఆరోగ్యం బాగా అయిన తర్వాత తిరిగి ఇంటికి వెళ్లే సమయం లో మా నాన్న సూచన మేరకు హైదరాబాదులో పండిట్ జవహర్లాల్ నెహ్రూ హాజరవుతున్న బహిరంగ సభకు పద్మజా నాయుడుతో కలిసి (ఆనాడు ఆమె బెంగాల్ గవర్నర్‌గా ఉండేవారు) వెళ్ళింది. హుజూర్నగర్ నియోజకవర్గం నుండి పోటీ చేసిన జై సూర్య ఎన్నికల్లో తదనంతరం మగ్దుం ఎన్నికల్లో గుండాల దాడుల మధ్య ప్రచారం చేసింది. బొమ్మగాని ధర్మ బిక్షం, పాల్వాయి రామ్ కోటేశ్వరరావు, దొడ్డ నర్సయ్యలతో కలిసి పశ్యకన్నమ్మ కమ్యూనిస్టు పార్టీలో జిల్లా కౌన్సిల్ సభ్యురాలిగా అనేక సంవత్సరాలు కొనసాగింది. 1971 నుండి 1980 వ సంవత్సరం వరకు హుజూర్నగర్ గ్రామపంచాయతీ సభ్యురాలిగా, హుజూర్నగర్ పంచాయతీ సమితి కో–ఆప్షన్ సభ్యురాలుగా బాధ్యతలను నిర్వహించారు. ప్రాణానికి ప్రాణంగా ఉన్న అన్న దొంతి రెడ్డి శంభిరెడ్డి మరణం, ఆయన ప్రభావం కన్నమ్మపై తీవ్రంగా కొనసాగింది. ఇంట్లో అబద్ధం చెప్పి జగ్గయ్యపేటలో మాభూమి నాటకాన్ని చెల్లెలికి చూపెట్టాలన్న కోరికతో ఎడ్ల బండిని బాడుగకు కట్టమని అడుగుతున్నారు నాన్న అని దొంతి రెడ్డి అంతిరెడ్డి కి అబద్ధం చెప్పి ఎడ్ల బండిలో పశ్యకన్నమ్మను జగ్గయ్యపేట కు తీసుకు వెళ్ళాడు.చిలుకూరు లో జరిగిన 8 వ ఆంధ్ర మహాసభకు తన అన్నతో వెళ్లి నట్లు పశ్యకన్నమ్మకి జ్ఞాపకం ఉంది.పశ్యరాంరెడ్డి చిన్నాయనల పిల్లలందరూ నాడు పార్టీలో కొనసాగారు. కన్నమ్మ చెల్లెలు భర్త చింతకుంట్ల వెంకటరెడ్డి పొనుగోడు ఏరియాలో దళ సభ్యుడు. దొంతి రెడ్డి శంభిరెడ్డి ఆశయ సాధనలో జీవితాంతం భర్త పశ్యరాంరెడ్డి గారి సహకారంతో కష్టజీవుల సమస్యల పరిష్కారానికి కదం తొక్కిన మహిళ నాయకురాలు పశ్యకన్నమ్మ.నిరుపేదలకు వృద్ధాప్య , వితంతు పెన్షన్ ఇప్పించడం లో, వారి భూమిని ఆక్రమించుకోవటానికి ప్రయత్నించిన సంఘవ్యతిరేక శక్తులను తరిమి కొట్టడంలో మడమ తిప్పని పోరాటం చేసిన నాయకురాలు. 1970 దశకం లోనే మహిళలకు కుట్టు మిషన్ సెంటర్ ను సంవత్సరాల తరబడి నిర్వహించి పదుల సంఖ్యలో మహిళలకు నైపుణ్యత ను పెంచి ఆర్థికంగా నిలపడానికి వారి ఇంట్లోనే ఒక గదిని కేటాయించి అనేక సంవత్సరాలు నిర్వహించారు. నిరుపేద పిల్లలకు బాల్వాడి సెంటర్ ను తన ఇంట్లోనే అనేక తన ఇంట్లో ఒక గదిలో సంవత్సరాలు నిర్వహించారు. మా ఇంటి ముందు ఉన్న హరిజన వాడ పిల్లలకు,ఇతర నిరుపేద కుటుంబాల పిల్లలకు పోషకాహార పదార్థాలు క్రమంగా అందించటంలో స్కూలు టీచర్, ఆయా తో కలిసి ఆ రోజుల్లోనే పనిచేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా మహిళా సమాఖ్య కన్వీనర్ గా, కార్యదర్శిగా,రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలి గా, భారత జాతీయ మహిళా సమాఖ్య జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సుదీర్ఘకాలం ఆరుట్ల కమలాదేవి,గుజ్జుల సరళా దేవి, బ్రిజ్‌రాణి గౌర్ , ఎస్ .సుగుణమ్మ, చంద్ర రాజకుమారి, చలసాని రత్న కుమారి, పార్వతమ్మ, ప్రేమ్ పావని, కె. అరుణ అక్కినేని వనజ, అమీనా, గంగా భవాని,తదితరులతో ఉమ్మడి నల్గొండ జిల్లాలో కట్కూరి సుశీల దేవి,బి.శేష మ్మ (రామ శర్మ సతీమణి)దొడ్డ పద్మ,కే. సత్యవతి, కుందూరు వెంకమ్మ ఎ.సుగుణమ్మ , పశ్య కలమ్మ,జడ రుక్కినమ్మ, గినిరెడ్డిలచ్చమ్మ, బండారు లచ్చమ్మ,ఎల్లమ్మ ముసుకుల వీరమ్మ తదితరులతో కలిసి పనిచేశారు.

హుజూర్నగర్ ప్రాంతంలో మొదటిసారిగా తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అమరులైన కుటుంబాలకు స్వాతంత్ర సమరయోధుల పెన్షన్లు 19 మందికి హుజూర్నగర్ పట్టణంలో మల్లారెడ్డిగూడెంలో కాల్పులకు గురైన కుటుంబాలకు ఇప్పించటంలో కన్నమ్మ గారు చేసిన ప్రయత్నం శ్లాఘనీయం. 1975 1985 అంతర్జాతీయ మహిళా దినోత్సవ దశాబ్దం ఐక్యరాజ్యసమితి ప్రకటించిన సమయంలో దేశవ్యాప్తంగా తంగా వయోజన పాఠశాలలను మహిళలకు నిర్వహించిన సందర్భంగా హుజూర్నగర్ పట్టణంలో అనేక వయోజన పాఠశాలలను నిర్వహించి మహిళలను అక్షరాస్యులను చేయటంలో విశ్రాంతి లేకుండా శ్రమించారు. తాను కూడా స్వయంగా అక్షరాలు నేర్చుకోవటానికి మూడు అక్షరాల పదాలను చదవటం వరకు చదువు నేర్చుకున్నారు. హుజూర్ నగర్ పట్టణంలో మహిళా మండలి భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని, జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం ఇచ్చిన దగ్గర నుండి స్థలాన్ని సాధించేంత వరకు ప్రయత్నాన్ని కొనసాగించారు.

ప్రముఖ కమ్యూనిస్టు పార్లమెంటు సభ్యులు దాసరి నాగభూషణం రావు సహకారం, గ్రామ పెద్దల సహకారం,ప్రభుత్వ నిధులతో మహిళా మండలి భవనాన్ని నిర్మించి ప్రముఖ స్వాతంత్ర సమరయోధురాలు క్విట్ ఇండియా ఉద్యమ నేత అరుణా అసఫ్ అలీ పేరు పెట్టడం ఈ ప్రాంత మహిళలకు ఉత్తేజం .2004వ సంవత్సరం నుంచి నేటి వరకు వేల సంఖ్యలో యువ మహిళలకు మహిళలకు కంప్యూట ర్, జర్దోషి, కుట్టు మిషన్ సెంటర్ నిర్వహిస్తూ శిక్షణ ఇవ్వడం జరిగింది. కం ప్యూటర్ నేర్చుకున్న అమ్మాయిలు అనేకమంది ఉద్యోగాల్లో కొనసాగుతున్నా రు. ఇతర మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకోగలిగారు.ఇటీవల తన సోదరుడు దొంతి రెడ్డి శంభిరెడ్డి స్మారక భవన నిర్మాణానికి హుజూర్ నగర్ పట్టణంలో శంకుస్థాపన చేశారు. మహిళా మండలి భవనంలోనే మొదటి అంతస్తులో పెద్ద హాలును తన సోదరుడు దొంతి రెడ్డి శంభిరెడ్డి పేరుతో నిర్మించి ప్రారంభించుకోవాలకున్నాం.ఈసమయంలో కన్నమ్మ మరణించారు.హుజూర్నగర్ ప్రాంతంలో మహిళా నాయకురాలుగా కమ్యూనిస్టు నాయకురాలు చిరస్మరణీయమైన పాత్రను నిర్వహించిన పశ్యకన్నమ్మమనందరికీ మార్గదర్శకం.

# సరిహద్దు రాష్ట్రాల్లో ప్రశాంతత

### జమ్ముకశ్మీర్, పంజాబ్, హర్యానాలో సాధారణ కార్యకలాపాలు కొనసాగించిన ప్రజలు

### హర్యానాలో బ్లాక్ అవుట్ ఉపసంహరణ

**న్యూఢిల్లీ :** దాదాపు వారం రోజుల పాటు కొనసాగిన తీవ్ర ఘర్షణల తర్వాత శనివారం రాత్రి జమ్ముకశ్మీర్, పంజాబ్ సరిహద్దుల్లో పరిస్థితులు కాస్త సాధారణమయ్యాయి. గత ఆరు రోజుల తరువాత ఆకాశంలో వింత శబ్దాలతో ఎగురుతూ కనిపించిన విమానాలు, క్షిపణులు, డ్రోన్లు లేని రాత్రిని నివాసితులు మొదటిసారి చూశారు. అయితే రాజస్థాన్‌లో సరిహద్దు ప్రాంతాల ప్రజలు మాత్రం బిక్కుబిక్కుమంటూనే కాలం గడిపారు. కాగా, శనివారం రాత్రి 11 గంటల తర్వాత కశ్మీర్‌లోని నియంత్రణ రేఖ (ఎల్‌ఒసి) వెంబడి ఏ సెక్టార్ నుండీ కాల్పుల విరమణ ఉల్లంఘన జరగలేదని అధికారులు నిర్ధారించారు. పాక్ దాడుల్లో దెబ్బతిన్న పూంచ్, రాజౌరి వంటి సరిహద్దు జిల్లాలతో పాటు జమ్ము ప్రాంతం అంతటా కూడా రాత్రి ఎటువంటి ఘటనలు జరగలేదు. దీంతో ప్రజలకు అవసరమైన ఉపశమనం కలిగింది. ఆదివారం ఉదయం యథావిధంగా తమ కార్యకలాపాలు సాగించారు. నియంత్రణ రేఖ, అంతర్జాతీయ సరిహద్దు వెంబడి కాల్పుల విరమణను పాటించాలని భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన ఒప్పందం తర్వాత ప్రశాంతత నెలకొంది. శనివారం సాయంత్రం 5 గంటల నుండి అమలులోకి వచ్చేలా భూమి, గాలి, సముద్రంలో అన్ని కాల్పులు, సైనిక చర్యలను నిలిపివేయడానికి రెండు దేశాల డైరెక్టర్స్ జనరల్ ఆఫ్ మిలిటరీ ఆపరేషన్స్ (డిజిఎంఒలు) అంగీకరించారని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి ప్రకటించారు. అమెరికా మధ్యవర్తిత్వం వహించిన చర్చల తర్వాత భారత్, పాకిస్తాన్ ‘పూర్తి, తక్షణ కాల్పుల విరమణ‘కు అంగీకరించాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కొద్దిసేపటికే ఈ ప్రకటన వెలువడింది. కాగా, కాల్పుల విరమణ ఒప్పందం ఉన్నప్పటికీ, ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ శనివారం సాయంత్రం కశ్మీర్ లోయపై డజన్ల కొద్దీ డ్రోన్లు ఎగురుతున్నట్లు సమాచారం. అయితే, రాత్రిపూట ఎటువంటి డ్రోన్ కార్యకలాపాలు జరగలేదని ధ్రువీకరించారు. కాల్పుల విరమణకు ముందు రోజుల్లో, జమ్ము నగరం, అంతర్జాతీయ సరిహద్దు సమీపంలోని ప్రాంతాలు సహా ఇతర ప్రధాన పట్టణాలలో వరుస పేలుళ్లు సంభవించాయి. దీంతో ఆ ప్రాంతంలో ఆందోళనను మరింత పెంచింది. శనివారం జరిగిన ఒప్పందంతో నాలుగు రోజుల పాటు జరిగిన తీవ్రమైన సరిహద్దు డ్రోన్, క్షిపణి దాడుల తర్వాత, పంజాబ్ అంతటా ఆదివారం ఉదయం ప్రశాంతత నెలకొంది. ముఖ్యంగా కాల్పుల విరమణ ప్రకటన తర్వాత సరిహద్దు ప్రాంతాలలో ప్రశాంతత నెలకొంది. నివాసితులు తమ సాధారణ సాధారణ కార్యకలాపాలు కొనసాగిస్తూ ప్రశాంతంగా ఉండాలని అధికారులు కోరారు. జలంధర్‌లో పరిస్థితి అదుపులోనే ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, పనులు యథావిధిగా తిరిగి ప్రారంభించవచ్చని,డిప్యూటీ కమిషనర్ హిమాన్షు అగర్వాల్ అన్నారు. అయితే, పటాకులు పేల్చవద్దని, డ్రోన్లను ఎగరవేయవద్దని ఆయన పౌరులకు సూచించారు. పాకిస్తాన్‌తో 553 కిలోమీటర్ల సరిహద్దును పంచుకునే పంజాబ్‌లో అమృత్సర్, పఠాన్‌కోట్, ఫిరోజ్‌పూర్ వంటి సరిహద్దు జిల్లాల అంతటా ప్రజలు తమ దైనందిన కార్యకలాపాలను తిరిగి ప్రారంభించారు.



### రాజస్థాన్‌లో భయాందోళనలు

ఇదిలా ఉండగా, భారత్, పాకిస్తాన్ మధ్య జరిగిన అన్ని సైనిక చర్యలను పొరుగు దేశం ఉల్లంఘించిన తర్వాత రాజస్థాన్ సరిహద్దు ప్రాంతాలలో శనివారం రాత్రి భయాందోళనలు చెలరేగాయి. అయితే, ఆదివారం ప్రజలు సాధారణ కార్యకలాపాలు ప్రారంభించారు. మార్కెట్లు తిరిగి ప్రారంభమయ్యాయి. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల కారణంగా శనివారం పూర్తిగా లేదా పాక్షికంగా రద్దు చేయబడిన రైలు సేవలను నార్త్ వెస్టర్న్ రైల్వే కూడా పునరుద్ధరించింది. జైసల్మేర్, బార్మెర్, ఇతర ప్రాంతాల నుండి డ్రోన్ కార్యకలాపాలు, పేలుళ్ల వంటి వార్తలు రావడంతో సరిహద్దు ప్రాంతంలో శనివారం రాత్రి బ్లాక్అవుట్ విధించారు. గత రెండు రాత్రులతో పోలిస్తే డ్రోన్ కార్యకలాపాల ఫ్రీక్వెన్సీ తక్కువగా ఉందని జైసల్మేర్ నివాసి రేవంత్ సింగ్ చెప్పారు. జైసల్మేర్, బార్మెర్‌లో గురువారం, శుక్రవారం రాత్రుల్లో పాకిస్తాన్ డ్రోన్ దాడులు చేసింది. భారత రక్షణ దళాలు డ్రోన్‌లను గాల్లోనే వాటిని నిర్వీర్యం చేశాయి. ఎటువంటి ప్రాణ నష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదు. శనివారం వివిధ ప్రదేశాల నుండి డ్రోన్లు, క్షిపణి లాంటి వస్తువుల శిథిలాలు కనుగొన్నారు. కాగా, కాల్పుల విరమణ ఒప్పందం తరువాత ప్రజలకు కొంత ఉపశమనం కలిగించింది. జైసల్మేర్, బార్మెర్‌లోని మార్కెట్లు సాయంత్రం తిరిగి తెరుచుకున్నాయి. బార్మెర్‌లో బ్లాక్అవుట్‌ను ఉపసంహరించారు. జైసల్మేర్, జోధ్‌పూర్‌లలో కూడా బ్లాక్అవుట్ వ్యవధి తగ్గించారు.

# ఇప్పుడే ఇళ్లకు రావొద్దు

### సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్ముకశ్మీర్ పోలీసులు కీలక సూచనలు జారీ



**శ్రీనగర్ :** భారత్–పాక్ మధ్య శనివారం కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన నేపథ్యంలో సరిహద్దు గ్రామాల ప్రజలకు జమ్ముకశ్మీర్ పోలీసులు కీలక సూచనలు జారీ చేశారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం పాకిస్థాన్ దుశ్చర్యల కారణంగా సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లిన సరిహద్దు గ్రామాల ప్రజలకు కీలక అడ్వైజరీ జారీ చేశారు. ప్రజలు అప్పుడే తిరిగి తమ ఇళ్లకు తిరిగి రావొద్దని.. సురక్షిత ప్రాంతాల్లోనే ఉండాలని కోరారు. పాకిస్థాన్ ప్రయోగించిన ఫిరంగి గుండ్లు (షెల్స్) నుంచి ఈ ప్రాంతాలను గుర్తించి శానిటైజ్ చేయాల్సి ఉందని తెలిపారు. పాక్ దాడుల తీవ్రతకు అధికంగా నష్టపోయే అవకాశం ఉండటంతో బారాముల్లా, బందిపొరా, కుప్వారా జిల్లాల్లోని నియంత్రణ రేఖ సమీపంలోని గ్రామాలకు చెందిన దాదాపు 1.25 లక్షల మందికి పైగా ప్రజలను భద్రతా సిబ్బంది ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతాలకు తరలించిన విషయం తెలిసిందే. అయితే, సరిహద్దు ప్రాంతాల్లో తాజా పరిస్థితుల నేపథ్యంలో ఆయా గ్రామాల ప్రజలు ఇప్పుడే తమ నివాసాలకు వెళ్లొద్దని కోరుతున్నారు. దాడుల సమయంలో పాక్ ప్రయోగించిన షెల్స్ (ఫిరంగి గుండ్లు) చెల్లాచెదురుగా పడి ఉండటం వల్ల ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు. ప్రభావిత ప్రాంతాలకు బాంబు నిర్వీర్య బృందాలను పంపి గ్రామాల్లో ప్రజల ప్రాణ నష్టానికి కారణమయ్యే ఫిరంగి గుండ్లను గుర్తించి, శానిటైజ్ చేస్తామని తెలిపారు. మరోవైపు, 2023లో ఎల్‌ఒసి సమీపంలో ఇలా మిగిలిపోయిన షెల్స్ పేలుడుతో 41మంది ప్రాణాలు కోల్పోవడం అప్పట్లో విషాదం నింపింది. అందువల్ల పౌరులు గ్రామాలకు ఇప్పుడే తిరిగి వెళ్లొద్దు అని అధికారులు సూచించారు.

# బ్రహ్మోస్ శక్తి గురించి పాకిస్థాన్‌ను అడగండి

### : యుపి సిఎం యోగి



**లక్నో :** పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్‌పై చేపట్టిన ఆపరేషన్ సిందూర్ లో భారత్ బ్రహ్మోస్ క్షిపణులను ఉపయోగించిందని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ వెల్లడించారు. ఆ సమయంలోనే ఈ క్షిపణులకున్న శక్తి గురించి ప్రపంచ దేశాలకు తెలిసిందన్నారు. దీని ప్రభావం గురించి తెలియని వారెవరైనా ఉంటే.. పాకిస్థాన్‌ను అడిగి తెలుసుకోవాలని సూచించారు. భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఆదివారం యుపిలోని లక్నో సిటీలో బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూజ్ క్షిపణి ఉత్పత్తి యూనిట్ తయారీ కేంద్రాన్ని ప్రారంభించారు. లక్నోలోని ‘ఉత్తరప్రదేశ్ డిఫెన్స్ ఇండస్ట్రియల్ కారిడార్’లో నిర్మించిన ఈ కేంద్రాన్ని రాజ్‌నాథ్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యుపి సిఎం యోగి ఆదిత్యనాథ్ పాల్గొని మాట్లాడారు. ఈ ప్రాజెక్టు కోసం రాష్ట్ర ప్రభుత్వం 200 ఎ కరాల భూమిని కేటాయించిందని సిఎం యోగి తె లిపారు. రూ.300 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ యూనిట్‌లో ఏటా 80 నుంచి 100 క్షిపణులను తయారు చేయనున్నట్లు వెల్లడించారు. బ్రహ్మోస్ క్షిపణులు 290 నుంచి 400 కి.మీ పరిధిని, మాక్ 2.8 రెట్ల గరిష్ట వేగాన్ని కలిగి ఉంటాయని తెలిపారు. ఇక ఇదే కార్యక్రమంలో ఉగ్రవా దం గురించి కూడా సిఎం యోగి మాట్లాడారు. ‘ఉగ్రవాదం కుక్కతోక లాంటిది. అది ఎప్పుడూ వంకరగానే ఉంటుంది. దాన్ని సరిచేయాలంటే వారి సొం త భాషలోనే బదులివ్వాలి’ అని వ్యాఖ్యానించారు.

### బ్రహ్మోస్ క్షిపణి గురించి..

భారత్, రష్యాల సంయుక్త వెంచర్ అయిన బ్రహ్మోస్ ఏరోస్పేస్ అభివృద్ధి చేసిన ఈ బ్రహ్మోస్ క్షిపణి 290 నుంచి 400 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను చేధించగలదు. ఈ క్షిపణిని ఫైర్ అండ్ ఫర్గెట్ గైడెన్స్ సిస్టమ్‌తో భూ ఉపరితలం నుంచి, సముద్ర తలం నుంచి, గగనతలం నుంచి ప్రయోగించవచ్చు. కొత్తగా ప్రారంభమవుతున్న ఈ క్షిపణి తయారీ కేంద్రం నుంచి 100 నుంచి 150 కొత్త తరం బ్రహ్మోస్ క్షిపణులను తయారు చేయనున్నారు. ఈ కొత్త తరం బ్రహ్మోస్ క్షిపణులు ఏడాదిలోగా డెలివరీకి సిద్ధం కానున్నాయి. ఈ న్యూజనరేషన్ బ్రహ్మోస్ క్షిపణి పరిధి 300 కిలోమీటర్లు. దీని బరువును తగ్గించారు. ప్రస్తుత బ్రహ్మోస్ క్షిపణి బరువు 2900 కిలోలు కాగా, న్యూ బ్రహ్మోస్ క్షిపణి బరువు 1290 కిలోలు.

### కశ్మీర్ అంశంపై ‘మూడవ పక్షం’ మధ్యవర్తిత్వానికి...

# అమెరికా అంగీకరించిందా? లేదా?

### ఈ సమస్యను ‘అంతర్జాతీయీకరణ చేసే ప్రయత్నం’ అని మోదీ సర్కారుపై కాంగ్రెస్ ధ్వజం

### అన్ని రాజకీయ పార్టీల సమావేశం, పార్లమెంట్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని డిమాండ్

న్యూఢిల్లీ : భారతదేశంపాకిస్థాన్ తరపున అమెరికా ప్రకటనలు చేసిన తర్వాత కశ్మీర్‌పై మూడవ పక్షం మధ్యవర్తిత్వానికి అంగీకరించిందా? లేదా? అన్న విషయమై ప్రభుత్వం సమాధానాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. ఈ అంశాన్ని అంతర్జాతీయీకరణ చేసేందుకు చేసే ప్రయత్నమే అని కాంగ్రెస్ ధ్వజమెత్తింది. కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలట్ ఆదివారం ఇక్కడి ఎఐసిసి హెడ్‌క్వార్టర్స్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాల్పుల విరమణ ప్రకటన ఆశ్చర్యంగా ఉన్నదని, భారత్‌పాకిస్థాన్ తరపున ఒక మూడవ దేశం ప్రకటనలు చేయడం ఇదే మొట్టమొదటిసారి అని కాంగ్రెస్‌పార్టీ తెలిపింది. అమెరికన్ల తరపున రెండు దేశాలను యుఎస్ ఆదేశించడమేమిటని ప్రశ్నించింది. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల మరొక సమావేశాన్ని ఏర్పాటు చేయాలన్న ప్రతిపక్షాల డిమాండ్‌ను తప్పకుండా అంగీకరించాలని సచిన్‌పైలట్ విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పరిణామాలకు సంబంధించిన ఈ విషయాలపై చర్చించేందుకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. భారత్‌పాకిస్థాన్ విషయంలో గత 24గంటల్లో హఠాత్ సంఘటనలు చోటుచేసుకున్నాయని సచిన్ పైలట్ ఆశ్చర్యం వ్యక్త ంచేశారు. కాల్పుల విరమణ ప్రకటనను అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేశారన్న విషయం సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని మేంఅం దరమూ ఆశ్చర్యపోయాం అని ఆయన ప్రత్యేకంగా ప్రస్తావించారు. ‘భారతదేశంపాకిస్థాన్ సమస్యలను అంతర్జాతీయీకరణ చేసే ప్రయత్నమే ఇది. ఇలా జరగడం ఇదే మొదటిసారి’ అని ఆయన చెప్పారు.దేశానికి సంబంధించిన అన్ని రాజకీయ పార్టీలను విశ్వాసంలోకి తీసుకుని దీనిపై స్పష్ట త ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సచిన్‌పైలట్ అన్నారు. భూమి, గగనతలం, సముద్రంపై అన్ని రకాలు కాల్పుల. సైనిక చర్యలను నిలిపివేయాలని భారత్‌పాక్ ఒక అవగాహనకు వచ్చాయని విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ శనివారం ప్రకటించిన విషయం తెలిసిందే. ‘కశ్మీర్ అంశం ఒక ద్వైపాక్షిక సమస్య. దానిని అంతర్జాతీయీకరణ చేసే ప్రయత్నం సరి కాదు’ అని సచిన్‌పైలట్ హితవు పలికారు. కొన్ని సంవత్సరాల క్రితం భారతదేశంపాకిస్థాన్ రెండూ ఒకే దేశం కింద ఉన్నాయని మర్చిపోయి అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వేల సంవత్సరాల కాలం నుంచి పోరాడుతున్నామని తప్పుగా వ్యాఖ్యానించారని సచిన్ పైలట్ తప్పుపట్టారు. వాషింగ్టన్ నుంచి కాల్పుల విరమణ ప్రకటన సరిహద్దు వెంబడి జరుగుతోన్న దాడులకు సంబంధించిన అనేక ప్రశ్నలు, సందేహాలకు తావిస్తోందన్నారు.

# ఒప్పందం శాశ్వత ప్రభావం చూపుతుందని ఆశిస్తున్నా

శ్రీనగర్ : భారత్, పాకిస్తాన్ మధ్య పరస్పరం జరిగే అన్ని సైనిక చర్యలను నిలిపివేయడానికి కుదిరిన ఒప్పందం శాశ్వత ప్రభావాన్ని చూపుతుందని పిడిపి అధ్యక్షురాలు మెహబూబా ముఫ్తీ ఆదివారం ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కాల్పుల విరమణ శాశ్వతంగా మారాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. ఎందుకంటే సంఘర్షణ జరిగితే అమాయక ప్రజలు తమ ప్రాణాలను, ఇళ్లను కోల్పోతారని బారాముల్లా సరిహద్దు గ్రామాల నుండి స్థానభ్రంశం చెందిన వారిని సందర్శించిన ముఫ్తీ ఇక్కడ విలేకరులతో అన్నారు. శనివారం సైనిక అవగాహన జరిగిన కొన్ని గంటల్లోనే పాక్ ఉల్లంఘనల గురించి అడిగినప్పుడు, రెండు దేశాల సైన్యాలు ఒకరినొకరు తమ బలాలను ప్రదర్శిస్తున్నప్పుడు పరిస్థితిని తగ్గించడానికి సమయం పడుతుందని ఆమె అన్నారు. ఉద్రిక్తతను తగ్గించడానికి సమయం పడుతుందని, ప్రతిదానిపైనా కోపంగా ఉండకూడదన్నారు. ప్రభుత్వం స్థానభ్రంశం చెందిన ప్రజలకు ఏర్పాట్లు చేయాలని, వారు తమ ఇళ్లను నిర్మించుకునేలా వారికి ఆర్థిక సహాయం అందించాలని ఆమె అన్నారు. ‘ప్రజలు తమ ఇళ్లను కోల్పోయారు. వారు తమ ఇళ్లను పునర్నిర్మించుకునే స్థితిలో లేరు. వారికి వసతి కల్పించాలి. వారి ఇళ్ల పునర్నిర్మాణానికి ఆర్థిక సహాయం అందించాలని ప్రభుత్వాన్ని అభ్యర్థిస్తున్నాను’ అని ఆమె అన్నారు. కశ్మీర్ సరిహద్దు జిల్లాల్లో పరిస్థితి దారుణంగా ఉందని, పూంచ్, రాజౌరి, జమ్ము జిల్లాల్లో కూడా పరిస్థితి మెరుగ్గా లేదని పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పిడిపి) చీఫ్ అన్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## కరాచీ బేకరీపై బిజెపి దాడి హేయమైన చర్య: మంత్రి సీతక్క

ప్రజాపక్షం/హైదరాబాద్: బిజెపి నాయకులు కరాచీ బేకరీపైన దాడి చేయడం హేయమైన చర్యగా పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అభివర్ణించారు. బిజెపి నాయకులు తమ నిజ స్వరూపాన్ని మరో సారి చాటుకున్నారని,దేశం, హిందువుల ప్రయోజనాలు బిజెపికి ముఖ్యం కాదని, విద్వేషాలను రెచ్చగొట్టి, రాజకీయంగా లబ్ధి పొందడమే వారి పని అని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కరాచీ బేకరీ ఈ దేశ బిడ్డలదని, దేశవిభజన సమయంలో హిందూ మతస్తులైన కరంచంద్ కుటుంబం హైదరాబాద్‌కు వచ్చి కరాచీ బేకరీ అని స్థాపించారని గుర్తు చేశారు. ప్రధాని, హోం మంత్రి సొంత రాష్ట్రమైన గుజరాత్‌తో సహా చాలా రాష్ట్రాల్లో కరాచీ బేకరీ తన వ్యాపారాన్ని నిర్వహిస్తోందని వివరించారు. యుద్ధ సమయంలో ప్రజల మధ్య విభజన తీసుకొచ్చే ఇలాంటి చిల్లర పనులు బిజెపి మానుకోవాలని హితువుపలికారు. కరాచీ బేకరిపైన జరిగిన దాడిని మంత్రి ఖండించారు. కరాచీ బేకరీకి ప్రజా ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసనిచ్చారు.

## అన్ని రాజకీయ పార్టీల సమావేశానికి ప్రధాని హాజరైతేనే పాల్గొనాలి

రాజకీయ పార్టీలకు రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ విజ్ఞప్తి



న్యూఢిల్లీ : భారత్‌-పాక్ కాల్పుల విరమణకు సంబంధించిన అంశంపై అన్ని రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటుచేయాలని ప్రముఖ న్యాయవాది, రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. అయితే ఈ సమావేశానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరుకాని పక్షంలో అన్ని రాజకీయ పార్టీలు హాజరుకావొద్దని కపిల్ సిబల్ అభ్యర్థించారు. అలాగే ప్రత్యేక పార్లమెంట్ సమావేశాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.'ఈ రోజు ప్రధానమంత్రిగా మన్మోహన్‌సింగ్ ఉన్నట్లయితే అన్ని రాజకీయ పార్టీల సమావేశానికి తప్పకుండా హాజరయ్యేవారు' అని కపిల్‌సిబల్ విశ్వాసం వ్యక్తం చేశారు. రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ ఆదివారం ఇక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ చేసిన తన తాజా సోషల్ మీడియా పోస్ట్‌లో భారతదేశంపాకిస్థాన్ పరస్పర సైనిక దాడులను నిలిపివేయనున్నారని వెల్లడించడాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. 'ఈ చారిత్రక, కథానాయక నిర్ణయం'తో సహాయం చేసేందుకు ముందుకు రావడం నాకు గర్వకారణంగా ఉంది' అని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెప్పారని గుర్తుచేశారు. 'గత 48గంటలుగా చర్చలు సాగాయని యుఎస్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ మార్కో రుబియో ఒక ట్వీట్‌లో చెప్పడం అనేక ప్రశ్నలు తలెత్తడానికి దారి తీసింది. అందువల్ల ఏమి జరిగింది? ఎలా? ఎందుకు? దీనికి సంబంధించిన సమాచారం మాకు ఇప్పటికీ ఇవ్వలేదు. అంతేకాకుండా సమావేశాన్ని ఒక తటస్థ ప్రదేశంలో నిర్వహించబోతున్నట్లు కూడా వారు చెప్పారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ కూడా జాతీయ భద్రత సలహాదారు అజిత్ దోవల్‌తో కూడా మాట్లాడారు' అని సిబల్ తెలియజేశారు. 'ఇది విమర్శలకు సమయం కాదు కాబట్టి ఈ రోజు మేం ఎలాంటి విమర్శలను చేయబోం. మేం అన్ని రాజకీయ పార్టీల సమావేశం, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని వెంటనే ఏర్పాటు చేయాలని మాత్రమే విజ్ఞప్తి చేస్తున్నాం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్ని రాజకీయ పార్టీల సమావేశానికి హాజరవుతున్నారని హామీ ఇస్తే తప్ప సమావేశానికి హాజరుకావొద్దు' అని రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ రాజకీయ పార్టీలను అభ్యర్థించారు.

## ఈటల ఇదేమి భాష? : జగ్గారెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని గాని, కాంగ్రెస్ పార్టీపై గాని మరోసారి ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే తగిన గుణపాఠం చెబుతామని పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్‌ను టిపిసిసి కార్యనిర్వహక అధ్యక్షులు జాగ్గారెడ్డి హెచ్చరించారు. గాంధీభవన్‌లో ఆదివారం జగ్గారెడ్డి మీడియాతో మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డిపై ఈటల రాజేందర్ ఇప్పటికే అనేకసార్లు నోరు జారారని, ఓ ఎంపి మాట్లాడే భాషేనా ఇది అని ప్రశ్నించారు. బిజెపి అధ్యక్షులు కావాలని కలలు కంటున్న ఈటల రాజేందర్ సిఎంను తిడితేనే ఆ పదవి వస్తుందని, తన పరిధి దాటి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన ఇప్పటీ వరకు తన నియోజకవర్గ సమస్యలను సిఎంని కలిసి ఒక్కసారైనా వివరించారా చెప్పాలని డిమాండ్ చేశారు. తాము తిట్టడం మొదలుపెడితే, ఈటల రాజేందర్ ఉరి వేసుకుని చావడం ఖాయమన్నారు. సమస్యలు ఉంటే సిఎంను ప్రశ్నించవచ్చాని, ప్రజాస్వామ్యబద్ధంగా డిమాండ్ చేయవచ్చాని, కాని ఎంపిగా ఉన్న ఆయన సిఎంను నా కొడకా అని మాట్లాడం ఏమిటని ప్రశ్నించారు. తన విధాన మార్చుకోకపోతే తగిన గుణపాఠం తప్పదని జగ్గారెడ్డి హెచ్చరించారు.

# హైదరాబాద్ మెట్రోకు మరో అరుదైన గౌరవం

హార్వర్డ్ వర్సిటీలో మెట్రో ప్రాజెక్టు కేస్‌స్టడీ

హైదరాబాద్ మెట్రోపై హార్వర్డ్ వర్సిటీ పరిశోధనా పత్రం

హర్షం వ్యక్తం చేసిన మెట్రోరైల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్ : హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు మరో అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుపై హార్వర్డ్ యూనివర్సిటీ అధ్యయన పత్రం ప్రచురించింది. ఐఎస్‌బి, స్టాన్ ఫర్డ్, నేడు హార్వర్డ్ యూనివర్సిటీలు అధ్యయనం చేయడం పట్ల మెట్రో యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. అంతర్జాతీయంగా అత్యంత ప్రతిష్మాత్మకమైన మేనేజ్‌మెంట్ విద్యాలయాలు హైదరాబాద్ మెట్రో రైల్ విజయగాథను తమ విద్యార్థుల అధ్యయనానికి పరిశోధనా పత్రాలుగా ప్రచురించినట్లు మెట్రోరైల్ వెల్లడించింది. మెట్రోరైల్ ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి సారథ్యంలో మెట్రో రైల్ వ్యవస్థ ఒక ప్రముఖ రవాణా వ్యవస్థగానే కాకుండా మౌలిక వసతుల కల్పనలో ఒక నూతన ఒరవడిని ప్రదర్శించింది. పిపిపి విధానంలో ప్రపంచ వ్యాప్తంగా పేరుగాంచిన ప్రాజెక్టుగా అవతరించిందని హార్వర్డ్ యూనివర్సిటీ తాజాగా వెల్లడించిన పరిశోధనాపత్రంలో స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టు అనేక సవాళ్లను అధిగమిస్తూ, సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు తీసుకెళ్తున్న ఆయన నైపుణ్య శైలిని, నాయకత్వ లక్షణాలను ఈ పత్రంలో ప్రస్తావించారు. హైదరాబాద్‌లో ఉన్న ప్రతిష్మాత్మకమైన ఇండియన్ స్కూల్ అఫ్ బిజినెస్ ప్రొఫెసర్లు, పరిశోధకులు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టు స్థాపనకు అనుసరించిన ఆలోచనలు, దానిని అమలు చేసిన తీరుపై ఇప్పటికే అధ్యయనం చేశారు. దీనిని హైదరాబాద్ మెట్రో ఆలోచన నుంచి అమలు వరకు పబ్లిక్ ప్రైవేట్ పార్టనర్‌షిప్ ప్రపంచంలోని అతిపెద్ద మెట్రో రైల్ ప్రాజెక్ట్ అనే ఇతివృత్తంతో పరిశోధనా పత్రం రూపొందించింది. హార్వర్డ్ విశ్వవిద్యాలయం దీనిని ఒక కేస్ స్టడీగా ఎన్నుకొని తమ ప్రతిష్మాత్మక హార్వర్డ్ బిజినెస్ జర్నల్‌లో ప్రచురించిందని మెట్రో అధికారులు తెలిపారు. భూసేకరణ సమస్యలు, వివిధ ప్రభుత్వ శాఖల ఆమోదాలు, రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక సవాళ్లు లాంటి అనేక సమస్యలను ఎం.డి. ఎన్‌విఎస్ రెడ్డి సమర్థ నాయకత్వంతో అధిగమించారు. సమర్థమైన ప్రణాళికలు, సున్నితమైన చర్చల ద్వారా హైదరాబాద్ మెట్రోను ప్రపంచస్థాయి అభివృద్ధికి తీసుకువచ్చారని, ప్రతిభాపూర్వకమైన, ధైర్యమైన నిర్ణయాలు, పాలనలో చైతన్యం ద్వారా భారతదేశపు అత్యుత్తమ మెట్రో వ్యవస్థగా హైదరాబాద్ మెట్రో నిలిచిందని హార్వర్డ్ వర్సిటీ ప్రముఖంగా ప్రస్తావించడం విశేషం. ఈ ప్రాజెక్టును విజయవంతంగా అమలు చేయడానికి ఆయన అనుసరించిన విధానం అపూర్వమైనదిగా నిలిచిందని అధ్యయన పత్రం తెలిపింది. విలక్షణమైన ప్రణాళికా తీరు, సాంకేతిక పరిజ్ఞానం, ఆర్థిక విషయాలపై లోతైన అవగాహన, సమస్యలను అధిగమించే నాయకత్వ సామర్థ్యం ఈ ప్రాజెక్టును చరిత్రలో నిలిచిపోయేలా చేశాయని హార్వర్డ్ ప్రచురణ స్పష్టం చేసింది. అతి క్లిష్టమైన పిపిపి విధానం ద్వారా అమలు చేసిన హైదరాబాద్ మెట్రో రైలు ప్రాజెక్ట్ పెను సవాళ్లను ఎదుర్కొని నిలదొక్కుకోగలిగిందని ఈ అధ్యయన పత్రం తెలిపింది.

## ఎపి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా ఆలపాటి సురేశ్‌కుమార్

మొత్తం 22 సంస్థలకు చైర్మన్ల నియామకం



అమరావతి: ఏపీలో నామినేటెడ్ పదవుల కేటాయింపు కొనసాగుతోంది. తాజాగా 22 మందిని వివిధ సంస్థలకు చైర్మన్లుగా నియమించినట్లు ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించి ఉత్తర్వులు జారీ చేసింది. చంద్రబాబు సారథ్యంలో కూటమి ప్రభుత్వం కొలువు తీరిన తర్వాత విడతలవారీగా నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తూ వచ్చిన సంగతి తెలిసిందే. ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్ట్, ఐజేయూ కార్యవర్గ సభ్యుడు ఆలపాటి సురేశ్ కుమార్ నియమితులయ్యారు. ఎన్నికలకు ముందు వైసీపీ ఐదేళ్ల పాలనపై విధ్వంసం పేరుతో ఆలపాటి రచించిన పుస్తకాన్ని నాడు ప్రతిపక్ష నేతగా చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆవిష్కరించారు. నాలుగున్నర దశాబ్దాలకుపైగా జర్నలిస్ట్‌గా సేవలు అందించిన ఆలపాటి సురేశ్‌కుమార్ ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో ఉన్నత స్థాయిలో బాధ్యతలు నిర్వహించారు. ఆయనను ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా కేబినెట్ ర్యాంక్‌లో ప్రభుత్వం నియమించడం పట్ల ఆయనకు అనేకమంది ప్రముఖులు, సన్నిహితులు, శ్రేయోభిలాషులు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఇతర నామినేటెడ్ పోస్టుల విషయానికి వస్తే ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా డా. జెడ్.శివప్రసాద్ (నెల్లూరు సిటీ, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ విద్యా, సంక్షేమ మౌలిక వసతుల అభివద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఎస్. రాజశేఖర్ (కుప్పం, టీడీపీ). ఆంధ్రప్రదేశ్ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్‌గా సుగుణమ్మ (తిరుపతి, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ కార్మిక సంక్షేమ బోర్డుకు వెంకట శివుడు యాదవ్ (గుంతకల్, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ భవన, ఇతర నిర్మాణ కార్మికుల బోర్డుకు వలవల బాబ్జీ (తాడేపల్లిగూడెం, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివద్ధి కార్పొరేషన్‌కు బురుగుపల్లి శేషారావు (నిడదవోలు, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ మహిళల సహకార ఆర్థిక కార్పొరేషన్‌కు పీతల సుజాత (భీమవరం, టీడీపీ), తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి దివాకర్ రెడ్డి (తిరుపతి, టీడీపీ), ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి వాణి వెంకట శివ ప్రసాద్ పెన్నుబోయిన (ఏలూరు, టీడీపీ), ఎన్ఆర్టీ సొసైటీకి డా.రవి వేమూరు (తెనాలి, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ అగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు మలేపాటి సుబ్బా నాయుడు (కావలి, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్‌కు కె.ఎస్.జవహర్ (కొవ్వూరు, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల సహకార సంఘాల సమాఖ్యకు పెదిరాజు కొల్లు (నరసాపురం, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంక్షేమ, అభివద్ధి కార్పొరేషన్‌కు పేరేపి ఈశ్వర్ (విజయవాడ ఈస్ట్, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ వడ్డెర సంక్షేమ, అభివద్ధి కార్పొరేషన్‌కు మల్లెల ఈశ్వర రావు (గుంటూరు వెస్ట్, టీడీపీ), ఆంధ్రప్రదేశ్ టైలర్ల అభివద్ధి సహకార సమాఖ్యకు ఆకాసపు స్వామి (తాడేపల్లిగూడెం టీడీపీ), ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల అభివద్ధి సహకార సంస్థకు లీలా కష్ణ (మండపేట జనసేన పార్టీ), ఆంధ్రప్రదేశ్ లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీకి రియాజ్ (ఒంగోలు జనసేన పార్టీ), ఆంధ్రప్రదేశ్ హస్తకళల అభివద్ధి కార్పొరేషన్‌కు డా.పసుపులేటి హరి ప్రసాద్ (తిరుపతి జనసేన పార్టీ), ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ కమిషన్‌కు సోల్ల బోజ్జి రెడ్డి (రంపచోడవరం బీజేపీ), ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్ పర్సన్‌గా రాయపాటి శైలజ (అమరావతి జేఏసీ) నియమితుయ్యారు.

## భారత్-పాక్ కాల్పుల విరమణ ప్రకటన నేపథ్యంలో...

ప్రధానమంత్రి అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల సమావేశం నిర్వహించండి

కాంగ్రెస్ పార్టీ డిమాండ్



న్యూఢిల్లీ : ప్రధానమంత్రి అధ్యక్షతన తక్షణమే అన్ని రాజకీయ పార్టీల సమావేశం, పార్లమెంట్ ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్ చేసింది. పహల్గామ్ ఉగ్రదాడి ఘటన, ఆపరేషన్ సిందూర్, భారతదేశంపాకిస్థాన్ దేశాల మధ్య చోటు చేసుకుంటున్న అన్ని రకాల కాల్పులు, సైనిక చర్య నిలిపివేత అవగాహన కుదిరిన నేపథ్యంలో వీటిపై సమగ్రంగా చర్చించేందుకు ఈ సమావేశాలను వెంటనే ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ ప్రధానకార్యదర్శి జైరామ్ రమేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆయన ఆదివారం 'ఎక్స్' పోస్ట్‌లో ఈ విషయాన్ని వెల్లడించారు. భారత్‌-పాకిస్థాన్ మధ్య థర్డ్ పార్టీ జోక్యానికి భారత ప్రభుత్వం తలుపులను తెరిచిందా? లేదా పాకిస్థాన్ దౌత్య చానళ్లు ఈ జోక్యానికి తెరలేపాయా? అని జైరామ్ రమేష్ ప్రశ్నించారు. భూమి, గగనతలం, సముద్రంలో అన్ని రకాల కాల్పులు, సైనిక చర్యలు నిలిపివేసేలా భారతదేశం పాకిస్థాన్ దేశాల మధ్య అవగాహన కుదిరిందని శనివారం ప్రకటన వెలువడిన తర్వాత ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ వెంటనే ప్రధానమంత్రి అధ్యక్షతన అన్ని రాజకీయ పార్టీల సమావేశం, ప్రత్యేక పార్లమెంట్ సమావేశం నిర్వహించి పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, వాషింగ్టన్ డిసి నుంచి మొట్టమొదట కాల్పుల విరమణ ప్రకటన అంశాలపై పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా యుఎస్ సెక్రటరీ మార్కో రూబియో భారత్‌-పాక్ మధ్య చర్చలు ఒక తటస్థ ప్రదేశంలో జరుగనున్నాయని చెప్పడం అనేక ప్రశ్నలు తలెత్తేందుకు తావిస్తోందని జైరామ్ రమేష్ చెప్పారు. మనం సిమ్లా ఒప్పందాన్ని రద్దు చేశామా? థర్డ్ పార్టీ మధ్యవర్తిత్వానికి తలుపులు తెరిచి ఉంచామా? అని జైరామ్ రమేష్ ప్రశ్నించారు. ఏ ప్రయోజనాలను కోరి భారత్‌పాక్ మధ్య దౌత్య చానళ్లను తిరిగి ప్రారంభించారనే విషయాన్ని కాంగ్రెస్ పార్టీ తెలుసుకోవాలనుకుంటోందని రమేష్ అన్నారు.

## దొరికిన తిమింగలం.. 'దొరకాల్సిన బినామీలు'

జీవన్‌లాల్ వ్యవహరంపై సర్వత్రా చర్చ



ప్రజాపక్షం/ఖమ్మం : ఇటీవల కాలంలో అవినీతి నిరోధక శాఖాధికారులకు జూనియర్ అసిస్టెంట్లు లేదా నాల్గవ తరగతి ఉద్యోగులు పట్టుబడితే ఏసిబికి చిక్కిన అవినీతి తిమింగలం ఆనడం అనవాయితీగా మారింది. రూ. 20వేలు, రూ. 30వేలు ఒక్కో సందర్భంలో ఐదు వేలకు లోబడి లంచం తీసుకుంటూ చిక్కిన పరిక పిల్లలే అవి. దశాబ్ద కాలంగా ఎక్కడలేనివిధంగా రూ.70 లక్షలు లంచం తీసుకుంటూ మాజీ ఎంఎల్‌ఎ లావుడ్యా రాములు నాయక్ కుమారుడు ఐఆర్ఎస్ అధికారి లావుడ్యా జీవన్‌లాల్ దొరికిపోయాడు. కేంద్ర పరిశోధన సంస్థ (సిబిఐ) వల పన్ని జీవన్‌లాల్ సహ ఐదుగురిని అదుపులోకి తీసుకుంది. ప్రైవేటు సంస్థకు ఆర్థిక లబ్ది చేకూర్చే క్రమంలో రూ. 70 లక్షలు లంచం తీసుకునే ప్రక్రియలో వారిని అదుపులోకి తీసుకున్నారు. జీవన్‌లాల్ అందరిలా ఓ ఐఏఎస్ అధికారి అయితే ఇంతగా చర్చ ఉండేది కాదు. ఖమ్మంజిల్లాలో ఆయన ఓ రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి. భవిష్యత్తు రాజకీయాల మీద ఆశలు పెంచుకున్న వ్యక్తి కూడా. వైరా స్థానం కోసం అప్పటి వరకు కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ప్రయత్నించిన జీవన్‌లాల్ తండ్రి రాము లు నాయక్ వైరా స్థానం సిపిఐకి కేటాయించడంతో స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. సిపిఐ వ్యతిరేక శక్తులు కాంగ్రెస్‌లో గ్రూపు తగాదాలతో పాటు బిఆర్ఎస్ అభ్యర్థి మదన్‌లాల్‌ను వ్యతిరేకించే ఓ బిఆర్ఎస్ నేత మద్దతుతో రాములు నాయక్ విజయం సాధించారు. సాధించిన వెంటనే తనకు తోడ్పాటునందించిన వారితో కలిసి బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. తండ్రి ఎంఎల్‌ఎ కావడంతో జీవన్‌లాల్ నియోజకవర్గంలో ఒక రకంగా రాజకీయ నాయకునిలాగానే వ్యవహరించారు. గ్రామాల్లో తిరుగుతూ నేరుగా కార్యకర్తలతో సంబంధాలు ఏర్పరచుకుని రాజకీయ కార్యకలాపాలు నిర్వహించారు. అధికారపు అడుగులకు మడుగులు వత్తే కొందరు పోలీస్ అధికారులు ఆయనకు ప్రోటోకాల్ నిబంధనలను సైతం వర్తింపజేయడమే గాక జీవన్‌లాల్ ఏమి చెబితే అదే చేశారు. ఇంత వరకు ఒక పార్శ్వం అయితే మరో వైపు ఆయన అవినీతి సంపాదన. జీవన్‌లాల్ అవినీతి సంపాదనపై అప్పుడే జిల్లాలో విస్తృతంగా చర్చ జరిగింది. లెక్కకు మించిన ఆస్తులు కొనుగోలు చేశాడని రాజకీయ వర్గాల్లో సైతం చర్చ సాగింది. గోవాలో జీవన్‌లాల్‌కు రిసార్ట్స్ ఉన్నాయో లేవో కాని జిల్లాలో మాత్రం వీటిపై పలు చోట్ల గుసగుసలు వినిపించాయి. వీటికి తోడు ఖమ్మంజిల్లాలో కొందరు రాజకీయ నాయకులు జీవన్‌లాల్‌కు బినామీలుగా ఉన్నారన్న వాదన వినపడుతుంది. గతంలో బిఆర్ఎస్‌లో ఉండి కాంగ్రెస్‌లో చేరిన కొందరి నేతలతో పాటు ఇప్పటికీ బిఆర్ఎస్‌లో ఉన్న కొందరు జీవన్‌లాల్‌తో అత్యంత సన్నిహిత సంబంధాలను కొనసాగించారు. రానున్న ఎన్నికల్లో వైరా నియోజకవర్గం తిరిగి రిజర్వు అయితే అక్కడి నుంచి లేదంటే మహబూబాబాద్ పార్లమెంటు నుంచి పోటీ చేయించాలని కొందరు ఉత్సాహపడడం వెనక జీవన్ లాల్ ప్రోత్సాహం ఉంది. అటు రాజకీయంగా, ఇటు అవినీతి పరంగా ఇప్పుడు జీవన్‌లాల్ జిల్లాలో చర్చనీయాంశమయ్యారు. సిబిఐ అధికారులు బినామీలపై దృష్టిసారించారన్న వార్తల నేపథ్యంలో ఎవరికి ఆయన అవినీతి మరక ఇక్కడ నేతలకు అంటుకుంటుందేమోనని వేదన పడుతున్నారు. అసలు నిజంగా బినామీలు ఉన్నారా ఉంటే వారి పేరున ఎక్కడ ఆస్తులున్నాయి అన్నది సిబిఐ దర్యాప్తు తర్వాతే తేలనుంది. మొత్తంగా ఖమ్మంజిల్లాలో రూ. 70 లక్షల లంచం రాజకీయ ప్రకంపనలకు, పరాకాష్టకు చేరిన అవినీతికి చర్చా వేదికైంది.

## మంత్రి పొంగులేటికి సిపిఐ వినతి

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్: సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి సిపిఐ ఆధ్వర్యంలో ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. ఖమ్మంరూరల్ మండల పర్యటనలో భాగంగా పెద్దతండలో ఓ వివాహ వేడుకకు హాజరైన మంత్రిని సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చెరుకుపల్లి భాస్కర్, మండల సమితి సభ్యుడు దండి రంగా రావు కలిశారు. ఏదులాపురం మున్సిపాలిటీలో పని చేస్తున్న ఎఐటియుసి అనుబంధ సంఘం వర్కర్లకు ఎల్1 లిస్టులో అర్హత వచ్చినప్పటికీ, అధికారులు క్యాన్సల్ చేసినట్టుగా తెలిపారు. కార్మికులుగా పని చేస్తున్నారే తప్ప వారంతా నిరుపేదలని, ఎల్ 1లో వచ్చిన అర్హత ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన మంత్రి పరిశీలన చేస్తామని హామీ ఇచ్చినట్లుగా తెలిపారు సిపిఐ మండల నాయకుడు పొన్నెకంటి రామకృష్ణ, ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు, సభ్యులు పాల్గొన్నారు.

## బిసిల రిజర్వేషన్లకు గండి కొట్టకండి

బిజెపి నేతలు కాళ్లల్లో కట్టెలు పెట్టకండి : మంత్రి పొన్నం ప్రభాకర్




ప్రజాపక్షం/హైదరాబాద్: బిసిల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేసే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కృషికి గండి కొట్టొద్దని బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బిజెపి నేతలకు సూచించారు. బిజెపి నాయకుడు లక్ష్మణ్‌కు కులగణనపైన అనుమానాలు ఉంటే నివృతి చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బిసి కులగణన ఎలా చేపట్టామో తాము బిసి సంఘాలకు, బిసి మేధావులకు వివరించామని, వారందరూ కూడా ప్రభుత్వాన్ని ప్రశంసించారని, కానీ బిజెపి నాయకులు మాత్రం కాళ్లల్లో కట్టె పెట్టి అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆరోపించారు. బిజెపి అధ్యక్ష, శాసనసభలో ప్రతిపక్ష నాయకుడు,మండలిలో పక్ష నాయకుడి పదవులకు బిసిలు పనికి రారా? అని ప్రశ్నించారు. అన్ని అత్యున్నత పదవులు వేరే సామాజిక వర్గానికి కేటాయించిన బిజెపి,ఇప్పుడు బిసిలపైన మొసలి కన్నీరు కారిస్తే సమాజం అంగీకరిస్తుందా?అని అన్నారు. కేంద్రం పెంచే ధరలు, ఉద్యోగాలు, సంక్షేమ రంగాల్లో కోత విధిస్తున్నారని, తద్వారా అధికంగా నష్టపోయేది బిసి సామాజిక వర్గమేనని అన్నారు. బిసిల విషయంలో కాంగ్రెస్‌పై బిజెపి నాయకుడు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని సూచించారు. కులగణనకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో అఫిడవిట్ సమర్పించిన చరిత్ర బిజెపిది అని, గతంలో మండల్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తే కమండలం తీసుకొచ్చిందే బిజెపి అని మండిపడ్డారు. కుల గణన చేపట్టి,బిసిలకు రాజకీయ, విద్య,ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లు తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మోడల్‌గా నిలిచిందని చెప్పారు.

# కొత్త తరహా ఇందిరమ్మ ఇండ్లు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం: ఇల్లు కట్టాలంటే మామూలు ప్రయాస కాదు. సిమెంట్, ఇనుము, కూలీల ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. ఈ క్రమంలో ఇంటి నిర్మాణ ధరలు సామాన్యునికి అందుబాటులో లేవు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో భాగంగా ఒక్కొక్క ఇంటికి రూ.5 లక్షలు ఇస్తున్నప్పటికీ ప్రస్తుత ముడిసరుకు రేట్లతో ఆ డబ్బులతో ఇంటిని నిర్మించ లేక పోతున్నారు. ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వం ఇచ్చే రూ.5 లక్షలు సరిపోవడం లేదని, మరికొంత పెంచాలని ప్రభుత్వానికి విన్నవించుకుంటున్నారు. దీంతో ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి షేర్‌వెల్ టెక్నాలజీ నూతన పద్ధతుల్లో అదే ధరకు ఇందిరమ్మ ఇంటిని సరి కొత్తతరహాలో నిర్మించి ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసింది.

**కొత్తతరహాలో ఇందిరమ్మఇండ్లు:** పేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో కొత్తతరహాలో ఇందిరమ్మ ఇండ్లను నిర్మించి ఇచ్చేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటికే రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో నూతన షేర్‌వెల్ టెక్నాలజీతో కూడినఇండ్లను పైలెట్ ప్రాజెక్టు క్రింద నిర్మించారు. ఈ ఇళ్లను లబ్ధిదారులకు చూపించి ఈ తరహా ఇండ్లు తమ ఇష్టపూర్తిగా నిర్మించుకుంటే నిధులు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెబుతున్నట్లు తెలుస్తోంది. కాగా ఈ తరహా ఇంటిని కేవలం



15 రోజుల్లోనే పూర్తి చేసి అందిస్తారు. 30 ఏళ్ల వరకు మన్నిక ఉంటుంది. పెద్దపెద్ద అపార్ట్‌మెంట్లు, విల్లాలు, బహుళ అంతస్థుల భవనాలు దేశవ్యాప్తంగా ఇదే తరహాలో నిర్మాణాలు చేపడుతున్నారు.

**ఇటుకలు, ఇనుము లేకుండా:** కొత్తపద్ధతుల్లో నూతన ఇళ్లు ఇటుకలు, ఇనుము లేకుండా నిర్మిస్తారు. షేర్‌వెల్ టెక్నాలజీ ద్వారా అల్యూమిలియం ఫ్రేమ్‌లు సిద్ధం చేసి వాటిలో కాంక్రీట్ నింపి గోడలు సిద్ధం చేస్తారు. దీంతో ఇటుకలు వాడే పని తగ్గుతుంది. మరో ప్రక్క ఇనుము పెద్దగా ఖర్చు కాదు. అదే విధంగా స్లాబ్ విషయంలో ఇదే తరహా పద్ధతిని పాటిస్తారు. స్లాబ్ లెవల్లో రూఫ్‌కి షీట్ అమర్చి దానిపై ఇనుముతో మాములు స్లాబ్ వేసేలా నిర్మాణాన్ని చేస్తారు. ఆ తరువాత 6 అంగులాల మందంలో కాంక్రిట్ వేసి స్లాబ్ పూర్తి చేస్తారు. ఇంటిలో పలి భాగంగా గోడలు నున్నగా ఉండేలా సిద్ధం చేశారు. యూపివిసి గడపలు,తలుపులు,కిటికిలతో సిద్ధం చేస్తారు. దీనికి ప్రభుత్వం ఇచ్చే రూ. 5 లక్షల సరిపోయే అవకాశం ఉన్నట్లు చెబుతున్నారు. కాగా ప్రభుత్వం నిబంధనల ప్రకారం 400 నుండి 600 గజాల్లోనే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకోవాలని ప్రభుత్వం చెబుతుండటంతో ఈ కొత్త టెక్నాలజీ అందుకు అనుగుణంగాఉంటుందని పలువురు నిపుణులు వాదన.

**ఆసక్తి చూపుతున్న జనం :** షేర్‌వెల్ టెక్నాలజీలో ఇంటిని నిర్మించుకునేందుకు ఆయా జిల్లాల్లో జనం ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. ఎక్కువ విస్తీర్ణంలో అప్పులు చేసి ఇంటిని నిర్మించుకున్నా ప్రభుత్వం నిధులు విడుదల చేయమంటూ తేల్చి చెప్పడంతో తక్కువ సమయంలో అయిపోయే ఇలాంటి ఇంటిని కట్టుకుంటే మేలని అంటున్నారు. ఇప్పటికే ప్రభుత్వం షేర్‌వెలె టెక్నాలజీ ఇళ్ల నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పైలెట్ ప్రాజెక్టు క్రింద నాలుగు జిల్లాల్లో ప్రవేశపెట్టగా ప్రజల నుండి పెద్ద ఎత్తున స్పందన వస్తుండటంతో రాష్ట్రమంతా దీనిని అమలు చేసేందుకు చూస్తున్నారు. ఆసక్తిఉన్న వారు షేర్‌వెల్



టెక్నాలజీ ఇంటిని కట్టుకుంటే ప్రభుత్వం నిబంధనలకు అనుగుణంగా నిధులు విడుదల చేస్తుందని హౌసింగ్ కార్పోరేషన్ చెబుతోంది.

**తీరనున్న సొంతింటి కల:** పక్కా గృహాన్ని నిర్మించుకోవాలనే పేద కోరిక కొత్తరక టెక్నాలజీతో తీరేలా ఉంది. నెలలకు నెలలు ఇంటిని కట్టే పనిలో ఉండకుండా, ఎక్కువ డబ్బులు ఖర్చు చేయకుండా ప్రభుత్వం ఇచ్చే నిధులతోనే ఇల్లు పూర్తి కానుండటంతో పేదల సొంతింటి కల తీరుతుందని పలువురు నిర్మాణరంగ నిపుణులు అంటున్నారు. దేశంలో బహుళ అంతస్తు భవనాలన్నీ ఇదే పద్ధతిలో కడుతున్నట్లు చెబుతున్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉండటంతో త్వరలో షేర్‌వెట్ టెక్నాలజీతో కూడిన ఇళ్లను నిర్మించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

## కాంగ్రెస్ హయాంలోనే రెట్టింపు ధాన్యం : మల్లు రవి

ప్రజాపక్షం/హైదరాబాద్: బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 16.85 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గత ఏడాది 37.73 లక్షల మెట్రిక్ టన్నుల సేకరించామని కాంగ్రెస్ ఎంపి మల్లు రవి అన్నారు. గత పాలకుల కంటే అంతకు రెట్టింపు ధాన్యం సేకరించామని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సన్నారకం ధాన్యానికి క్వింటాకు రూ. 500ల బోనస్ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. రబీ సీజన్‌లో వర్షంతో ధాన్యం తడిసి రైతులకు నష్టం జరగకుండా పెద్ద ఎత్తున టార్పాలిన్ కొనుగోలు చేసి, రైతులను అదుకుంటున్నామని,ఇవన్నీ బిఆర్ఎస్ నాయకులకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నోటికొచ్చినట్టు ఆరోపణలు చేయకుండా క్షేత్ర స్థాయిలోకి వెళ్లి పరిశీలిస్తే వాస్తవాలు తెలుస్తాయని మల్లు రవి సూచించారు.

## గుప్తనిధుల కోసం తవ్వకాలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** గుప్త నిధుల కోసం తవ్వకాలు చేపట్టారు. శనివారం అర్ధరాత్రి కేశంపేట మండల పరిధిలోని వేములనర్వ గ్రామ సమీపంలోని అల్వాల రోడ్డులో ఉన్న బీరప్ప స్వామి దేవాలయం ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేశారు. గ్రామస్తుల కథనం ప్రకారం... గ్రామ సమీపంలో ఉన్న బీరప్ప స్వామి దేవాలయం ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తులు నిమ్మకాయలు, గుమ్మడికాయలు, పసుపు, కుంకుమ, అగర్‌బత్తిలు వంటి పూజా సామాగ్రి తీసుకువచ్చి పూజలు చేసి తవ్వకాలు చేపట్టినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం స్థానికులు అటువైపు వెళ్లగా పూజలు చేసి తవ్వకాలు చేపట్టినట్లు కనిపించిందని గ్రామస్తులు వివరించారు. రాత్రి సమయంలో కేశంపేట పోలీసులు పెట్రోలింగ్ చేయకపోవడంతోనే గుర్తు తెలియని వ్యక్తులు చెలరేగిపోతున్నారని వారు వివరించారు. దేవాలయాలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అధికారులు, పోలీసులు సకాలంలో స్పందించి తవ్వకాలకు పాల్పడిన వ్యక్తులకు గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని వేములనర్వ గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. మరోమారు ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు పెట్రోలింగ్ చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని గ్రామస్తులు పేర్కొన్నారు.

## కాలనీల అభివృద్ధికి సహకారం

**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** హస్తినాపురం డివిజన్ పరిధిలోని తుల్జాభవాని కాలనీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాత్లావత్ శంకర్‌లాల్, ప్రధాన కార్యదర్శిగా టి.శివకుమార్‌రెడ్డి, కోశాధికారిగా నేనావత్ జీవన్‌కుమార్ నాయక్, ఉపాధ్యక్షులుగా ఎస్.మురళీకృష్ణ, అనిల్, శంకర్, సహాయ కార్యదర్శిగా కే.జంగయ్య, లీగల్ అడ్వైజర్లుగా బి.లక్పతి నాయక్, ఎం.శివకుమార్, నామ్యానాయక్‌తో కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష, కార్యదర్శి శంకర్‌లాల్, శివకుమార్‌రెడ్డి



లు మాట్లాడుతూ అందరి సహకారంతో కాలనీని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని వారు తెలిపారు.

## ఎంసెట్‌లో 'విజ్ఞాన్' ప్రభంజనం

**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆదివారం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఎంసెట్ ఫలితాల్లో షాద్‌నగర్ పట్టణంలోని విజ్ఞాన్ కళాశాలకు చెందిన విద్యార్థిని చందన ఎంసెట్‌లో 1500టాప్ ర్యాంక్ సాధించినట్లు అధ్యాపక బృందం తెలిపారు. విజ్ఞాన్ జూనియర్ కళాశాలలో బైపిసి రెండవ సంవత్సరం చదువుతున్న చందన ఎంసెట్‌లో ర్యాంక్ సాధించడం పట్ల కళాశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ విశ్వనాథంతోపాటు అధ్యాపక బృందం సభ్యులు పాల్గొన్నారు.

### విశ్వభారతి కళాశాల విద్యార్థుల ప్రతిభ





తెలంగాణ ఎంసెట్ ఫలితాల్లో విశ్వభారతి కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ శివకుమార్ తెలిపారు. కళాశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థిని స్ఫూర్తి రాష్ట్ర స్థాయిలో 5841 ర్యాంక్, శ్రీ భవాని రాష్ట్ర స్థాయిలో 7169ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో తమ విద్యార్థినీలు ర్యాంకులు సాధించడం సంతోషంగా ఉందని తెలిపారు.

## చేపపిల్లల ఉత్పత్తి కేంద్రం కూల్చటం హేయమైన చర్య : జాన్‌వెస్లీ




**ప్రజాపక్షం/ ఇబ్రహీపట్నం :** చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని కూల్చటం హేయమైన చర్య అని సిపి(ఐ)ఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ తీవ్రంగా ఖండించారు. ఆదివారం రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండల కేంద్రం సమీపంలో శేరిగూడ గ్రామంలో మత్స్యశాఖకు చెందిన చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని అధికారులు కూల్చీవేయటంతో ఆయన ఉత్పత్తి కేంద్రాన్ని సందర్శించి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్స్యశాఖ అధికారులు కాంట్రాక్టుల నుండి కమీషన్ ఆర్జించటానికి చేప పిల్లల కేంద్రం కూల్చి వేయటం మూర్ఖత్వమన్నారు. కూల్చి ప్రాంతంలో చేపపిల్లల కేంద్రం పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. లేనిచో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈయన వెంట నాయకులు లెల్లల బాలకృష్ణ, పగడాల యాదయ్య, గెరెంకల నర్సింహ్మ సిఎచ్ శంకర్ పాల్గొన్నారు.

## వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాణు నాయక్



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, భూమి కోసం భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన గిరిజన ముద్దుబిడ్డ జాటోత్ ఠాణు నాయక్ అని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి, తెలంగాణ అర్బన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చల్లా నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం బాలాపూర్ మండలం జిల్లలగూడ చందన చెరువు కట్ట వద్ద నిర్మించిన మినీ ట్యాంక్ బండ్‌పై నూతనంగా ఏర్పాటు చేసిన వీర తెలంగాణ సాయుధ పోరాట యోధుడు జాటోత్ ఠాణు నాయక్ విగ్రహాన్ని మాజీ ఎంపి రవీందర్ నాయక్ లతో కలిసి వారు ఆవిష్కరించారు. కార్యక్రమం ఆర్గనైజర్స్ ప్రొఫసర్ శంకర్ నాయక్, హాము నాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ ధర్మనాయక్, కృష్ణ నాయక్,గిరిజన సమాఖ్య రాష్ట్ర నాయకులు రాత్లావత్ శంకర్ నాయక్, గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివప్రచండ, మీర్ పేట మున్సిపల్ కార్పొరేషన్ ఇందిరమ్మ కమిటీ ఇంచార్జ్ అండ్ కోఆర్డినేటర్ ధరావత్ స్వామి నాయక్, మీర్పేట ఎక్స్ ఆప్షన్ జటావత్ రవి నాయక్,హరి నాయక్,రూప్ సింగ్ నాయక్,కొర్ర లక్పతి నాయక్,రమావత్ పాండు నాయక్,గిరిజన పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/ ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామంలో 2007–08 బ్యాచ్‌కు చెందిన పదవ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. గతంలో పాఠశాల్లో విద్యను బోధించిన ఉపాధ్యాయులను స్వాగతించి శాలువలతో సన్మానించారు. ముందుగా భారత్ పాక్ దేశాల మధ్య జరిగిన యుద్ధంలో మరణించిన విరా జవాన్‌లతో పాటు గతంలో జడ్పిఎచ్ఎస్ పాఠశాల్లో ప్రధానోపాధ్యాయులు వసంత రెడ్డి మృతిపై సంతాపం ప్రకటించి ఘనంగా నివాళ్లులు అర్పించారు.

**షాద్‌నగర్ :** ఆదివారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని వెల్‌జర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005సంవత్సరానికి చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరినోరు అప్యాయంగా పలకరించుకొని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులకు పూలమాలలు, శాలువాలు, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



# పాత భవనాలతో ప్రాణాలకు ముప్పు



### శిథిల భవనాలపై జిహెచ్ఎంసి అప్రమత్తం
### కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాల గుర్తింపునకు సర్వే
### టౌన్‌ప్లానింగ్ యంత్రాంగాన్ని ఆదేశించిన జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలం దగ్గర పడుతుండటంతో బల్దియా యాంత్రాంగం అప్రత్తమైంది. వర్షాకాల సన్నద్ధతలో భాగంగా ప్రమాదకరంగా మారిన పురతన శిథిలావస్థకు చేరిన భవనాలు గుర్తించేందుకు చర్యలు చేపట్టింది. ప్రమాదాల నివారణకు సమయానుకూల చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ ప్రారంభించింది. పాత భవనాలతో ప్రజలకు ఎలాంటి ముప్పు వాటిల్లకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకునేందుకు సర్కిళ్ల వారిగా నిర్దిష్టమైన చర్యలు చేపట్టేందుకు మహానగర పాలక సంస్థ(జిహెచ్ఎంసి) కమిషనర్ ఆర్.వి. కర్ణన్ మార్గదర్శకాలు విడుదల చేశారు. శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించాలని కమిషనర్ పట్టణ ప్రణాళిక(టౌన్‌ప్లానింగ్) విభాగాన్ని ఆదేశించారు. శిథిల భవనాలపై సర్వే చేపట్టి, నివేదిక అందచేయాలని స్పష్టం చేశారు. ప్రమాదకరంగా ఉన్న వాటిపై తక్షణం చర్యలు చేపట్టాలన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకునేలా సంబంధిత భవన నిర్మాణదారులు, యజమానులకు నోటీసులు జారీ చేయాలని స్పష్టం చేశారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలో విఫలమైతే జరిగే దురదుష్టకరమైన సంఘటనలకు వారే బాధ్యత వహించాల్సి ఉంటుందని కమిషనర్ ఆర్.వి.కర్ణన్ హెచ్చరించారు.



### ప్రమాదాల నివారణకు కూల్చివేతలు చేపట్టాలి : చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్

క్షేత్ర స్థాయిలో పాత భవనాలు, ప్రహారీగోడలు గుర్తించేందుకు, వర్షాకాల సన్నద్ధతపై చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్ జోనల్, సర్కిల్ అధికారులకు టెలికాన్ఫరెన్స్ ద్వారా మార్గనిర్దేశం చేశారు. నగరంలో వర్షాల కారణంగా ఎలాంటి ప్రమాదాలు చోటు చేసుకోకుండా ముందస్తూ చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సర్కిళ్ల వారీగా శిధిలావస్థకు చేరుకున్న భవనాలను, నిర్మాణాలను గుర్తించాలన్నారు. కూలేపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనాలను కూల్చివేతలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న సెల్లార్‌లను గుర్తించి, ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలపై సంబంధిత వ్యక్తులను అప్రమత్తం చేయాలని సూచించారు. శిథిలావస్థకు చేరిన నిర్మాణాలు, ప్రహరీ గోడలు, సెల్లార్‌ల తవ్వకం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ముందుగా వాటిని యుద్ధ ప్రతిపాదికన గుర్తించాలన్నారు.

### ప్రజల ప్రాణాలు కాపాడటమే ప్రథమ కర్తవ్యం..

తమ తమ సర్కిళ్ల పరిధిలో ప్రమాదాలు జరగకుండా తీసుకున్న చర్యలతో పాటు శిథిలావస్థకు చేరిన భవనాలు, ప్రహరీగోడలపై పూర్తి నివేదికను సమర్పించాలని చీఫ్ సిటీ ప్లానర్ కె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. 2024 సంవత్సరంలో నగరంలో ప్రమాదకరంగా మారిన 597 భవనాలను గుర్తించామని వెల్లడించారు. వాటిలో 354 భవనాలను కూల్చేశామన్నారు. 243 భవనాల్లో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించి, ప్రమాదాలను నివారించామని చెప్పారు. ఈ సంవత్సరం కూడా వేగంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజల ప్రాణాలు కాపాడటమే తమ ప్రథమ కర్తవ్యమని తెలిపారు. పాత భవనాల్లో ఉంటున్న నివాసితులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లేదా ఖాళీ చేయాలని చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్ సూచించారు.

– సర్కిళ్లవారీగా పాత భవనాలు, కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు గుర్తించాలి
– ప్రమాదకరంగా మారిన భవనాల తనిఖీల బాధ్యతను ఇంజనీరింగ్ విభాగం అధికారులకు అప్పగించాలి
– ఇంజనీరింగ్ అధికారుల నివేదిక ప్రకారం, ప్రమాదకరంగా ఉన్న భవనాలకు నోటీసులు జారీ చేయాలి
– వాటిలో నివాసం ఉంటున్న వారిని ఖాళీ చేయించాలి, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించాలి
– పాత భవనాల్లో నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాలలు ఉంటే విద్యాశాఖను అప్రమత్తం చేయాలి
– ప్రమాకరంగా మారిన భవనాల చుట్టూ బ్యారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి.
– యజమాని శిథిల భవనానికి మరమ్మత్తులు చేయిస్తే, ప్రమాణాల ప్రకారం భద్రతపై ధృవీకరణపై పత్రం సమర్పించాలి.
– పాత భవనాల కూల్చివేతకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలి.

## హైడ్రాపై ఎంపి ఈటల వ్యాఖ్యలు దురదృష్టకరం

### హైడ్రా కమిషనర్ ఎవి.రంగనాథ్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బాచుపల్లి ఎంఆర్‌ఓకు ఇచ్చిన నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదని కమిషనర్ ఎవి.రంగనాథ్ అన్నారు. హైడ్రాపై బిజెపి ఎంపి ఈటల చేసిన వ్యాఖ్యల పట్ల హైడ్రా కమిషనర్ స్పందించారు. ఈ సందర్భంగా ఈటల వ్యాఖ్యలపై రంగనాథ్ స్పష్టత ఇచ్చారు. ఎంపి ఈటల రాజేందర్ వ్యాఖ్యలు దురదృష్టకరమని, పేదలు, సామాన్యులను హైడ్రా ఇబ్బంది పెట్టదని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. బాచుపల్లి ఎంఆర్‌ఓ ఇచ్చిన నోటీసులతో హైడ్రాకు సంబంధం లేదని, అసలు ఈవిషయం గురించి కూడా తనకు కానీ హైడ్రా అధికారులకు కానీ తెలియదన్నారు. ఇదే విషయాన్ని మేడ్చల్ మల్కాజగిరి కలెక్టర్‌తో మాట్లాడానని, ఆ నోటీసులు ఎందుకు ఇచ్చారో కలెక్టర్‌ని కోరినట్టు తెలిపారు. ప్రతి నోటీస్‌ను, ప్రతి కూల్చివేతను హైడ్రాకు ఆపాదించి, ప్రజలను ఆందోళనకు భయ భ్రాంతులకు గురి చేయడం దురదృష్టకరమన్నారు. బడా భూకబ్జా దారుల మీద హైడ్రా కఠినంగా ఉంటూ సామాన్యులకు అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కలెక్టర్‌కి కూడా తెలియకుండానే ఎంఆర్‌ఓ నోటీసులు ఇచ్చారని మల్కాజిరి ఎంపి ఈటల రాజేందర్ ఒకవైపు చెబుతూనే, ఎంతో నిబద్ధతో పని చేస్తున్న హైడ్రాను దోషిగా నిలబెట్టాలని చేస్తున్న ప్రయత్నాలు దురదృష్టకరమన్నారు. ఈటల రాజేందర్ మాటలు ప్రజలను తప్పుదోవ పట్టించేవిగానూ, అయోమయానికి గురిచేసేవిగా ఉన్నాయని రంగనాథ్ అభ్యంతరం వ్యక్తం చేశారు. హైడ్రా పనితీరుపై ప్రజల్లో స్పష్టమైన అవగాహన ఉన్న తరుణంలో ఈటల రాజేందర్ లాంటి వారు హైడ్రాపై ఆరోపణలు చేస్తూ ప్రజలను అయోమయానికి గురి చేయడం సబబు కాదన్నారు. ఇక సచివాలయంలో ఈటల కలిసినప్పుడు కూడా హైడ్రా కార్యకలాపాలపై చర్చ వస్తే స్పష్టంగా వివరించానని, జూలై, 2024 కంటే ముందు కట్టిన నివాసాల జోలికి హైడ్రా వెళ్ళదని స్పష్టం చేసానని రంగనాథ్ చెప్పారు. అనుమతులు తీసుకున్న వాణిజ్య సముదాయాలను కూడా హైడ్రా తొలగించదని, పేదలు, సామాన్యులకు హైడ్రా ఇబ్బంది పెట్టదన్నారు. హైడ్రా పని తీరుపైన ప్రజలు ఎంతో స్పష్టతతో ఉన్నారని, అనవసరమైన ఆరోపణలు చేసి అయోమయానికి గురి చేయవద్దని హైడ్రా కమిషనర్ కోరారు.

## ముగ్గురు ప్రాణాలు తీసిన కొత్తకారు మురిపెం



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కొత్తకారును స్నేహితులకు చూపించి వారితో సరదాగా గడపాలనుకున్నాడు. కానీ అదే వారి చివరి ప్రయాణం అవుతుందనుకోలేదు. సరదాగా కారులో వెళ్లిన ముగ్గురు స్నేహితుల ప్రయాణం విషాదాంతమైంది. రోడ్డుపై నిలిపిన వాహనాన్ని ఢీకొని ముగ్గురు మరణించారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ బహదూర్‌పురా హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన రితేశ్ అగర్వాల్ ఇటీవల కొత్త కారు కొన్నాడు. తన తండ్రి కొన్న కారును తన స్నేహితులకు చూపించాలనుకున్న ఆయన కుమారుడు దీపేశ్ అగర్వాల్ శనివారం రాత్రి కార్వాన్ విజయనగర్ కాలనీకి చెందిన సంచయ్ మల్పానీ, ప్రగతినగర్‌కు చెందిన ప్రియాన్ష్‌ను కలిశాడు. కొత్తకారు కావడంతో సరదాగా అవుటర్ రింగ్ రోడ్డు చుట్టొద్దామని ప్లాన్ వేసుకున్నారు. ముగ్గురు కలిసి కారులో శంషాబాద్ నుంచి అవుటర్ రింగ్ రోడ్డు మీదుగా ఘట్కేసర్ వైపు బయలుదేరారు. అర్ధరాత్రి దాటిన తర్వాత అబ్దుల్లాపూర్మెట్ పోలీస్‌స్టేషన్ పరిధి గండిచెరువు వంతెన సమీపంలో రోడ్డుపై నిలిపిఉన్న గూడ్స్ వాహనాన్ని గుర్తించకుండా వేగంగా ఢీకొట్టారు. దీంతో కారు ముందుభాగం వాహనం కిందకి చొచ్చుకెళ్లింది. వాహనానికి మంటలంటుకున్నాయి. గమనించిన స్థానికులు మంటలార్పడానికి తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. దీపేశ్ అగర్వాల్, సంచయ్ మల్పానీ మంటల్లో సజీవ దహనమయ్యారు. మంటలార్పి ప్రియాన్ష్‌ను బయటకు తీసి ఎల్‌బినగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. కాగా అర్ధరాత్రి ఎలాంటి సూచికలు లేకుండా నోపార్కింగ్ ప్రాంతంలో డ్రైవర్ వాహనాన్ని నిర్లక్ష్యంగా నిలిపి ప్రమాదానికి కారణమయ్యాడని రితేష్‌కుమార్ అగర్వాల్ చేసిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## రూ.4 లక్షల డిఫెన్స్, విదేశీ మద్యం స్వాధీనం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** అనుమతి లేకుండా నాన్ పెయిడ్ లిక్కర్ వినియోగిస్తున్నారనే సమాచారం మేరకు శంషాబాద్ డిటిఎఫ్ ఎక్సైజ్ పోలీసులు మోయినాబాద్ లోని ఒక ఫామ్ హౌస్‌పై దాడి చేసి 52 మద్యం బాటిలను సీజ్ చేయడంతో పాటు ఫంక్షన్‌హాల్ యజమానిపై కేసు నమోదు చేశారు. మొయినాబాద్ పరిధి గోల మోరి అనే ఫంక్షన్ హాల్ లో ఒక కుటుంబం తమ బంధుమిత్రులతో కలిసి ఫంక్షన్ ఏర్పాటు చేసుకున్నారు. ఫంక్షన్‌కు వచ్చిన బంధువులకు, అతిధులకు మందు మటన్ ఏర్పాట్లు చేశారు. ఫంక్షన్‌లో ఢిల్లీ, డిఫెన్స్ మద్యం బాటిళ్లను నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ని వినియోగిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఢిల్లీకి చెందిన 60 బాటిల్లు, గోవాకు చెందిన నాలుగు బాటిల్లు, డ్యూటీ పేడ్ లిక్కర్ 3 తెలంగాణకు చెందిన మూడు, లిక్కర్లు 12 బీర్ బాటిల్లను ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మద్యం వినియోగించిన వ్యక్తిపై కేసు నమోదుతో



పాటు, లైసెన్స్ తీసుకోకుండా ఫంక్షన్ నిర్వహిస్తున్న ఫంక్షన్ హాల్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు శంషాబాద్ ఎక్సైజ్ సూపరిండెంట్ కృష్ణప్రియ తెలిపారు. సిఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బంది గణేష్, మల్లేష్, నెహ్రూ,సాయి శంకర్, శేఖర్ ఉన్నారు.

## క్రీడాస్ఫూర్తిని పెంపొందిస్తున్న వేసవి క్రీడా శిబిరాలు

### జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ యాదగిరి రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** విద్యార్థులకు వేసవి క్రీడల శిక్షణ శిబిరాలు క్రీడా స్ఫూర్తిని పెంపొదిస్తున్నాయని జిహెచ్ఎంసి అదనపు కమిషనర్ (క్రీడలు) డాక్టర్ యాదగిరిరావు అన్నారు. వేసవి క్రీడల శిక్షణ శిబిరాలను సికింద్రాబాద్, శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి జోన్‌లలో కోచ్‌లతో పాటు సంబంధిత ఆటల ఇన్స్‌స్పెక్టర్‌లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. కోచ్‌ల వారీగా పనితీరును పరిశీలించారు. పిజెఆర్ స్టేడియం, ఇందిరా పార్క్‌లో రోలర్ స్కేటింగ్ పార్ట్ టైమ్ కోచ్‌గా ఉత్తమ ప్రదర్శన ఇచ్చిన నూర్ మొహమ్మద్, కరాటే గౌరవ కోచ్ లక్ష్మణ్‌లో పాటుగా విజేతలు శ్రావణ, పూజితలను అభినందించారు.



జిహెచ్ఎంసి పరిధిలో ఏర్పాటు చేసిన కోచింగ్ క్యాంపులను ఉపయోగించుకునేలా పిల్లలను ప్రోత్సహించాలన్నారు. ఈ వేసవి సెలవుల్లో విద్యార్థులకు ఒక చక్కని అవకాశమన్నారు.

## వీధి పశువులపై ట్రాఫిక్, జిహెచ్ఎంసి స్పెషల్ డ్రైవ్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు ప్రమాదాలతో పాటు ట్రాఫిక్‌కు సంకటంగా మారిన వీధి పశువులపై హైదరాబాద్ ఉత్తర మండల ట్రాఫిక్ పోలీసులు, జిహెచ్ఎంసి అధికారులతో కలిసి ఆదివారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాల్లో వీధి పశువులను తొలగించే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించినట్లు ట్రాఫిక్ ఎసిపి జి.శంకర్‌రాజు తెలిపారు. వాహనదారుల నుంచి తరచూ వచ్చే ఫిర్యాదుల ఆధారంగా ఈ చర్య చేపట్టబడింది. వీధుల్లో సంచరిస్తున్న ఆవులు, ఎద్దులు, గేదెలు రాకపోకలకు అంతరాయం కలిగించడం, అలాగే పాదచారుల్లో భయం కలిగించడం వంటి సమస్యలు ఏర్పడుతు




న్నాయన్నారు. వీధిపశువుల నుండి రోడ్లను స్వచ్ఛంగా చేయడానికి ఈ డ్రైవ్ కొనసాగుతుందన్నారు. దీని ముఖ్య ఉద్దే శ్యం ప్రజల భద్రతతో ట్రాఫిక్ నిరవధికంగా కొనసాగడమన్నారు. కార్యక్రమంలో గోపాలపురం ట్రాఫిక్ సిఐ జె.భాస్కర్, జిహెచ్ఎంసి సిబ్బంది పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాలలో వైద్యసేవలు అభినందనీయం

### షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/కొత్తూరు :** గ్రామీణ ప్రాంతాలలో డాక్టర్ రామ్‌రాజ్ లాంటి నిబద్దత కలిగిన వైద్యులు ముందుకు వచ్చి వైద్యసేవలు అంధించడం అభినందనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం నందిగామ మండల పరిధిలోని చేగూరు గ్రామంలో లిమ్స్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి ఆసుపత్రులు గ్రామీణ ప్రాంతాల్లో ఉచితంగా నిర్వహిస్తున్న వైద్య శిబిరాలకు ప్రభుత్వపరంగా మద్దతు ఇస్తున్నామని వివరించారు. ప్రజలందరు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షించారు. డాక్టర్ రామ్ రాజ్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో అత్యవరస వైద్య సేవలు అందుబాటులో ఉండాలన్నదే మా లక్ష్యమని అన్నారు. వైద్యశిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థో, కంటి, డెంటల్, బిపి, షుగర్, ఈసిజి వంటి విభాగాల్లో వైద్య నిపుణులు సేవలు అంధించినట్లు తెలిపారు.





### అమ్మను మించిన దైవం లేదు
### యూవైసి ఫౌండేషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే

**షాద్‌నగర్ :** సృష్టిలో అమ్మను మించిన దైవం మరొకటి లేదని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం పట్టణ శివారులోని ఎఫ్‌సిఎన్ ఫౌండేషన్‌లో యూవైసి మొదటి కార్యక్రమ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రారంభించారు. మాతృ దినోత్సవం సందర్భంగా వృద్ధ మహిళలకు చీరలను పంపిణీ చేయడంతోపాటు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శంకర్ మాట్లాడుతూ ప్రేమకు, త్యాగానికి ప్రతీరూపమే అమ్మ అన్న విషయాన్ని ప్రతిఒక్కరూ గుర్తించుకోవాలని సూచించారు. యువైసి ఫౌండేషన్ నిర్వాహకులు భవిష్యత్‌లో మరిన్ని మంచి కార్యక్రమాలను నిర్వహించేందుకు కృషి చేయాలని, ఆశ్రమంలో ఉన్న ప్రతి ఒక్కరికి నాణ్యమైన భోజనం అంధించడంతోపాటు ఆరోగ్యస్థితి గతులను సక్రమంగా చూసే విధంగా చూడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్‌రెడ్డి, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, సంఘ సేవకురాలు అలియా సుల్తానా, నేతలు రఘునాయక్, మహ్మద్ ఇబ్రహీం, న్యాయవాదులు సబియా సుల్తానా, యాస్మిన్, అగ్గనూరి బస్వం, కొమ్ము కృష్ణ, కుమార్ గౌడ్, సయ్యద్ ఖదీర్ పాల్గొన్నారు.

## నేడే ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ప్రారంభోత్సవం




**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** వికారాబాద్ జిల్లా కేంద్రాంలో ప్రభుత్వ వైద్యకళాశాలకు అనుబందంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రిని సోమవారం వైద్యఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రారంభోత్సవం చేపట్టడం జరుగుతుంది అని జిల్లా కలెక్టర్ తెలిపారు. మంత్రి పర్యటన సందర్భంగా మధ్యాహ్నం 12గంటలకు 30లకు పరిగి పట్టణ కేంద్రంలో వంద పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు భూమి పూజ నిర్వహిస్తారని అన్నారు. అనంతరం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయంలో వైద్యఅధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారు అనంతరం నూతనంగా నిర్మించిన ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ప్రారంభోత్సవం చేస్తారని కలెక్టర్ తెలిపారు.

## సిపిఐ ఉప్పల్ మండల కార్యదర్శిగా టి.సత్యప్రసాద్, సహాయ కార్యదర్శిగా బషీర్

**ప్రజాపక్షం/కాప్రా :** సిపిఐ ఉప్పల్ మండల క్యాదర్శిగా టి.సత్యప్రసాద్, సహాయ కార్యదర్శిగా బషీర్ ఏకగ్రీవంగాఎన్నికయ్యారు. ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో జరిగిన పార్టీ ఉప్పల్ మండల 4వ మహాసభల్లో ఈ ఎన్నికలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిపిఐ పార్టీని ఉప్పల్ మండలంలో బలోపేతం చేసేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ఎజెండాగా ముందుకు సాగుతామన్నారు.కేంద్ర, రాష్ట్ర పాలకవర్గాలు ప్రజల జీవన ప రి స్థితులు మెరుగుపరచేందుకు నిబద్ధతతో పని చేయటం లేదన్నారు. ఈ మహాసభలో 35 మందిని కౌన్సిల్ సభ్యులుగా, 17 మందిని కార్యవర్గ స భ్యులుగా ఎన్నుకొన్నారు. కార్యవర్గ సభ్యులుగా జి.దామోదర్‌రెడ్డి,పి.రామ్‌నారాయణ, నారా నర్సింహ, కల్లూరు ధర్మేంద్ర,నర్సింగరావు, భిక్షపతి, జాన్, స్వామిదాస్, శ్రీనివాస్, ఎండి అక్బర్, కృపాకర్, శోభ,విజయ, జంగారెడ్డి, గిరిబాబులు ఎన్నికైన వారిలో ఉన్నారు.

## సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శణీయం

కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో ఉచిత వైద్య శిబిరం ప్రారంభోత్సవ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్‌కెపూడి గాంధీ



**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి/శేరిలింగంపల్లి:** హైదరాబాద్ కొండాపూర్‌లో చంద్రరాజేశ్వర్ (సిఆర్) ఫౌండేషన్ చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఆదర్శనీయం, అభినందనీయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆర్‌కెపూడి గాంధీ కొనియాడారు. వైద్యులు, నిర్వాహకుల నిస్వార్థ సేవను ప్రశంసించారు. ఆదివారం కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో చంద్ర రాజేశ్వరరావు పాలీక్లినిక్, రోటరీ ప్రోలిఫిక్స్ డయాగ్నస్టిక్ సెంటర్, జయంతి హాస్పిటల్స్ అండ్ రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ సంయుక్తంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలను సిఆర్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, జనరల్ సెక్రటరీ,మాజీ ఎంఎల్‌ఏ పల్లా వెంకట్ రెడ్డి, కార్యదర్శి మాజీ ఎంఎల్‌సి పిజె చంద్రశేఖర్ రావులతో కలిసి స్థానిక ఎంఎల్‌ఏ ఆర్‌కెపూడి గాంధీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ శిబిరం సమీప కాలనీలకు చెందిన సుమారు 300 మందికి పైగా నిరుపేదలతో పాటు వృద్ధాశ్రమ వాసులకు ఉచిత రోగనిర్ధారణ పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో వివిధ వ్యాధుల పట్ల నిష్ణాతులైన వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి తగిన వైద్య సలహాలు, మందులను అందించడం జరిగింది. ఈ శిబిరాన్ని ప్రారంభించిన స్థానిక ఎమ్మెల్యే ఆర్‌కెపూడి గాంధీ వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్ సామాజిక సేవలను కొనియాడారు. వైద్యులు, నిర్వాహకుల నిస్వార్థ సేవను ప్రశంసించారు. పేదలకు ఆరోగ్య సంరక్షణ అందించడంలో ఇటువంటి చొరవల ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. వైద్య నిపుణుల అంకితభావం, కరుణను గుర్తించారు. సమాజంలో చురుకుగా ఉండాలని చెప్పారు. జీవనశైలి సంబంధిత వ్యాధుల పెరుగుతున్న ప్రాబల్యాన్ని ఎత్తిచూపుతూ, అవగాహన, నివారణ చర్యల అవసరాన్ని ఆయన నొక్కి చెప్పారు. ఈ శిబిరంలో బిపి, షుగర్ పరీక్షలు, హిమోగ్లోబిన్ (హెచ్‌హెచ్), లిపిడ్ ప్రొఫైల్, మూత్రపిండ పనితీరు పరీక్షలు, పల్మనరీ ఫంక్షన్ పరీక్షలు వంటి ఉచిత రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు రోగులు జనరల్ మెడిసిన్, గైనకాలజీ, దంత సంరక్షణ, ఆర్థోపెడిక్స్, కార్డియాలజీ, ఆప్తాల్మాలజీ, ఇఎన్‌టి, కంటి సంరక్షణ, గ్యాస్ట్రోఎంటరాలజీ, హోమియోపతి నిపుణులు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఆర్ పాలీక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రజని, సలహాదారులలు,(ఐఎఫ్ సిఎఐ చైర్మన్) డాక్టర్ బి.రంగారెడ్డి, సిఒఒ విజయ లక్ష్మి, రోటరీ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మావెరిక్స్ అధ్యక్షులు డాక్టర్ టి.సురేష్ బాబు, డాక్టర్ శరత్ చంద్ర (కార్డియాలజిస్ట్,జయంతి హాస్పిటల్స్), సిఆర్ ఫౌండేషన్ ఉపాధ్యక్షులు కంభంపాటి అజయ్, హోమ్ ఫర్ ఏజ్డ్, ఎన్ ఆర్ ఆర్ రీసెర్చ్ సెంటర్, మహిళా సేవా కేంద్రం సభ్యులు కనెక్ట్ డయాగ్నోస్టిక్స్, మా ఇఎన్‌టి హాస్పిటల్స్, హీలియోస్ నుండి వాలంటీర్లు సహా అనేక మంది ప్రముఖ వ్యక్తులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాంధీ, డాక్టర్ శరత్ చంద్ర, మియాపూర్ కార్పొరేటర్‌లను డాక్టర్ కె.నారాయణ సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని సిఆర్ ఫౌండేషన్ ట్రెజరర్‌అండ్ హోమ్ ఫర్ ఏజ్డ్ డైరెక్టర్ వి చెన్నకేశవ రావు సమన్వయం చేశారు.శిబిరాన్ని విజయవంతం చేయడంలో అంకితభావంతో కృషి చేసిన వైద్యులు డాక్టర్ భరత్, డాక్టర్ అజయ్, డాక్టర్.కేజియా, డాక్టర్. రామారావు, వాలంటీర్లు అండ్ సహాయక సంస్థలకు నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.

## కాలనీల సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/చర్లపల్లి :** కాలనీల సమస్యలు పరిష్కరించాలని జైళ్ల శాఖ డైరెక్టర్ జనరల్ సౌమ్య మిశ్రాను ఉప్పల్ ఎంఎల్ఏ బండారి లక్ష్మారెడ్డి కోరారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని రెడ్డి కాలనీ, భగవాన్ కాలనీ, కృష్ణ నగర్ కాలనీ, ఎంఆర్ఆర్ కాలనీలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ వర్షం నీరు బయటికి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని సమస్యను పరిష్కరించాలని ఆదివారం చర్లపల్లి జైలు వద్ద సౌమ్య మిశ్రాను కలసి కోరారు. దీనికి స్పందించిన డిజి సమస్యను సమీక్షించి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవలే సమస్యను పరిష్కరించాలని సచివాలయంలో హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తాను కలిసారు.ఈ కార్యక్రమంలో నాయకులు,కాలనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సృష్టిలో అమ్మకు మించిన అద్భుతం లేదు



**ప్రజాపక్షం/అల్వాల్ :** శ్రీ శంకర శశాంక్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మదర్స్ డే వేడుకలు మచ్చ బొల్లారం డివిజన్ హనుమాన్ దేవాలయం దగ్గర మదర్స్ డే ఉత్సవాలు ఘనంగా నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి ట్రస్ట్ చైర్మన్ రజిని హాజరై మాట్లాడుతూ, అమ్మకు కృతజ్ఞత చూపిస్తూ మనం ఎంత చేసిన తక్కువే వెలకట్టలేనంత ప్రేమ హద్దులేనంత అనురాగం చూపించడంలో అమ్మకు సరిసాటి లేరెవ్వరు. కానీ మాతృ దినోత్సవం అంటే తల్లి చేసే పనులకు హృదయపూర్వకంగా కృతజ్ఞత తెలియజేస్తూ, అనంతరం చీరలు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకు డోలి రమేష్, శోభన్ బాబు, రాజు, డాక్టర్ శ్రీనివాస్, జనార్ధన్, ప్రవీణ్, బాలకృష్ణ, స్వరూప, రాణి, రమ్యశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

## వెంకటేశ్వర మహిళా మండలి 60వ వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/అల్వాల్ :** వెంకటేశ్వర మహిళా మండలి 60 వార్షికోత్సవం సందర్భంగా మాతృ వందనం కార్యక్రమం నవకల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ వంశీ రమరాజు రిటైర్డ్ సుప్రీం కోర్టు అడ్వకేట్ మాల్యాద్రి హాజరై మాట్లాడుతూ, 60 ఏళ్లుగా ఎన్నో అభివృద్ధి పనులు సామాజిక సేవలో పాల్గొని కరోనా టైములో పేదలందరికీ నిత్యావసర వస్తువులు వివిధ సేవా కార్యక్రమాలు ఏర్పాటు చేసిన మా సభ్యులందరికీ ఎనలేని సేవలు అందించేందుకు ముందుకొచ్చిన మహిళలకు ఉపాధి కల్పించి ఆదుకున్నామని సభ్యులందరికీ ప్రశంసించి శాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహిళా మండలి అధ్యక్షురాలుగా విజయలక్ష్మి, జనరల్ సెక్రెటరీ కామేశ్వరి, శకుంతల నాయుడు రమాదేవి, సరోజన, కుసుమ గాంధీ, ప్రసన్న, మహిళా మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే చిత్రపటానికి కార్పొరేటర్ నివాళి



**ప్రజాపక్షం/అల్వాల్ :** మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే ఆరో వర్ధంతి సందర్భంగా ఆయన నివాసంలో చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అల్వాల్ డివిజన్ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ మల్కాజ్గిరి నియోజకవర్గ ప్రజల కోసం అనేక సమస్యలు తీర్చిన మహా వ్యక్తి కనకారెడ్డి పేదల కోసం నేనున్నానని ఆపదలో ఆదుకున్న మహానుభావుడు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు రాపర్తి చంద్రశేఖర్, యాదగిరి గౌడ్, శరన్ గిరి, ప్రేమ్ కుమార్, శోభన్ బాబు, సాజిద్, సతీష్, లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

## నారసింహుడి సేవలో నిరంతరం తరించాలి

బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నారసింహుడి సేవలో ప్రజలంతా నిరంతరం ఉండాలని రాష్ట్ర శాసనసభ బిఆర్ఎస్ పార్టీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలోని నల్లగుట్ట లక్ష్మీ నరసింహా స్వామి దేవాలయం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు స్థానిక ఎమ్మెల్యే కెపి వివేకానంద విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ నరసింహా స్వామి ఆశీస్సులు ప్రజలందరి పై ఉండాలని, ఆ భగవంతుని కృపా కటాక్షాలతో ప్రతిఒక్కరు సుభిక్షంగా జీవించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్, వేణు యాదవ్, విజయ రాంరెడ్డి, శ్రీకాంత్, బాల్ రాజ్, కమలాకర్, వెంకటేష్, చిన్నా చౌదరి, శివ నాయక్, ప్రసాద్, ఇంద్రసేనా గుప్త పాల్గొన్నారు.



## హాసిష్ ఆయిల్... గంజాయి పట్టివేత..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ ఖానవాజ్ ఖాసీం ఇచ్చిన పిలుపు మేరకు ఎక్సైజ్ ఎస్‌టిఎఫ్ టీం కుత్బుల్లాపూర్, దూల్‌పేట్ ప్రాంతాల్లో ఆదివారం దాడులు నిర్వహించి రూ.3 లక్షల విలువైన 300 గ్రాముల హాసిష్ (డ్రగ్స్), 1.212 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ టి ఎఫ్ ఏ టీం లీడర్ అంజిరెడ్డి తెలిపారు. ఈ కేసులో మహాదేవపురం కాలనీ గాజుల రామారావు చెందినటువంటి సుభాష్ ను, మేడ్చల్ మల్కాజిగిరి రామచంద్ర రాజును అరెస్ట్ చేశారు. రాజు అనే వ్యక్తి పరారీ లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. దూల్‌పేట్‌లో పట్టుబడిన గంజాయి కేసులో అర్జున్ సింగ్ ను అరెస్ట్ చేశారు. సంజు అనే వ్యక్తి పరారీ లో ఉన్నట్టు అంజిరెడ్డి తెలిపారు.



## బాధ్యతాయుతమైన పౌరులుగా ఖైదీలు

శిక్ష పూర్తయ్యేలోపు తీర్చి దిద్దేందుకు కృషి

'ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీల వేడుకల్లో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** శిక్ష పూర్తయ్యేలోపు ఖైదీల్లో మార్పు తీసుకొచ్చి వారిని బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చి దిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఆదివారం జైళ్ల శాఖ ఆధ్వర్యంలో చర్లపల్లి సెంట్రల్ జైల్లో నిర్వహించిన 'ఖైదీల వార్షిక క్రీడలు, సాంస్కృతిక పోటీలు 2025 ముగింపు వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై... విజేతలకు బహుమతులు అందజేశారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ జైళ్ల శాఖ అమలు చేస్తున్న సంస్కరణలు ఇతర రాష్ట్రాలకు మార్గదర్శకంగా నిలిచాయని ఈ సందర్భంగా మంత్రి వివరించారు. తెలిసో తెలియకో చేసిన తప్పులకు శిక్షను అనుభవిస్తున్న ఖైదీల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించేందుకు అనేక చేతి వృత్తులు, ఇతర పనుల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నామన్నారు. ఖైదీలు మానసిక ఒత్తిడికి గురి కాకుండా నిపుణులతో ప్రత్యేకంగా కౌన్సెలింగ్ ఇప్పిస్తున్నామన్నారు. ఖైదీలు తయారు చేసే ఉత్పత్తులకు మంచి డిమాండ్ ఉందని, ఆ దిశగా వారిని మరింత ప్రోత్సహిస్తామన్నారు. జైలుకు కావాలని ఎవరూ రారని, బయటకు వెళ్లిన తర్వాత మరోసారి అలాంటి తప్పు చేయకుండా గౌరవంగా జీవించాలని ఖైదీలకు సూచించారు. సత్ప్రవర్తనతో మెలిగే ఖైదీలకు ప్రభుత్వం తరఫున వీలైనంత వరకు అండగా ఉంటామన్నారు. శిక్ష అనుభవించే సమయంలో ఆందోళనకు గురి కావొద్దని, అలాగే కాలాన్ని వృథా చేయకుండా ఆసక్తి ఉన్న రంగంలో శిక్షణ పొందాలని సూచించారు. ఒకవేళ ఉన్నత విద్యను అభ్యసించాలనుకుంటే నిబంధనల ప్రకారం జైళ్ల శాఖ తరఫున సహకరిస్త మన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి మహేందర్ రెడ్డి, జైళ్ల శాఖ డిజి సౌమ్యా మిశ్రా, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## దుండిగల్‌లో కాళీ జాగాకు, ఫ్రీ కాస్ట్ వాల్‌కు ఇంటి నంబర్ల కేటాయింపు





**ప్రజాపక్షం/దుండిగల్ :** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని కాళీ జాగలకు, ఎఫ్‌టిఎల్ స్థలాలకు, ఇల్లు లేకున్నా ఇంటి నంబర్లు కేటాయిస్తూ మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేతివాటం ప్రదర్శించిన ఘటన బట్టబయలు అయింది. బిఆర్ఎస్ ప్రభుత్వంలో హయాంలో పట్టా భూములను చూపిస్తూ ప్రభుత్వ భూములకు ఇంటి నంబర్లు కేటాయించగా, ఎఫ్‌టిఎల్ స్థలాల్లో ఖాళీ జాగలకు అస్సెస్మెంట్ చేసి ఇంటి నంబర్లు కేటాయించడం మున్సిపాలిటీలో సంచలనంగా మారింది. అధికారుల పనితీరుపై పలు విమర్శలకు తావిస్తుంది. ప్రభుత్వ భూములకు, ఎఫ్‌టిఎల్ లోని కాళీ జాగకు ఇంటి నంబర్లు కేటాయింపులో దొమ్మర పోచంపల్లికి వార్డుకు చెందిన ప్రజాప్రతినిధి చక్రం తిప్పగా అదే వార్డుకు చెందిన ఓ బిల్ కలెక్టర్ ఈ తతంగమంతా తానే నడిపించినట్లు సహకరించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు తెలియకుండా ఇంతగా తతంగా జరిగే అవకాశమే ఉండదు. అధికారులు, సిబ్బంది కుమ్మక్కై అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై మున్సిపల్ అధికారులను వివరణ కోరగా డియాక్టివేషన్ చేస్తాము అంటూ బుకయిస్తున్నారు. దొమ్మరపోచంపల్లిలోని లేక్ ఐడి 2831 ఈర్లకుంట విస్తీర్ణం 6.682 ఎకరాలు దొమ్మరపోచంపల్లికి చెందిన ప్రజా ప్రతినిధి కుంట ఎఫ్‌టిఎల్‌ను ఆక్రమించి గ్రామ గ్రామపంచాయతీ అనుమతితో 5 ఎకరాల్లో వెంచర్ వేయగా అప్పట్లో పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తాయి. ఎఫ్‌టిఎల్ లో ఏర్పాటు చేసిన ఫ్రీ కాస్ట్ పలకలకు ఇటీవల అస్సెస్మెంట్ చేసి ఇంటి నంబర్లు బిల్ కలెక్టర్ కేటాయించడం విమర్శలకు తావిస్తుంది. ఇదంతా ఒక బిల్ కలెక్టర్ చేశాడు అంటే అలా కుదరదు కమిషనర్ సంతకం లేనిదే ఇంటి నంబర్లు జారీ అయ్యే ప్రసక్తే లేదు. ఒక ఇంటి నెంబర్ మున్సిపాలిటీలో కావాలంటే లింకు డాక్యుమెంట్లో, ఇంటి ఫోటో, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ అయి ఉండాలి అట్టి దరఖాస్తులను మున్సిపల్ రెవెన్యూ మేనేజర్, బిల్ కలెక్టర్ వెళ్లి సైటును సందర్శించిన తర్వాతే ఆన్లైన్ ద్వారా మున్సిపల్ చట్ట ప్రకారం కమిషనర్ సంతకంతో జారి చేయడం జరుగుతుంది. ఇన్ని నిబంధనలో ఉన్న చట్టాన్ని తన చుట్టంగా మార్చుకొని అక్రమార్కులు ఇచ్చే చిల్లర డబ్బులకు లాలూచీపడి దుండిగల్ మున్సిపల్ అధికారులు మున్సిపల్ చట్టాన్ని చెత్తబుట్టలో వేసి తమ ఇష్టానుసారంగా ప్రి క్యాస్ట్ వాల్‌కు, ఎఫ్‌టిఎల్ స్థలాలకు ఇంటి నెంబర్లు కేటాయించి మున్సిపల్ చట్టం పరువు తీస్తున్నారు. దొమ్మరపోచంపల్లిలోని పట్టభూమి సర్వే నంబర్ 158లో మరో ఘటన వెలుగులోకి వచ్చింది. కొందరు వ్యక్తులు పక్కనే ఉన్న ప్రభుత్వ భూమి సర్వే నంబర్ 156 ని కలుపుకొని సుమారు 20 ఎకరాల్లో వెంచర్ వేశారు. లింక్ డాక్యునెంట్స్‌లో రెండు సర్వే నంబర్లు ఉండడంతో సర్వే నంబర్ 158లో ఇంటి నంబర్లు పొందుతున్న నిర్మాణదారులు సర్వే నంబర్ 156 ప్రభుత్వ భూమిలో నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇంటి నంబర్ ఆధారంగా మేడ్చల్ ఎస్ఆర్ఓ ఆఫీస్ లో ప్రభుత్వ భూమికి రిజిస్ట్రేషన్స్ పొందుతుండడం తో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వై.రామలింగేశ్వర రావు అనే వ్యక్తికి 491/217,491/219, 491/220, 491/221 ఇంటి నంబర్లు కేటాయించడంతో మున్సిపల్ అధికారుల అవినీతి బట్టబయలయింది. అధికారుల ఫీల్డ్ విజిట్ చేయకుండానే సర్వేనెంబర్ ఓచోట ఉండగా, మరోచోట ఉన్న ఇంటి కి నెంబర్‌ను ఇచ్చారు. అవినీతి బయటపడటంతో అధికారులను వివరణ కోరగా ఎలా ఇచ్చామో అలాగే ఆన్‌లైన్‌లో డీయాక్టివేషన్ చేస్తున్నామంటూ బొంకుతున్నారు. రెండు సంవత్సరాల క్రితం కొన్ని ఇంటి నంబర్లను డియాక్టివేషన్ చేసిన అధికారులు కాసులకు కక్కుర్తిపడి తిరిగి అదే నంబర్లను ఆక్టివేట్ చేయడం అధికారులు, సిబ్బంది అవినీతి సంపాదనకు అద్దం పడుతుంది. ఈ దారుణాలపై ప్రభుత్వం, జిల్లా కలెక్టర్, మున్సిపల్ ఉన్నతాధికారులు, విచారణ జరిపి, చట్టపరమైన చర్యలు తీసుకుంటే, మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉంటాయని సామాన్య ప్రజలు కోరుతున్నారు.

## బిఆర్ఎస్‌ను బలోపేతం చేయాలి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** నియోజకవర్గంలో అన్ని డివిజన్‌లలో బిఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలందరూ అంకితభావంతో సమిష్టి కృషి చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి అన్నారు. వినాయకనగర్ డివిజన్‌లోని నాగలక్ష్మి ఫంక్షన్ హాలులో ఆదివారం జరిగిన పార్టీ సమావేశంలో వినాయకనగర్, మౌలాలి, నేరేడ్‌మెట్ డివిజన్‌లకు చెందిన పలువురు యువకులు ఎమ్మెల్యే సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు.. నిత్యం ప్రజల్లో సంచరిస్తూ వారి సమస్యలను తెల్సుకొని తన దృష్టికి తెస్తే తాను పరిష్కార దిశగా కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన కార్యకర్తలకు సూచించారు. ఎంబిసి మాజీ చైర్మన్ నందికంటి శ్రీధర్, పార్టీ శ్రేణులు పరశురాం రెడ్డి, రావుల అంజయ్య, వెంకన్న, తులసి, రాముయాదవ్, అమీనుద్దీన్, హేమంత్‌రెడ్డి, బాలకృష్ణ, ప్రభాకర్, మురళి నాయుడు, అరుణ్‌కుమార్, రేవంత్ రెడ్డి, ప్రశాంతరెడ్డి, లక్ష్మి , సోనూ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## జవాన్ మురళీ నాయక్ శ్రద్ధాంజలి



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ వీర మరణం పొందిన ఇండియన్ ఆర్మీ జవాన్ మురళీ నాయక్ కు మాజీ ఎమ్మెల్యే అనంద్ నివాసంలో శ్రద్ధాంజలి ఘటించిరు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు గోపాల్ , గాయజ్ , సుభాన్‌రెడ్డి , అశోక్ , అనిల్ తదితరులు పాల్గోన్నారు.

## ఘనంగా నరసింహా స్వామి ఉత్సవాలు



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** నరసింహ స్వామి జయంతి ఉత్సవం సందర్భంగా ఆదివారం జిల్లాలోని పలు ప్రాంతాల్లోని లక్ష్మి నరసింహ స్వామి దేవాలయాల్లో భక్తుల కోలాహలంతో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. కీసర మండలంలోని చీర్యాలలోని అతి పురాతన లక్ష్మి నరసింహస్వామిని దర్శించుకొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో సమీప ప్రాంతాల నుండి తరలివచ్చారు. ఆలయ మండపాల్లో సత్యనారాయణ వ్రతాలు చేపట్టారు. జయంతుత్సవాల్లో ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేశారు. దేవస్థానం వారు భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం ఆల్విన్ కాలనీ తులసినగర్‌లోని లక్ష్మి నరసింహ స్వామి ఉత్సవాల్లో భాగంగా స్వామి వారికి కల్యాణం నిర్వహించారు.మల్కాజిగిరిలో... గౌతంనగర్ డివిజన్‌లోని జయగిరి లక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో అంగరంగంగా జరిగిన జయంతి ఉత్సవాల్లో ప్రత్యేక హోమాలు, పూజలతో స్వామి వారి కళ్యాణ వేడుకల్లో మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి, గౌతంనగర్ కార్పొరేటర్ మేకల సునిత రాము యాదవ్, తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ సభ్యులు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు 'హోప్ ఆఫ్ హంగర్' సంస్థ నిరంతర సేవలు

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్




**ప్రజాపక్షం/నిజాంపేట్:** హోప్ ఆఫ్ హంగర్ సంస్థ నిరంతరం పేదలకు సేవలందించాలని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని గాజులరామారంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో హోప్ ఆఫ్ హంగర్ ఆధ్వర్యంలో కందుకూరి రేఖకు తోపుడు బండి, వికలాంగుడైన బాల్‌రెడ్డికి వీల్ చైర్‌ని కూన చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ సమాజ సేవ చేయడం అందరికి రాదని, భగవంతుడు కొంతమందికి మాత్రమే సేవ చేసే అవకాశాన్ని ఇస్తారని అన్నారు. మానవతా దృక్పదంతో ఇలాంటి సేవా కార్యక్రమాలను హోప్ ఆఫ్ హంగర్ సంస్థ నిరంతరం చేయాలని సూచించారు. నిరుపేద విద్యార్థులకు, వృద్ధులకు, వికలాంగులకు, దివ్యాంగులకు హోప్ ఆఫ్ హంగర్ సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి సేవా కార్యక్రమాలు చేస్తూ నిరుపేద ప్రజలకు అండగా నిలవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హోప్ ఆఫ్ హంగర్ సంస్థ వ్యవస్థాపకురాలు అలేఖ్య, సభ్యులు రవికుమార్, వెంకటేశ్వర్ రావు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

### బహద్దూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ వాసుల సమస్యలను పరిష్కరిస్తా...

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని దుందిగల్ మండల పరిధిలోని బహద్దూర్ పల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను సత్వరమే పరిష్కరించే విధంగా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ నేత కూన శ్రీశైలం గౌడ్ అన్నారు. గాజులరామారంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బహద్దూర్ పల్లి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయం వాసులు కూనని కలిసి సమస్యలను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో నెలకొన్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకువెళ్లి తక్షణమే పరిష్కరించేలా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.

# ఫోకస్ ఆరోగ్యం

## భయపెడుతున్న రాబిస్



కేరళలో టీకాలు వేసినప్పటికీ, ముగ్గురు పిల్లలు రాబిస్ వ్యాధి సోకి మృతి చెందడం ఆందోళన కలిగిస్తున్నది. సరైన మోతాదులో టీకాలు వేసినప్పటికీ, ఈ ఘోరం చోటు చేసుకోవడంతో, కారణాలను కనిపెట్టడంలో వైద్యులు నిమగ్నమయ్యారు. కుక్కలు కరవడంతో, బాధితుల తల, చేతులకు లోతైన గాయాలు అయినట్లు తెలుస్తోంది. దట్టమైన నరాల నెట్‌వర్క్‌లు ఉన్న ప్రాంతాల్లో గాయాలు కావడంతో, రాబిస్ వైరస్ నాడీ వ్యవస్థలోకి వేగంగా ప్రవేశించిందని వైద్య నిపుణులు నిర్ధారించారు. రాబిస్ వైరస్ నరాల ద్వారా కేంద్ర నాడీ వ్యవస్థకు సోకుతుంది. సున్నితమైన ప్రాంతాలలో కుక్క కాటు టీకాల ప్రభావం తగ్గుతుందని అభిప్రాయపడుతున్నారు. అదే విధంగా ఏదైనా జంతువు కరచిన లేదా పాము కాటు వేసిన వెంటనే గాయాలను సబ్బుతో కడగాలి. కనీసం నీటితోనైనా శుభ్రపరచాలి. ఇలాంటి చర్యలు వైరస్ వ్యాప్తి ప్రమాదాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. కానీ, కేరళలో చోటు చేసుకున్న ఘటనల్లో ఎక్కడా బాధితుల గాయాలను శుభ్రపరచిన దాఖలాలు లేవు. దీనితో రాబిస్ వైరస్ వేగంగా వ్యాపించింది. రాబిస్ అనేది మానవులతో సహా క్షీరదాల కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేసే ప్రాణాంతకమైన జూనోటిక్ వైరల్ వ్యాధి. రాబిస్ సోకకుండా జాగ్రత్త పడడమే మంచిది. ఒకసారి లక్షణాలు కనిపించిన తర్వాత, ప్రాణాలు కాపాడే అవకాశాలు దాదాపు ఉండవు. అయితే,లక్షణాలు కనిపించకముందే సకాలంలో వైద్య సంరక్షణ అందిస్తే రేబిస్‌ను 100 శాతం నివారించవచ్చు. ఈ వైరస్ సోకిన జంతువుల (కుక్కలు, గబ్బిలాలు, రకూన్లు, నక్కలు) లాలాజలంలో ఉంటుంది. కాటు, గీతలు లేదా తెరిచిన గాయాలు లేదా శ్లేష్మ పొరలను నొక్కడం ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశిస్తుంది. ఈ వైరస్ నరాల ద్వారా మెదడుకు చేరుకుంటుంది, మెదడు వాపును (ఎన్సెఫాలిటిస్) ప్రేరేపిస్తుంది, తీవ్రమైన నాడీ సంబంధిత సమస్యలకు దారితీస్తుంది. మరణానికి కారణమవుతుంది. ప్రపంచ వ్యాప్తంగా రేబిస్ మరణాలలోభారతదేశం వాటా 36 శాతంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, యాంటీ రాబిస్ టీకాలు వేసినప్పటికీ ముగ్గురు మృతి చెందడం ఈ వ్యాధి మరింత శక్తిని పొంది, విజృంభించే ప్రమాదం ఉందనే అనుమానాలకు కారణమవుతున్నది.


## హెన్యోలో జన్యుపరమైన అనుసరణలు



దక్షిణ కొరియాలోని జెజు ద్వీపానికి చెందిన మహిళా డైవర్ల బృందాన్ని హేన్యోగా వ్యవహరిస్తారు. వారి ప్రత్యేకమైన డైవింగ్ పద్ధతులకు సంబంధించిన జన్యుపరమైన అనుసరణలు మరియు శారీరక మార్పులు రెండింటినీ ప్రదర్శిస్తున్నట్లు శాస్త్రవేత్తలు ఇటీవల గుర్తించారు. దీర్ఘకాలిక డైవింగ్ అభ్యాసంతోపాటు సహజ ఎంపిక బ్రాడీకార్డియా (హృదయ స్పందన రేటు మందగించడం), రక్తపోటు నియంత్రణ, చలిని తట్టుకోవడం వంటి లక్షణాలు వారిలో ఉన్నట్టు నిర్ధారించారు. హేన్యో బృందం సభ్యులు ఆక్సిజన్ మాస్క్‌లు ఉపయోగించకుండా, అబలోన్, సముద్రపు అర్చిన్‌ల వంటి షెల్ఫిష్‌లను పట్టుకోవడానికి 10 మీటర్ల వరకు నీటి అడుగున డైవ్ చేస్తారు. వారి సంస్కృతిని 2016 నుండి యునెస్కో అగోచర సాంస్కృతిక వారసత్వంలో భాగంగా గుర్తించింది. కాగా జెజు ద్వీపం దక్షిణ కొరియాలోని ఒక అగ్నిపర్వత ద్వీపం (బసాల్ట్ మరియు లావాతో తయారు చేయబడింది), దేశంలోని ఎత్తైన పర్వతం హల్లాసన్ (నిద్రాణమైన అగ్నిపర్వతం, 1,950 మీటర్లు)కు నిలయం. జెజు అగ్నిపర్వత ద్వీపం, లావా ట్యూబ్‌లు యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశం, ఇవి ప్రత్యేకమైన భూగర్భ శాస్త్రం, ప్రధాన అగ్నిపర్వతం చుట్టూ 360 అనుబంధ అగ్నిపర్వతాలకు ప్రసిద్ధి చెందాయి.




## ప్రపంచాన్ని వణికిస్తున్న మలేరియా



ఎన్నో తరుణ వ్యాధులను సమర్థంగా అడ్డుకోగలిగినప్పటికీ, మలేరియా మాత్రం దశాబ్దాలుగా ప్రపంచ దేశాలను వణిస్తునే ఉంది. మలేరియా బారిన పడని మనిషి లేనడం అతిశయోక్తి కాదు. మలేరియా అనేది ప్లాస్మోడియం పరాన్నజీవి వల్ల కలిగే ప్రాణాంతక వ్యాధి. ఇది సోకిన ఆడ అనాఫిలిస్ దోమలు కుట్టడం ద్వారా మానుషులకు వ్యాపిస్తుంది. ఇది ఉపసహారా ఆఫ్రికా, ఆగ్నేయాసియా, దక్షిణ అమెరికా వంటి ప్రపంచంలోని ఉష్ణమండల, ఉపఉష్ణమండల ప్రాంతాలలో సాధారణం. మానవులలో మలేరియాకు కారణమయ్యే 5 ప్లాస్మోడియం జాతులు ఉన్నాయి. వీటిలో పి. ఫాల్సిపరం అత్యంత ప్రాణాంతకమైనది కాగా , పి. వైవాక్స్ అత్యంత విస్తృతంగా వ్యాపించింది. ఇతర జాతులు పి. మలేరియా , పి. ఓవలే, పి. నోలేసి. మలేరియా పరాన్నజీవులు సోకిన వ్యక్తిని కుట్టిన తర్వాత దోమకు సోకుతుంది. ఆ తర్వాత దోమ కుట్టిన తదుపరి వ్యక్తి రక్తప్రవాహంలోకి మలేరియా పరాన్నజీవులు ప్రవేశిస్తాయి. పరాన్నజీవులు కాలేయానికి ప్రయాణించి, పరిణితి చెంది, ఆపై ఎర్ర రక్త కణాలకు సోకుతాయి. మలేరియా సోకినప్పుడు జ్వరం, చలి, తలనొప్పి, అలసట వంటి లక్షణాలు ఉంటాయి. తీవ్రమైన కేసులు అవయవ వైఫల్యం లేదా మరణానికి దారితీయవచ్చు.

అయితే, సరైన వైద్యంతో మలేరియాను నయం చేయవచ్చు. ప్రపంచ మలేరియా నివేదిక 2024 ప్రకారం, భారతదేశంలో, 2015, 2023 మధ్య, మలేరియా కేసులు 11.69 లక్షల నుండి 2.27 లక్షలకు, అదే విధంగా మరణాలు 384 నుండి 83కి తగ్గాయి. ఇది రెండు సూచికలలో 80 శాతం క్షీణతను సూచిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్ఒ) ప్రకటించిన 'హై బర్డెన్ టు హై ఇంపాక్ట్' (హెచ్‌బిహెచ్ఐ) జాబితా నుంచి భారత్‌కు 2024లో విముక్తి లభించింది. ఇది మలేరియా నిర్మూలనలో ఒక ప్రధాన మైలురాయి. అయితే ఇప్పటికీ మలేరియా కేసులు నమోదవుతునే ఉన్నాయి. 2030 నాటికి మలేరియా రహిత స్థితిని సాధించడమే లక్ష్యంగా ఎంచుకున్నారు. కాగా, ప్రపంచవ్యాప్తంగా, మలేరియా ఒక ప్రధాన ఆరోగ్య సవాలుగా మిగిలిపోయింది. ఇది 263 మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్నది. ఏటా 600,000 మందికి పైగా మరణాలకు కారణమవుతున్నది. ప్రపంచ వ్యాప్తంగా నమోదవుతున్న మలేరియా కేసుల్లో 94 నుంచి 95 కేసులు కేవలం ఆఫ్రికా ఖండంలోని దేశాల నుంచే ఉండడం ఆందోళన కలిగిస్తున్న విషయం. క్లోరోక్విన్, ఆర్టెమిసినిన్ వంటి ప్రభావవంతమైన మందులతో మలేరియాను నయం చేయవచ్చు. దోమల నివారణకు కూడా పలు మార్గాలు ఇప్పుడు అందుబాటులోకి వచ్చాయి. డబ్ల్యుహెచ్ఒ ఆమోదించిన ఆర్‌టిఎస్, ఎస్/ఎఎస్01 (మాస్క్విరిక్స్) టీకా, 5 నెలల కంటే ఎక్కువ వయస్సు ఉన్న పిల్లలకు మొదటి మలేరియా వ్యాక్సిన్. ఆర్21/మాట్రిక్స్ఎంను సురక్షితమైన, ప్రభావవంతమైన రెండవ వ్యాక్సిన్‌గా ఆమోదించారు. కీమోప్రొఫిలాక్సిస్ విధానంలో, అంటువ్యాధిని నివారించడానికి స్థానిక ప్రాంతాలకు ప్రయాణించే ముందు, ప్రయాణ సమయంలో, తరువాత యాంటీమలేరియల్ మందులను తీసుకోవడం ఇందులో ఉంటుంది. ప్రివెంటివ్ కీమోథెరపీలో అధికప్రమాదకర కాలాల్లో దుర్బల సమూహాలకు (పిల్లలు, గర్భిణులు) యాంటీమలేరియల్స్ లక్ష్య నిర్వహణ ప్రధానంగా ఉంటుంది. మలేరియా నియంత్రణకు అనుసరించే కీలక వ్యూహాలలో సీజనల్ మలేరియా కెమోప్రెవెన్షన్ (ఎస్ఎంసి), పెరెన్నియల్ మలేరియా కెమోప్రెవెన్షన్ (పిఎంసి), ఇంటర్మిటెంట్ ప్రివెంటివ్ ట్రీట్మెంట్ ఇన్ ప్రెగ్నెన్సీ (ఐపిటిపి), మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (ఎండిఎ) మొదలైనవి ఉన్నాయి. గర్భధారణ సమయంలో , మలేరియా వ్యాప్తి మధ్యస్థం నుండి అధిక స్థాయిలో ఉన్న ప్రాంతాలలో, సంక్రమణను నివారించడానికి, రెండవ త్రైమాసికం నుండి ప్రారంభించి, ప్రతి షెడ్యూల్ చేయబడిన యాంటెనటల్ కేర్ సందర్భనలో సల్ఫాడాక్సిన్‌పైరిమెథమైన్ (ఐపిటిపిఎస్‌పి) తో అడపాదడపా నివారణ చికిత్స సిఫార్సు చేశారు.

## మళ్లీ తెరపైకి నిపా వైరస్!



నిపా వైరస్ విస్తరిస్తున్నదన్న వార్తలు వస్తున్న నేపథ్యంలో, దీనిపై చర్చ మళ్లీ తెరపైకి వచ్చింది. నిపా వైరస్ఒక ప్రమాదకరమైన వైరల్ వ్యాధి. ఇది మనుషులకి, మృగాలలోకి వ్యాపించగలదు. ముఖ్యంగా ఇది గబ్బిళాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్ సోకిన 414 రోజుల్లో లక్షణాలు కనిపించడం ప్రారంభమవుతాయి. తలనొప్పి, జ్వరం, కఫం, గొంతు నొప్పి, అలసట, మూర్ఛ, శ్వాస సంబంధిత సమస్యలు వేధిస్తాయి. మెదడు బొబ్బలిక (Encephalitis) లక్షణాలు విజృంభించినప్పుడు చికిత్స అవసరం అవుతుంది. కొన్నిసార్లు మూర్ఛ వచ్చి, కోమా స్థితికి కూడా దారి తీస్తుంది. గబ్బిళాలు మోసే ఫలాల ద్వారా (దీని మీద పీచుకట్టిన ఫలాలు తినడం ద్వారా), పందులు లేదా ఇతర మృగాల ద్వారా, బాధిత మనిషి నుండి ఇతర వ్యక్తికి (ప్రత్యక్ష సంబంధం, రక్తం, శ్వాస తడిసిన చుక్కల ద్వారా ఈ వైరస్ వ్యాపిస్తుంది. వైరస్ నుంచి మనల్ని మనం కాపాడుకోవడానికి కొన్ని చర్యలు అవసరం. ముందుగా హైజీన్ పాటించాలి. చేతులు తరచూ శుభ్రంగా కడుక్కోవాలి. పండ్లను కూడా శుభ్రపరచుకొని తినాలి. గబ్బిళాలు తిన్న ఫలాలు (జామపండు, మామిడి మొదలైనవి) వాడకపోవడం మంచిది. బాధిత వ్యక్తుల దగ్గర జాగ్రత్తగా ఉండాలి. రోగులను చూసేటప్పుడు మాస్క్‌లు, గ్లోవ్స్ వాడాలి. జంతువుల నుండి దూరంగా ఉండాలి. పందులు లేదా అనారోగ్యంగా ఉన్న జంతువుల దగ్గరకు వెళ్లడం మంచిదికాదు. పూర్తి రక్షణ పరికరాలు (పిపిఇ) వాడాలి. 2024 చివరలో కేరళ రాష్ట్రంలో నిపా వైరస్ కేసులు నమోదయ్యాయి. కానీ, తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో పెద్ద పరిమితిలో వ్యాప్తి ఆగిపోయింది. ఎప్పటికప్పుడు ఆరోగ్య శాఖల నుంచి వచ్చిన సూచనలు అనుసరించడం చాలా ముఖ్యం. ప్రస్తుతం నిపా వైరస్‌కు ప్రత్యేకమైన వ్యాక్సిన్ లేదా ప్రత్యక్ష చికిత్స లేదు. లక్షణాల ప్రాతిపదికన చికిత్స చేస్తారు. ఉదాహరణకి: శ్వాసకోశ సమస్యలు, అలసట తగ్గించేందుకు మందులు వాడతారు. అవసరమైతే ఐసియులో చేర్చి, ఆక్సిజన్ పెట్టి చికిత్స కొనసాగిస్తారు.

**ఈ శీర్షికన ఇచ్చిన సమాచారం కేవలం పాఠకుల అవగాహన కోసం మాత్రమే. ఆరోగ్య సమస్యలకు వైద్యులను సంప్రదించడం తప్పనిసరి**

# 4వ తరగతి ఉద్యోగులుగా హమాలీ కార్మికులు

### రాష్ట్ర సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు డిమాండ్



**ప్రజాపక్షం/వరంగల్ ప్రతినిధి :** హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాల్‌రాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర సివిల్ సప్లయి హమాలీ వర్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా మూడవ మహాసభలు ఏనుమాముల మార్కెట్ ఎంఎల్ఎస్ పాయింట్ వద్ద ఆదివారం ప్రారంభమయ్యాయి. మహాసభలను ప్రారంభించి అనంతరం బాల్‌రాజు మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ గోదాములలో పనిచేస్తున్న హమాలీ కార్మికులను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి, పిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని, పని చేసే వయో పరిమితి 57 సంవత్సరాలను నుండి 61 సంవత్సరాలకు పెంచాలని, నెలకు కనీస వేతనం 26వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సివిల్ సప్లయిస్ మండల పాయింట్ల వద్ద సొంత గోదాములు నిర్మించాలన్నారు. కార్మికుల రిటైర్‌మెంట్ సమయంలో రూ.10 లక్షలు రిటైర్డ్ బెనిఫిట్ ఇవ్వాలని, కార్మికులకు ప్రమాదాలు జరిగిన మరణించిన అంగవైకల్యం చెందిన రూ.10లక్షలు పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. సివిల్ సప్లయిస్ హమాలీ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎఐటియుసి ఆధ్వర్యంలో 1980 సంవత్సరంలో కార్మికులను రాష్ట్ర వ్యాప్తంగా సంఘటిత పరిచి సంఘాన్ని ఏర్పాటు చేసి అనేక సమరశీల పోరాటాలు నిర్వహించి, ప్రస్తుతం అమలు చేస్తున్న హక్కులను సాధించుకున్నామన్నారు. సంఘం స్థాపించిన నాడు కూలీ రేటు 30 పైసలు ఉంటే నేడు 29 రూపాయలకు పెంచుకోవడం జరిగిందని, ప్రతి హమాలీకి సంవత్సరానికి రెండు జతల యూనిఫామ్‌లు, కుట్టు కూలీ రేట్లు 1300 రూపాయలు, బోనస్ సంవత్సరానికి 7,500, హమాలీ కార్మికుడు చనిపోతే దహన సంస్కారాల ఖర్చులకోసం 20వేల రూపాయలు, ప్రతి దసరాకు 800 రూపాయలు, స్వీటు తదితర హక్కులను సాధించుకున్నామన్నారు. నూతన గోదాములను రాష్ట్రవ్యాప్తంగా నిర్మించేలా ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నామన్నారు. తద్వార స్థానికులకు ఉపాధి లభిస్తుందన్నారు. హమాలీ కార్మికులు పనిచేసే గోదాముల వద్ద మౌలిక వసతులు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. మహాసభలో సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శులు షేక్. భాషుమియా, పనాస ప్రసాద్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్, జిల్లా అధ్యక్షులు చెన్నకేశవులు, సివిల్ సప్లయిస్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు మునిశ్వర్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దండు లక్ష్మణ్ పాల్గొన్నారు. మహాసభలో 13 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దెవనభోయిన రాంబాబు, ఉపాధ్యక్షుడిగా జలగం బిక్షపతి. కోత్తగటు నర్సింగం, ప్రధాన కార్యదర్శి గుపెల్లి మునీశ్వర్, సహాయ కార్యదర్శులుగా జలగం రవి, గర్రకోట చంద్రమౌళి, కోశాధికారిగా మిట్టపెల్లి మహేందర్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

# కార్మిక వ్యతిరేక విధానాలపై సమ్మె

### ఎఐటియుసి మంచిర్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు

**ప్రజాపక్షం/మందమర్రి :** కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం కార్మిక, ప్రజా, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధానకార్యదర్శి మేకల దాసు పిలుపునిచ్చారు. స్థానిక సిఇఆర్ క్లబ్‌లో ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ జిల్లా సమితి సమావేశం జిల్లా అధ్యక్షుడు ఎండి అక్బర్ అలీ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా మేకల దాసు మాట్లాడుతూ సంపద సృష్టికర్తలు కార్మికవర్గమని, ఆ కార్మికవర్గానికి హక్కులు లేకుండా చేసే కార్మిక చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి 4 కోడ్‌లను అమలు చేయడం కార్మిక వర్గానికి హక్కులు లేకుండా కేవలం కార్పొరేట్ వ్యాపార వర్గాలకు అనుకూలంగా కార్మిక చట్ట సవరణ చేయడమేనన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా సమ్మె జరగబోతోందన్నారు. కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను యథావిధిగా కొనసాగించాలని, నాలుగు కోడ్‌లను రద్దు చేయాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మిట్టపల్లి పౌలు, ముస్కే సమ్మయ్య, కళిందర్ అలీ ఖాన్, తోకల సరస్వతి, దాగం మల్లేష్, శైలేంద్ర సత్యనారాయణ, భీమనాదని సుదర్శన్, దేనబోయిన బాపు, జాడిపోచం శంకర్ తదితరులు పాల్గొన్నారు.



# పేదలకు సేవలందించేది కమ్యూనిస్టులే





### సిపిఐ కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్ పాషా

**ప్రజాపక్షం/కొత్తగూడెం టౌన్ :** పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా కృషి చేయాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా అన్నారు. ఆదివారం పట్టణంలోని రామవరం సెంటర్లో ఏర్పాటు చేసిన పార్టీ జెండాను ఆవిష్కరించి కార్యకర్తలను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ కార్మికవర్గానికి, పేదప్రజలకు అనునిత్యం సేవలందించేది కమ్యూనిస్టులే అన్నారు. కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలకు అందించిన సేవల ఫలితంగా రోజురోజుకు పార్టీకి జనాదరణ పెరుగుతుందన్నారు. కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషిచేయాలన్నారు. ఎమ్మెల్యే కూనంనేని కృషితో నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో నాయకులు కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్‌కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

### స్వార్థం లేనిది తల్లి ప్రేమ

స్వార్థం లేనిది తల్లి ప్రేమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. పట్టణంలోని రామవరం సెంటర్‌లో మదర్స్ డే సందర్భంగా జంజర్ల కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అయన పాల్గొని మాట్లాడారు. ప్రతిఒక్కరి జీవితంలో తల్లి మొదటి స్నేహితురాలిని, మొదటి గురువని పేర్కొన్నారు. మాతృ శక్తి లేనిదే సమాజం లేదన్నారు. మహిళా శక్తి లేకుండా దేశ అభివృద్ధి జరగదన్నారు. తల్లుల అభివృద్ధే కుటుంబాల అభివృద్ధి అని, అదే దేశ అభివృద్ధికి పునాదిగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. కనిపెంచిన తల్లిదండ్రులను మరువవద్దని, వారిని కడదాకా కంటికిరెప్పలా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కాపు సీతాలక్ష్మి, కంచర్ల జమలయ్య, జి.వీరాస్వామి, మునిగడప వెంకటేశ్వర్లు, భూక్యా శ్రీను, ఎస్‌కె ఫహీమ్, పాటి మోహన్, మాతంగి లింగయ్య, మాటేటి గోపాల్, గురుమూర్తి, గోపి, తూముల శ్రీనివాస్, గుత్తుల శ్రీనివాస్, ఖయూమ్, నగేష్, అంకూస్, సింగిరాల రమేష్, దాసు, జలీల్, రణధీర్, మర్రి కృష్ణ, విజయలక్ష్మి, దార లక్ష్మి, శంకర్, దాట్ల శ్రవణ్, అలీం, అనీఫ్, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

# దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి నిరంతరం పోరాటాలు

### వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ

### సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి





**ప్రజాపక్షం/గన్నేరువరం :** నిరంతరం ప్రజల పక్షాన నిలుస్తూ దోపిడీ రహిత సమాజ నిర్మాణానికి భారత కమ్యూనిస్టు పార్టీ పోరాటాలు నిర్వహిస్తుందని, వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ సిపిఐ అని పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి పేర్కొన్నారు. గన్నేరువరం మండల కేంద్రంలోని ముదిరాజ్‌ల భవన్‌లో సిపిఐ మండల 3వ మహాసభ చొక్కల శ్రీశైలం అధ్యక్షతన ఆదివారం జరిగింది. మహాసభ ప్రారంభ సూచికగా సిపిఐ జెండాను మర్రి వెంకటస్వామి ఆవిష్కరించారు. మహాసభలో మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాల నివేదికను కాంతాల రాజిరెడ్డి ప్రవేశపెట్టారు. మహాసభకు ముఖ్య అతిధిగా హాజరైన మర్రి వెంకటస్వామి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు గడుస్తున్నా పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదన్నారు. నరేంద్ర మోడీ పరిపాలనలో కార్పొరేట్ శక్తులకు, పెట్టుబడిదారులకు మేలు కలిగించే విధానాలకు పాల్పడుతున్నారన్నారు. ఏటా కోటి ఉద్యోగాల మాట నీటిమూటలై నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్నారన్నారు. బడా పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తూ పేదలకు అన్యాయం చేస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్రంలో సిపిఐ సహకారంతో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని, ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటినీ అమలు పరచాల్సిన బాధ్యత రేవంత్‌రెడ్డి సర్కారుపై ఉందన్నారు. సంక్షేమ పథకాల అమలులో అర్హులైన పేదలకు ఇండ్లు, ఇళ్లస్థలాలు, సంక్షేమ పథకాలు అందించాలన్నారు. పూర్తిస్థాయిలో రైతులకు రుణమాఫీ చేసి, భూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. దేశంలో భూసంస్కరణ చట్టం, సమాచారహక్కు చట్టం, రాజభరణాల రద్దు, గ్రామీణ ఉపాధి హామీ పథకం లాంటి ప్రజోపయోగకర పథకాలు తీసుకురావడానికి సిపిఐ కృషి చేసిందన్నారు. మండలంలో పార్టీని బలోపేతం చేయడం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలన్నారు. రానున్న స్థానికసంస్థల ఎన్నికల్లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు సర్పంచులుగా, ఎంపిటిసిలుగా పోటీ చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మహాసభలో ఎఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బోనగిరి మహేందర్, మండల కార్యదర్శి కాంతాల అంజిరెడ్డి, సహాయ కార్యదర్శి చొక్కాల శ్రీశైలం, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిలు బోయిని మల్లయ్య, పిప్పల కనుకయ్య, కోతి సంపత్, చెరుకు ఆంజనేయులు, బోయిని తిరుపతి, గాజుల లక్ష్మణ్, నాగయ్య, కూన మల్లయ్య, ఘర్షకుర్తి శ్రీనివాస్, బొమ్మకంటి ఆంజనేయులు, రాపోలు రాజమల్లు, బొమ్మకంటి సదానందం, బుర్ర శ్రీను, మడికె సంతోష్, తాళ్లపల్లి సంపత్, సదానందం తదితరులు పాల్గొన్నారు.



# స్థానికం

REGIONAL NEWS

నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## దంతెవాగు పూడ్చివేత

**ప్రజాపక్షం/మునగాల:** ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన వాగును కొందరు ఆక్రమించి జెసిబి సాయంతో మట్‌టితో పూడ్చివేసిన ఘటన తాడువాయి గ్రామ రెవెన్యూ శివారులో ఆదివారం చోటు చేసుకుంది. దంతెల వాగు గణపవరం చెరువుకి వరద వాగుగా ప్రసిద్ధి, స ఉమారు 100 ఎకరాల్లో ఈ వాగు విస్తరించి ఉంది. కాలక్రమేణ కబ్జాలతో వాగు కనుమరుగువుతొంది. వర్షాకాలం వర్షాలు వచ్చే వరద ఈ వాగు గుండా వెళ్లి గణపవరం చెరువు నిండుతోందని రైతులు చెబుతున్నారు. అలాంటి చెరువు కొందరు ఆక్రమించి మట్టి పోసి చదును చేస్తున్నారు. గ్రామంలో రోజురోజుకు వాగులు, వంకలు కనుమరుగవు తున్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా కబ్జా గురైన వాగులను సర్వే చేసి స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## నేడు పశ్య కన్నమ్మ సంతాప సభ



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** స్వాతంత్ర సమర యోధురాలు, తెలంగాణ సాయుధ పోరాట వీర నారి కామ్రేడ్ పశ్య కన్నమ్మ సంతాప సభను హుజూర్ నగర్ సిపిఐ సమితి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు యల్లావుల రాములు, పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏప్రిల్ 30 అనారోగ్య కారణాలతో మృతి చెందిన కనకమ్మ సేవలను కొనియాడారు. సోమవారం పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాలలో జరిగే సంతాప సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ, రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు, రాష్ట్ర ప్రెస్ అకాడమి అధ్యక్షులు శ్రీనివాసరెడ్డితో పాటు పలువురు సిపిఐ ప్రముఖ నాయకులు పాల్గొనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిష్టుల ఎజెండా



**ప్రజాపక్షం/చిట్యాల:** సమాజంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే కమ్యూనిష్టుల ఎజెండా అని సిపిఐ జిల్లా సమితి సభ్యులు బొడిగె సైదులు అన్నారు. ఈ నెల 16న జరిగే మండల మహాసభకు సంభందించిన కరపత్రాన్ని ఆదివారం చిట్యాల మండల కేంద్రంలో సిపిఐ నాయకులతో కలిసి విడుదల చేసిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిష్టు పార్టీ ఆవిర్భావం నుండి ప్రజలకు అండగా ఉంటూ ప్రజల పక్షాన నిలబడి పోరాటాలు చేస్తున్న పార్టీ అని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేయాలని, ఇందిరమ్మ ఇండ్లను త్వరిత గతిన పూర్తి చేసేలా చూడాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ పది సంవత్సరాల పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని విమర్శించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయకుండా ప్రజారంజక పాలనను అందించాలని సైదులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల సహాయ కార్యదర్శి జిల్లా సత్యం, నాయకులు దేశగోని బాలరాజు, గుండాల సత్తయ్య, బొల్లగ్గారి లింగయ్య, రావుల చినవెంకన్న, పానుగుల శివ పాల్గొన్నారు.

## ప్రజారోగ్యానికి పెద్దపీట

దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్



**ప్రజాపక్షం/పెద్దఅడిశర్లపల్లి:** ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని దేవరకొండ శాసనసభ్యుడు నేనావత్ బాలు నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని అంగడిపేట గ్రామపంచాయతీ ఆవరణంలో బిగ్ టీవీ ఆధ్వర్యంలో మలక్ పేట యశోద ఆసుపత్రి వారి సౌజన్యంతో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్ రెడ్డి సహకారంతో నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ ఆస్పత్రులలో మెరుగైన వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు.గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించడానికి ఉప కేంద్రాలను నిర్మిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎల్లయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్మటి సతీష్ రెడ్డి,బ్లాక్ అధ్యక్షుడు బోడియ నాయక్, మాజీ ఎంపీపీలు వంగాల ప్రతాప్ రెడ్డి,తేరా సత్యం రెడ్డి, గోవిందు యాదవ్,ముక్కామల్ల వెంకటయ్య గౌడ్,డాక్టర్ పాల్వాయి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.

## నేడు సిపిఐ మండల మహాసభ




**ప్రజాపక్షం/చండూరు:** నేడు దోనిపాముల గ్రామంలో జరిగే భారత కమ్యూనిస్టు పార్టీ మండల 15వ మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ చండూరు మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన చండూరులో మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాలలో పార్టీ గ్రామశాఖ మహాసభలు నిర్వహించుకోవడం జరిగిందని తెలిపారు. నేడు సోమవారం మండలంలోని దోనిపాముల గ్రామంలో జరిగే సిపిఐ మండల 15వ మహాసభకు ముఖ్య అతిధులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు ,మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట్‌రెడ్డి, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం హాజరవుతున్నారని తెలిపారు. నేడు ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే మండల మహాసభలకు పార్టీ శ్రేణులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు , మహాసభ ఆహ్వాన కమిటి అధ్యక్షుడు తిప్పర్తి రాములు తదితరులు పాల్గొన్నారు.

## డిఎంహెచ్‌ఓను సస్పెండ్ చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:** జిల్లాలో అనుమతులు, అర్హత లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై అధికారులు చర్యలు తీసుకోవాలని తెలంగాణ యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అనంతుల మధు అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాలలో పేద ప్రజల ఆరోగ్యం నకిలీ వైద్యులుప్రభుత్వ వైఖరి అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఏలాంటి అనుమతులు, అర్హత లేకుండా నిర్వహిస్తున్న ప్రైవేట్ ఆసుపత్రులపై చర్యలు తీసుకోవడంలో జిల్లా వైద్యాధికారి పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డిఎంహెచ్‌ఓను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బాసిపంగు సునీల్, పోరెళ్ళ విప్లవ్ కుమార్, అశోక్, కరీం, గట్ల రమాశంకర్, బంటు సందీప్, వెంకటేష్ నాయక్, సంతోష్ రెడ్డి, నాగేశ్వర్ రావు నాయక్, మహేందర్ పాల్గొన్నారు.

# నేడు సాగర్‌కు ప్రపంచ సుందరీమణులు

బుద్ధవనం,విజయ విహార్‌లో సర్వం సిద్ధం

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు



**ప్రజాపక్షం/నందికొండ:** మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ వేదికైన సందర్భంగా శనివారం పోటీలకు సంబంధించిన ప్రారంభో త్సవ కార్యక్రమం హైదరాబాదులో అట్టహాసంగా ప్రారంభమైంది.110 దేశాలకు చెందిన సుందరిమణులు నెల 10 నుంచి 31వరకుఈ పోటీలో పాల్గొంటున్న సందర్భంగా ప్రపంచ పర్యాటక కేంద్రమైన నాగార్జునసాగర్ ను నేడు సందర్శించనున్నారు.వీరి రాక సందర్భంగా సాగర్ లో పోలీసులుకట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారువిజయ విహార్, బుద్ద వనం అంతర్జాతీయ స్థాయిలో అన్ని హంగులను పూర్తి చేసుకుని వారి అతిథ్యానికి సర్వం సిద్ధమైంది భారతదేశం నుంచి మిస్ ఇండియా నందిని గుప్తా ఈ పోటీలలో పాల్గొననున్నారు దీంతో నాగార్జున సాగర్లో విడిది చేయడానికి అంతర్జాతీయ స్థాయి లో విజయవిహార్ లోని 38 గదులను ఐదు కోట్ల రూపాయలతో ఆధునీకరణ చేశారు.ఇది గ్లోబల్ ఈవెంట్ కావడంతోపోలీసు శాఖ వారు హైదరాబాదులో బయలుదేరి నాగార్జునసాగర్ చేరుకుని మళ్లీ తిరిగి హైదరాబాద్ వెళ్ళే వరకు ఎటువంటి అవాంతరాలు అవాంఛనీయ సంఘటనలు,జరగకుండా 1200 నుంచి 1500 మంది పోలీసులతో పూర్తి స్థాయి కట్టుదిట్టమైన రూట్ బందోబస్తును ఏర్పాటు చేసారు.నేడు ఈ బృందం 4 గంటలకు విజయ విహార్ అతిథి గృహానికి చెరుకుని అర గంట తరువాత ఇక్కడ నుండి బుద్ధ వనం చేరుకొని బుద్ధుని పాదాల వద్ద పుష్పాంజలి ఘటించిన అనంతరం మహా స్తూపం ముందు భాగంలో టూరిజం వారు ఏర్పాటు చేసిన సాంప్రదాయ నృత్యాలను వీక్షిస్తారు. ఈ ప్రదేశంలోనే అనుమతి ఉన్న మీడియా వారికి ఫొటోలు తీసుకునే అవకాశం ఉంటుంది. తరువాత మహాస్థూపం చేరుకొని అక్కడ ఉన్న బౌద్ధ శిల్పాలను సందర్శించి ధ్యాన మందిరంలో బౌద్ధ భిక్షులతో కలిసి ధ్యానం, చాటింగ్‌లో పాల్గొంటారు. ఆ తరువాత జాతక వనంలో ఏర్పాటు చేసిన లేజర్ లైటింగ్ షో, స్క్రీన్ పై నిర్వహించే డాక్యుమెంటరీని వీక్షిస్తారు. ఇక్కడే రాత్రి భోజనం చేసిన అనంతరం హైదరాబాద్ చేరుకుంటారు. ఈ కార్యక్రమం పూర్తి అయ్యేంతవరకు అనుమతి లేని వారికి ప్రవేశం లేకుండా కఠిన చర్యలు తీసుకున్నారు.



## నూతన పింఛన్లు మంజూరు చేయాలి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొల్గ్గారి నరసింహ

**ప్రజాపక్షం/మునుగోడు:** ఎన్నికల ముందు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరులైన వారికి ఇస్తామన్న ఆసరా పింఛన్‌లను తక్షణమే మంజూరు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బొల్గ్గారి నరసింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాత్రి మండలంలోని పులిపలుపుల గ్రామంలో ఆ గ్రామ శాఖమహాసభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని మతోన్మాదాన్ని తరిమికొట్టాలన్నారు.రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుపరచాలని గ్రామీణ ప్రాంతంలో ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన వారికి ఇవ్వాలని,రేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ మండల కార్యదర్శి చాపల శీను మాట్లాడుతూ వృద్ధులకు వితంతువులకు వికలాంగులకు ఒంటరి మహిళలకు కొత్త పెన్షన్లు ఇవ్వాలని అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొంపెల్లి రాములు అధ్యక్షతన జరిగిన ఈమహాసభలో మండల కార్యవర్గ సభ్యులు కాయితవెంకన్న, గ్రామ శాఖ కార్యదర్శి బొల్గ్గారి ఎల్లయ్య, సహాయ కార్యదర్శి గుండెబోయిన భాస్కర్, సింగం యాదయ్య,పందుల యాదయ్య, మలికంటి వినీల్, మునుగోటి సత్యనారాయణ, జనగాం శంకరయ్య,దొటి రమేష్, సిలువేరు సైదులు, పగిళ్ల యాదయ్య,పగిళ్ల బిక్షం, సింగం నాగయ్య పాల్గొన్నారు.

## ప్రజా పోరాటాలు నిర్వహించాలి



**ప్రజాపక్షం/మర్రిగూడ:** ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై నిత్యం ప్రజా పోరాటాలు నిర్వహించాలని మండల కార్యదర్శి ఈదుల బిక్షం రెడ్డి పిలుపునిచ్చారు. మండల పరిధిలోని కొట్టాల గ్రామ శాఖ మహాసభలో బిక్షం రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని అన్నా రు. సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ఇంది రమ్మ ఇల్లు మంజూరు చేయాలని, అదే విధంగా నూతన రేషన్ కార్డులు, ఆసరా పెన్షన్లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో సిపిఐ పార్టీ మండల కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్,గంట వెంకటేష్, ఉబ్బు అంజయ్య,ఉబ్బు రాములు ,బుర్ర బాలయ్య, గంట రాజు, బుర్ర రాము,బుర్ర నరసింహ, వెంకటయ్య,ఉబ్బు లింగయ్య పాల్గొన్నారు.

# అర్హులైన పేదలకు సంక్షేమ పథకాలు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం



**ప్రజాపక్షం/మునుగోడు:** అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గురిజ రామచంద్రం కోరారు. శనివారం రాత్రి పలివెల గ్రామ శాఖ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు మొదటగా బస్టాండ్ సెంటర్లో గల పార్టీ పథకాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల అమలు కోసం సిపిఐ పోరాడుతుందని అన్నారు. నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు పెన్షన్లు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. సంక్షేమ పథకాల ఎంపికలో అధికారులు అనర్హులను గుర్తిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో యువత గంజాయి, కొకైన్ లాంటి మత్తు మత్తుకు బానిస అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వీటిపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సమావేశానికి నాతి నరసింహ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ జడ్పిటిసి గోస్కొండ లింగయ్య, మాజీ ఎంపీపీ మాధగోని సాయిలు, గ్రామ శాఖ కార్యదర్శి గోస్కొండ కృష్ణయ్య,సహాయ కార్యదర్శి ఆనగంటి నరసింహ, వెంకన్న,మాధగోని మల్లయ్య, గోస్కొండ మల్లేష్,మోహన్ రెడ్డి,పంతంగి నరసింహ,యాదయ్య, కృష్ణయ్య, రాములు,

## ఇపిసిఇటి ఫలితాల్లో జయ విద్యార్థుల ప్రభంజనం



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఇంజనీరింగ్, అగ్రికల్చర్ అండ్ ఫార్మసి కామన్ ఎంట్రెన్స్ టెస్టులో జిల్లా కేంద్రంలో జయ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రభంజనం సృష్టించారు. ఆదివారం 60ఫీట్ల రోడ్డులోని కళాశాలలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ జయ వేణుగోపాల్, డైరెక్టర్‌లు బింగి జ్యోతి, జెల్లా పద్మలు అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈఎపిసిఈటి ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన కె ఉజ్వల్ 141 ర్యాంకు, ఇజ తేజశ్రీ 266 ర్యాంకు, సిహెచ్ హన్షితశ్రీ 695, టి అమూల్య 913, బి లాస్య 917, పి అమిత్ సూర్య1948, బి శివమణి 2270 ర్యాంకు, డి జగదీష్ రాజు 2935 ర్యాంకు, వై ప్రదీప్ 3364 ర్యాంకు, కె సాయినందన్ 3977, జి నవదీప్ 4003 ర్యాంకు, సిహెచ్ కుషల్ రాజ్ 5044, సిహెచ్ అక్షయభారతి 5583, కె యామిని 5823, హన్షిని 5843 ర్యాంకు, వి బింధుమాధవి 6002 ర్యాంకు, ఎస్ నక్షత్ర 6630 ర్యాంకు స ఆధించినట్లు తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచేలా కృషి చేసిన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో కొర్రీలు పెట్టొద్దు

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ధనుంజయ నాయుడు



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో ప్రభుత్వం కొర్రీలు పెట్టడం సరైంది కాదని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించిన ప్రభుత్వం అభ్యర్థుల ఎంపికలో అనేక నిబంధనలు పెడుతున్నారన్నారు. 400 నుండి 600 చదరపు అడుగుల మేరకే ఇంటి నిర్మాణం జరపాలని అంతకుమించి స్థలం ఉంటే ఇందిరమ్మ ఇళ్లుకు అనర్హులని నిబంధన పెట్టడాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ప్రభుత్వం రాజకీయ జోక్యం చేసుకోవడం సరైంది కాదన్నారు. లబ్దిదారుల నుండి మండలంలోని పలు గ్రామాల పంచాయతీ కార్యదర్శులు రూ. 3వేల నుండి 5వేల వరకు వసూళ్లకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్ వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. సిపిఐ పట్టణ కార్యదర్శి యల్లబోయిన సింహాద్రి, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, ఎఐటియుసి మండల అధ్యక్షులు ఊదర వెంకన్న, యువజన నాయకులు కమ్రరాజు వెంకట్ పాల్గొన్నారు.

## ఇపిసెట్ ఫలితాలలో ప్రగతి జూనియర్ కళాశాల అగ్రగామి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈఏపీసెట్ 2025 ఫలితాలలో నల్లగొండ పట్టణంలోని ప్రగతి జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి నల్లగొండ జిల్లాలో మరి ఏ ఇతర కళాశాల సాధించలేని విధంగా ర్యాంకులు సాధించి జిల్లా చరిత్రను తిరగరాశారు. కళాశాలకు చెందిన కె. ఉజ్వల 314 ర్యాంకును సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎం. షైని 1306, అరిబా తబస్సుమ్ 1363, పి సింధు 1847, నబీహ మహీన్ 2812, బి.భహని 3755,ఉజ్వల 314 ర్యాంకును సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. అదే విధంగా ఎం. షైని 1306, అరిబా తబస్సుమ్ 1363, పి. సింధు 1847, నబీహ మహీన్ 2812, బి. 3755, అమాతుల్. షెజాన్ 4294,ఎస్ చరణ్ 4768,కె సమీర్ 5075,ఎస్ యశ్వంత్, 5728,సుహాస పిర్థో స్ 5960ర్యాంకులతో, 15 వేల లోపు ర్యాంకులు మొత్తం 72 మంది విద్యార్థులు , 25 వేల లోపు ర్యాంకులు 153 మంది విద్యార్థులు సాధించి ప్రగతి జూనియర్ కళాశాల ను జిల్లాలో అగ్రగామి కళాశాలగా నిలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన కళాశాల విద్యార్థులను వారి తల్లిదండ్రులను అందుకు సహకరించిన అధ్యాపక బృందానికి కళాశాల చైర్మన్ చందాకృష్ణమూర్తి, మరియు డైరెక్టర్లు ఎ. నరేందర్ బాబు, ఎన్. శశిధర్రావు, చందా శ్రీనివాస్, పైళ్ళ రమేష్ రెడ్డి అభినందనలు తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో కూడిన ప్రణాళికబద్ధమైన విద్యాబోధన, అంకిత భావం కలిగిన యాజమాన్యం మరియు అధ్యాపకబృందం కృషివలన ఉత్తమ ఫలితాలు సాధించడం జరిగిందని ప్రిన్సిపల్ తెలియజేశారు.

## ఇపిసిఇటి ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన 'ప్రతిభ' కళాశాల విద్యార్థిని



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ఈఎపిసిఈటి 2025 ఇంజనీరింగ్ అగ్రికల్చర్ అండ్ ఫార్మసి కామన్ ఎంట్రెన్స్ టెస్టు ఫలితాల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రతిభ జూనియర్ కళాశాల విద్యార్థిని అచ్యుత రాష్ట్ర స్థాయిలో 2799 ర్యాంకును సాధించి తన ప్రతిభను చాటింది. మరో 9మంది విద్యార్థులు 10వేల లోపు ర్యాంకులను సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్, డైరెక్టర్ కందిమళ్ళ వెంకట్ రెడ్డి, ప్రిన్సిపల్ అండ్ డైరెక్టర్ కత్రోజు సత్యంబాబులు పుష్పగుచ్చం అందజేసి అభినందించారు. మిఠాయిలు పంపిణీ చేసి బాణాసంచ కాల్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అతి సాధారణమైన ఫీజులతో గ్రామీణ విద్యార్థులను బోధన చేసి రాష్ట్ర స్థాయిలో ఇంటర్, ఈఎపిసిఈటి ఫలితాలో కూడా ర్యాంకులు సాధించడం జరిగిందన్నారు. ఇందుకు కారకులైన అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులను కృతజ్ఞతలు తెలిపారు.

## అస్తిత్వ సాహిత్య ఉద్యమాల పుట్టినిల్లు నల్లగొండ




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** తెలుగు సాహిత్యంలో అస్తిత్వ ఉద్యమాలకు నల్లగొండ కేంద్ర బిందువుగా నిలిచిందని ప్రముఖ సాహితీవేత్త మునాసు వెంకట్ అన్నారు. నల్లగొండకు చెందిన ప్రముఖ కవి శీలం భద్రయ్య రచించిన ముస్తాదు కవిత్వ సంపుటి ఆవిష్కరణ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సృజన సాహితీ ఆధ్వర్యంలో పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షతన యుటిఎఫ్ భవన్ లో జరిగిన ఈ సభలో మునాస్ వెంకట్ మాట్లాడుతూ శీలం భద్రయ్య చక్కని భావనా శక్తితో శిల్ప సౌందర్యం కలిగిన కవితలు రాసారని అభినందించారు. ప్రముఖ సాహితీవేత్త మోత్కూరు నరహరి మాట్లాడుతూ చక్కని మాండలికం, చిక్కని కవిత్వం భద్రయ్య ప్రత్యేకత అన్నారు. రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. సృజన సాహితీ కార్యదర్శి డాక్టర్ సాగర్ల సత్తయ్య పుస్తకాన్ని సమీక్షించారు. కట్టంగూరు కు చెందిన కవి పొడిచేటి శంకర్ మోకు ముస్తాదులతో సభకు హాజరై అందర్నీ ఆకట్టుకున్నారు. నల్లగొండకు చెందిన యోగా గురువు మాదగాని శంకరయ్య తొలి ప్రతి స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు బొల్లెద్దు కిషోర్ కుమార్ కవులు పగిడిపాటి నరసింహ, అరుణ జ్యోతి, కనకటి రామకృష్ణ, యాదగిరి,రమేష్, గంటెకంపు గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## కెఎల్‌ఎన్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని కేఎల్‌ఎన్ కళాశాల విద్యార్థులు ఆదివారం వెలువడిన ఎఫ్‌సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటి ర్యాంకులు సాధించినట్లు కళాశాల కరస్పాండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగంలో సంద్రాల పావని 5068వ ర్యాంకు, ఎస్.అశ్విత 10389, పి.నిత్యా 12618, ఎం.హాసిత 18397, అగ్రికల్చర్ విభాగంలో జుహా అంజుమ్ 3315వ ర్యాంకు, అంజుమ్ 11748వ ర్యాంకు సాధించగా 30వేల లోపు ర్యాంకులు 20 మంది సాధించినట్లు తెలిపారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కళాశాల డైరెక్టర్లు పీఎల్‌ఎన్.రెడ్డి, నరేందర్‌రెడ్డి, టి.హనుమంతరెడ్డి, చైతన్య ఆనంద్‌లు అభినందించారు.



# స్థానికం
REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## కళాకారులకు ఆర్థికసాయం అందజేత



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలోని రాచూర్ గ్రామంలో గత మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఎల్లమ్మ నాటకప్రదర్శన ఇస్తున్న కళాకారులకు ఆగ్రామ యువనాయకులు గోకమల్లక్రాంతికుమార్, పడకంటి వెంకటేష్, గుత్తి చంద్రశేఖర్‌లు నిర్వాహకులు దుబ్బరామార్జున్‌కు రూ.15వేలు అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో ప్రదర్శించే నాటకాలు మరుగునపడిపోయే ప్రమాదం ఉందని, కంప్యూటర్‌యుగంలో నాటకాలను చరిత్రరూపంలో ప్రదర్శించడం ఎంతో గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ఉండే కళాకారులను ఆదరించాలని సూచించారు.

## ఆర్‌టిఐపై అవగాహన ఉండాలి

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు మంగరాయి వెంకటేష్ ఆధ్వర్యంలో నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షులు బత్తుల గణేష్ సమాచార హక్కు చట్టం యాక్టీవిటీస్ ఫోరమ్ నారాయణపేట జిల్లా అధ్యక్షులుగా ఉట్కూర్ మండలం అవసలోనిపల్లి గ్రామానికి చెందిన మందిపల్లి నరేష్ నియమితులయ్యారు. నూతనంగా నియమితులైన నరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులను సమన్వయం చేసుకుంటూ జిల్లాలో సమాచార హక్కు చట్టం పకడ్బందీగా అమలుకు కృషి చేస్తానని, ఆర్టీఐ పై అవగాహన కార్యక్రమాలు చేపడతానని, సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. సహ చట్టం విషయంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని తెలిపారు. సహ చట్టం ద్వారానే ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారితనం సాధ్యమన్నారు. తన పైన ఉన్న నమ్మకంతో తనకు బాధ్యతను అప్పగించిన రాష్ట్ర అధ్యక్షులు, జిల్లా అధ్యక్షులు, కమిటీకి కృతజ్ఞాతలు తెలిపారు.

## మహిళల రక్షణే 'షీటీమ్స్' లక్ష్యం
### ఎస్‌పి యోగేష్ గౌతమ్



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వలన గానీ, మరే విధమైన వేధింపుల వలన గానీ ఇబ్బందుల ఎదుర్కోంటున్నట్లయితే నిర్భయంగా పోలీసులను సంప్రదించవచ్చని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. నారాయణపేట్ జిల్లాలో మహిళల రక్షణ కోసం షీటీమ్స్, యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు పనిచేస్తున్నాయని తెలిపారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయపడొద్దని, గృహహింసకు గురైన ధైర్యంగా ముం దుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితుల పై ఖచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. మహిళలు సామాజిక మాద్యమాలైన ఫెస్బుక్, వాట్సాప్, ఇన్స్టాగ్రామ్ వినియోగంలో జాగ్రత్తలు వహించాలని, వాటిలో ఫోటోలు, వీడియోలు పోస్టు చేసే సమయంలో వ్యక్తి గత భద్రతకు సంబంధించి అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

## బిఆర్‌ఎస్ నేత దర్శనకు నివాళి



**ప్రజాపక్షం/జడ్చర్ల:** బిఆర్‌ఎస్ పార్టీ నాయకులు జడ్చర్ల పట్టణ టౌన్ బిఆర్‌ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు, దర్శన్ (56) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ నిన్న సాయంత్రం మరణించారు. జడ్చర్ల మున్సిపల్ పరిది 17 వ వార్డు శాంతి నాగర్ లో వారి నివాసనికి వెళ్లి దర్శన్ పార్థివ దేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ చైతన్య హరికృష్ణ గౌడ్ ,పిఎసిఎస్ చైర్మన్ సుదర్శన్ గౌడ్, పి.మురళి,శంకర్ నాయక్, ఇంతియాజ్ ఖాన్, నాగిరెడ్డి, శ్రీకాంత్, వెంకటేష్, టైగర్ నర్సింములు, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి పరామర్శ




**ప్రజాపక్షం/ మక్తల్:** మక్తల్ నియోజకవర్గం గుడిగండ్ల గ్రామానికి చెందిన గోని తిరుపతి మొదటి కుమారుడు శేఖర్ గత కొంతకాలంగా ఆంధ్ర ప్రాంతంలో తమ సొంత గొర్రెలను కాస్తూ పనిచేస్తూ ఉండగా అకస్మాత్తుగా బావిలో పడిన ఇంకొక బాబును కాపాడబోయి ఊపిరాడక చనిపోవడం జరిగింది. ఈ విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చనిపోయిన శేఖర్ కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటానని తెలిపారు.

## మహిళ మృతదేహం లభ్యం

**ప్రజాపక్షం/మఖ్తల్:** మక్తల్ పట్టణంలో ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని మహిళా మృతదేహం మక్తల్ టౌన్ నారాయణపేట వెళ్లే రోడ్డు దారిలోని కెనాల్ కాలువలో గుర్తించడం జరిగింది. మహిళా వయసు 35 నుండి 40 మధ్యలో ఉండి శరీరం పై పింక్ కలర్ జాకెట్, బ్లాక్ లంగా మెడలో మూడు తాయితలు కలవు. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో ఉంది. ఇట్టి మహిళా మృతదేహం గూర్చి ఎటువంటి సమాచారం తెలిసిన మక్తల్ పోలీసు వారికి తెలిపారు.

## పెబ్బేరు బస్టాండులో 'మాతృదేవోభవ'



**ప్రజాపక్షం/పెబ్బేరు :** సామాజిక కార్యక్రమాలలో చురుకుగా ఉండే మాజీ కౌన్సిలర్ అక్కమ్మ ప్రయాణ ప్రాంగణంలో తల్లులను సన్మానించారు. అమ్మకు ప్రత్యామ్నాయం లేదు. అమ్మ లేకపోతే గమనం లేదు. అమ్మ లేకపోతే సృష్టిలో జీవనం లేదు. అమ్మ లేకపోతే అసలు సృష్టే లేదు. కంటి పాపలా కాపాడే అమ్మకి మదర్స్ డే శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ అక్కమ్మ, జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ , వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటేష్ సాగర్ , మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** మరికల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2008–09 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం నంది ఫంక్షన్ హాల్ లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యా బుధ్ధులను బోధించిన నాటి ఉపాధ్యాయులను సన్మానించారు.ఉపాధ్యాయులు రేవతి, అనంతసేన రావు, చెన్నయ్య, బ్రహ్మయ్య, రాఘవాచారి, జమీర్ అలీ, ఆనంద్ రెడ్డి, నిరంజన్, పీఈటీ చంద్రశేఖర్ గౌడ్ పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# తరుగు దోపిడీని అరికట్టాలి
### సిపిఐ జిల్లా నాయకులు



**ప్రజాపక్షం / పాన్‌గల్ :** ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో దోపిడిని అరికట్టాలని సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు కాకం బాలస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లిలో ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. పిఏసిఎస్, ఐకేపిల ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు చేస్తున్నారన్నారు. ప్రతి బస్తాకు 40 కిలోల చొప్పున ధాన్యం తూకం వేస్తారన్నారు.ఖాళీ సంచి అరకిలో బరువు ఉంటుందని, ఖాళీ సంచి తూకం పేరుతో కిలో తరుగు తీస్తున్నారన్నారు. ఈ లెక్కన ప్రతి క్వింటాలకు కిలో పావు వడ్లు నష్టపోతున్నారన్నారు. అది చాలదని ఇప్పుడు మళ్లీ అదనంగా 40 కిలోల బస్తాకు మరో కిలో వడ్లను తరుగు తీసేందుకు కేంద్రాల నిర్వాహకులు సిద్ధమయ్యారన్నారు. రైతులు ప్రశ్నిస్తే శ్రీరంగాపురం మండలం నగరాల వద్ద గల మిల్లుకు లారీలను పంపితే అక్కడ మిల్లరు తాలు పేరుతో కిలో ఒడ్లు తరుగు తీస్తున్నారని చెబుతున్నారన్నారు. అంతేకాక ప్రతి లారీఅన్‌లోడ్అనంతరం లారీలో మిగిలిన వడ్లను ఊడ్చే పేరుతో రూ.500 అడుగుతున్నారని రైతులు చెబుతున్నారన్నారు. ప్రతి 40 కిలోల బస్తాకు రైతులు హమాలీ చార్జి కింద రూ. 20 చెల్లిస్తున్నారని, హమాలీ చార్జీలను ప్రభుత్వమే చెల్లించాలని డిమాండ్ చేశారు.

**క్రీడా ప్రాంగణాన్ని పునరుద్ధరించాలి**

తెల్లరాళ్లపల్లిలో క్రీడా ప్రాంగణం ప్రైవేట్ వ్యక్తులుకూల్చివేసి నెలలుగడుస్తున్నా అధికారులు పట్టించుకోవటంలేదని, క్రీడా ప్రాంగణం బోర్డును పునరుద్ధరించాలని కోరారు. క్రీడాప్రాంగణాన్ని కూల్చివేసిన వారిపై చర్యలు తీసుకోవాలి. సిపిఐ గ్రామశాఖకార్యదర్శిసహదేవుడు, నేతలు హన్మంతు, శంకరయ్య, బొజ్జన్న, చిన్నయ్య ఉన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీలు

**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా:** మరికల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆత్మకూర్ ఎక్స్‌రోడ్డు వద్ద ఏఎస్ఐ మసూద్ ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహించి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ మసూద్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలని తెలిపారు. వాహనదారులు వాహనాలకు సంబంధించి సరైన ధ్రువ పత్రాలు కలిగి ఉండాలని సూచించారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడుపరాదని, సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేయరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్ సీట్ బెల్ట్ తప్పనిసరిగా ఉపయోగించాలని తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియామాలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని తెలిపారు.



## 18న ఇందిరా సౌరగిరి జలవికాస పథకం ప్రారంభం
### నాగర్‌కర్నూలు కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ఇందిరాసౌరగిరి జలవికాసపథకం ప్రారంభోత్సవానికి ముమ్మరంగా ఏర్పాట్లు చేయడంతోపాటు రైతులపొలంలో బోరుబావులను తొలగించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం మాచారం గ్రామంలో రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించనున్న ఇందిరాసౌరగిరి జలవికాసం పథకపనులను జిల్లా అటవీశాఖ అధికారి రోహిత్‌గోపిడి, అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయంతోకలిసి జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రజల అభ్యున్నతికై రాష్ట్రప్రభుత్వం ఆర్‌ఓఎఫ్ ఆర్ పట్టా ఉన్న పోడుభూములను సాగు చేసుకుంటున్న గిరిజన రైతులకు చేయూతనందించడంకోసం బోరుబావి తవ్వించడం ద్వారా నీటి సదుపాయం కల్పించడం, సౌరవిద్యుత్ ద్వారా పంపుసెట్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడం, రైతులభూముల్లో పండ్లతోటలు పెంచడంద్వారా వారికి ఉపాధి కల్పించాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి సొంత జిల్లాలో పైలట్‌ప్రాజెక్టుగా ప్రారంభించనున్నట్లు వివరించారు. మే 18న ప్రారంభించనున్న ఇందిరాసౌరగిరి జలవికాస పథకానికి సంబంధించిన పనులను సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో సమన్వయంతో చర్యలు చేపట్టినట్లు తెలిపారు. భూగర్భజల అధికారులు సూచించిన ప్రాంతాల్లో బోరుబావులు తవ్వించడం జరుగుతుందని వెంటనే సౌర విద్యుత్‌ద్వారా బోరుబావులకు పంపుసెట్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలియజేశారు. రైతులకు అవసరమైన పండ్లతోటమొక్కలను సిద్ధం చేస్తున్నామని వివరించారు. అచ్చంపేట ఆర్‌డిఓ మాధవి, గ్రౌండ్‌వాటర్ ఎడి దివ్యజ్యోతి, డిటిడిఓ ఫిరంగి, డిపిఓ మోహన్‌రావు, జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు వెంకటేశం, జగన్, ఐటిడిఎ అధికారి జాఫర్, అచ్చంపేట డిఎస్‌పి శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బిడిఈ జలంధర్, అమ్రాబాద్, తహసీల్దార్ శైలేంద్ర, ఎంపిడిఓ, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీలక్ష్మీ నరసింహ సేవలో ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి:** మహబూబ్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మన్యంకొండ దగ్గర కొలువైన స్వయంభూ శ్రీలక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. ఆయన శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి వారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అందిరిపైనా స్వామి వారి అనుగ్రహం మెండుగా ఉండాలని ఆకాంక్షించారు. శ్రీ లక్ష్మీ నర్సింహ స్వామి దేవాలయ అభివృద్ధి కి అన్ని విధాలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు ఎమ్మెల్యే వేద ఆశీర్వాదం అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్యే పాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, జిల్లా హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు బెజ్జుగం రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## త్వరలోనే జర్నలిస్టుల సమస్యలకు లైన్ క్లియర్
### టియుడబ్ల్యుజె రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్‌ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్రం లో జర్నలిస్టుల సమస్యలకు త్వరలోనే శాశ్వత పరిష్కారం చూపిస్తూ ఎంతో కాలం నుంచి ఎదురుచూస్తున్న నూతన అక్రిడేషన్ కార్డులు, ఇండ్ల స్థలాల గృహ నిర్మాణం వంటి పథకాలలో అవకాశం కల్పించే విధంగా కృషి చేస్తామని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ అన్నారు. ఆదివారం ఆయన మహబూబ్ నగర్ విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస రెడ్డి నేతృత్వంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ ప్రధాన కార్యదర్శి రామ్ నారాయణ తో కూడిన బృందం రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణం సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో జర్నలిస్టుల సమస్యలపై చర్చించడం జరిగిందని ఇందుకోసం ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లుఆయనపేర్కొన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా వివిధ కారణాలతో మరణించిన, ప్రమాదాలలో గాయపడ్డ జర్నలిస్టు కుటుంబాలను ఆదుకోవడానికి ప్రభుత్వం విడతల వారీగా జర్నలిస్టుల సంక్షేమ నిధి కింద ప్రభుత్వాలు విడుదల చేసిన నిధుల ద్వారా బ్యాంకు నుంచి వడ్డీని 22 కోట్ల రూపాయలు జర్నలిస్టు సంక్షేమానికి ఖర్చు పెట్టడం జరిగిందని ఆయన వివరించారు. రాబోయే రోజుల్లో ప్రెస్ కర్నూల్, వనపర్తి, నారాయణ పేట్ జి ల్లాలలో మొదటి విడతలో ఉచిత శిక్ష ణశిబిరాలను ఏర్పా టు చేస్తున్నట్లు ఆ తర్వాత రెండో విడతలో మహబూబ్ నగర్ , గద్వాల జిల్లాలలో శిక్షణ శిబిరాలను జర్నలిస్టులకు ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ అవకాశాన్ని ఉమ్మడి జిల్లాలోని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా టీయుడబ్ల్యూజే యూనియన్‌లో సభ్యత్వాలు జరిగాయని, తొందరలోనే జిల్లా స్థాయి యూనియన్ కమిటీలను ఏర్పాటుచేయుటకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. జర్నలిస్టు యూనియన్ ముసుగులో అవినీతి అక్రమాలకు పాల్పడిన వ్యక్తులకు ఐజేయు యూనియన్‌లో చోటు దక్కదన్నారు.

## పాత్రికేయుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం



**ప్రజాపక్షం/మహబూబ్ నగర్ ప్రతినిధి:** పాత్రికేయ మిత్రుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. గత వారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ లో నూతన కమిటీ ఏర్పాటు కోసం ఎన్నికలు జరిగాయి. కొత్తగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేని కలిశారు. నూతనంగా ఎన్నికైన ప్రెస్ క్లబ్ కమిటీ సభ్యులను అభినందించారు. ఆయన మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ భవనం ఆధునీకరణ కోసం ఆర్ అండ్ బి అధికారులతో ఎస్టిమెట్స్ చేయించాలని సూచించారు. ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నరేందర్ చారి, ప్రధాన కార్యదర్శి నరేందర్ గౌడ్, కోశాధికారి యాదయ్య, అదనను కార్యదర్శులు చింతకాయల వెంకటేశ్, ధరణి, సతీష్ కుమార్, రామకొండ, షాబుద్దీన్, ఆహాద్ సిద్ధికి, రవీందర్ రెడ్డి, కిషోర్ కుమార్, శివ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక సంబంధాల్లో క్రీడల పాత్ర కీలకం



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** యువతలో సామాజిక సంబంధాలు మెరుగుపర్చడంలో క్రీడాపోటిలు కీలకపాత్ర వహిస్తాయని బిసి జనచైతన్య జాతీయ అధ్యక్షుడు జయ్‌కుమార్‌యాదవ్, మాజీమార్కెట్‌చైర్మన్ గంగ న మోని కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో ఆదివారం ఉ మ్మడిజిల్లాస్థాయి క్రికెట్‌పోటిలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లోపాల్గొనే యువతకు మానసిక, శారీరక ఆరోగ్యంతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన సమవయస్కుల పరిచయంతో నూత న విషయాలపట్ల అవగాహన పెంపొందించుకొని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు.క్రీడాస్పూర్తి ప్రదర్శించాలని సూచించారు. అంతకుముందు ఆపరేషన్ సింధూర్‌లో భాగంగా పాకిస్తాన్ జరిపినదాడుల్లో దేశరక్షణకై వీరమరణంపొందిన జవాన్ మురళినాయక్‌ను స్మరించుకుంటూనివాళులర్పించారు. గెలుపొందిన జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.50 వేలనగదుతోపాటు ట్రోఫీ, రెండో బహుమతిగా రూ.25వేలనగదు, ట్రోఫీ, ప్రతిమ్యాచ్‌కు మ్యాన్‌ఆఫ్‌దమ్యాచ్ అవార్డు,బెస్ట్‌బ్యాట్స్‌మెన్, బెస్ట్‌బౌలర్, బెస్ట్‌ఫీల్డర్, బెస్ట్‌కీఫర్‌వంటి ప్రోత్సాహక బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు నరేందర్‌గౌడ్, అజీమ్, జహంగీర్, అనిల్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో పిఎసిఎస్‌చైర్మన్ నాయినోళ్లబాల్‌రాజు గౌడ్, జిల్లామాజీ విద్యాశాఖ అధికారి విజయ్‌కుమార్, మత్స్యకారసహకార సంఘం జిల్లా అధ్యక్షుడువాకిటిఆంజనేయులు, బిఆర్‌ఎస్ మండల యూత్ ప్రెసిడెంట్ ముదావత్‌రామునాయక్, శ్రీనివాసులు, గోవిందు, నాగరాజు, చంద్రశేఖర్, బాలరాజు, సత్యశీలసాగర్, రఘుబాబు, శ్రీశైలం, సత్యం పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కు పంపిణీ



**ప్రజాపక్షం/ కొత్తకోట:** దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తకోట మున్సిపాల్టీ పరిధిలోని 4వ వార్డులో నివాసం ఉంటున్న కండినేని భాస్కర్‌కు ముఖ్యమంత్రి సహయనిధి చెక్కును అందజేశారు. మాజీ సర్పంచ్ అరుణ, శ్రీనివాస్ , ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, జేసిబి రాము, నవీన్ కుమార్‌రెడ్డి, దిలీప్‌కుమార్‌రెడ్డి, శ్యాంకుమార్, లబ్ధిదారునికి చెక్కును అందజేయడం జరిగింది.

# అన్ని క్రీడల్లోనూ రాణిస్తేనే ప్రత్యేక గుర్తింపు



### మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

**ప్రజాపక్షం/ మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ ఆత్మకూరు మండలం మోట్లంపలి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గ్రామస్థాయి క్రికెట్ ప్రీమియర్ లీగ్ టెన్నిస్ బాల్ టోర్నమెంట్‌లో విజయం సాధించిన విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన ఆరేపల్లి, ద్వితీయ స్థానం సాధించిన దేవరపల్లి జట్లకు నగదుతో పాటు ట్రోఫీని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ క్రికెట్ ఏ కాకుండా ఏ ఆటల్లో నైనా మనం లోతుగా ఆలోచన చేసి ఉంటేనే విజయం సాధిస్తామని అన్నారు. అదే విధంగా ఇక్కడున్నటువంటి క్రీడాకారులు భవిష్యత్తులో క్రికెట్ ఒక్కటే కాకుండా మరెవైన క్రీడల్లోనైనా సరేముందుకు వెళ్లాలని ఉన్న ప్రతిఒక్కక్రీడాకారునికి తన వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని, మీకు ఎల్లవేళలా తోడుగా ఉంటానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పరమేశ్వర్, రహమతుల్లా,తులసి రాజ్ యాదవ్,నల్గోండశ్రీను, చెన్నయ్య సాగర్, గంగాధర్‌గౌడ్, ఆనంద్‌గౌడ్, రవికుమార్, కల్లూరు గోవర్ధన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులుఉన్నారు.

## '5'వ విజేతగా గోకమల్లఫైటర్స్..



**ప్రజాపక్షం/వెల్దండ :** మండలపరిధిలో రాచూర్ గ్రామంలో జరిగిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. రాచూర్ ప్రీమియర్‌లీగ్(ఆర్పిల్) క్రికెట్ టోర్నమెంట్ 5 విజేతగా గోకమల్లపైటర్స్ నిలిచింది. ద్వితీయస్థానంలో చేతనస్రైకర్స్, తృతీయస్థానంలో శివాజివారియర్స్ టీమ్‌లకు కల్వకుర్తి మార్కెట్‌కమిటిచైర్మన్ మనిలాసంజీవ్‌యాదవ్, గున్నేళ్ల శ్రీనివాస్‌లు రూ.30వేల నగదుతోపాటు షీల్డ్‌ను అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచినజట్టుకు రూ.20వేల నగదు షీల్డ్‌ను మాజీసర్పంచ్ రామచంద్రారెడ్డి అందజేశారు. తృతీయ విజేతకు రూ.15వేలు షీల్డ్‌ను మేఘన ఫౌండేషన్ నిర్వాహకులు కరుణాకర్ దంపతులు అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు గోకమల్లరాజు, మల్లోజురాజు, కృష్ణమాచారి, శ్రావణ్, సాయి, దుబ్బవెంకటేష్, నాగరాజు, అనిల్, ప్రహ్లాద్, రవి, వెంకటేష్, నాయకులు పర్వతాలు, వెంకటయ్య, రాధాకిషన్‌గౌడ్, క్రాంతి, బాలకృష్ణ, పాండు, శివ, క్రీడాకారులు పాల్గొన్నారు.

# క్రీడ

## 16 నుంచి ఐపిఎల్ మ్యాచ్‌లు..

### ఫైనల్ వేదిక మార్పు..!

క్రికెట్ అభిమానులకు గుడ్‌న్యూస్. ఐపీఎల్ 18వ సీజన్ త్వరలోనే తిరిగి ప్రారంభం కానుంది. భారత్, పాకిస్థాన్‌లు కాల్పుల విరమణకు అంగీకరించడంతో తదుపరి మ్యాచ్‌ల నిర్వహణకు బీసీసీఐ సిద్ధమవుతోంది. మే 16వ తేదీ నుంచి లీగ్‌ను పునరుద్ధరించాలని బీసీసీఐ భావిస్తోంది. అందుకోసం త్వరలోనే కొత్త షెడ్యూల్ ప్రకటించనుంది. ఫైనల్ ఫైట్ మే 30న లేదంటే జూన్ 1 న జరుగునందని సమాచారం.



అయితే.. ముందగా నిర్ణయించినట్టు ఫైనల్ మాత్రం ఈడెన్ గార్డెన్స్‌లో జరగదనే వార్తలు వినిపిస్తున్నాయి. సరిహద్దుల్లో ఉద్రిక్తతల కారణంగా ఐపీఎల్‌ను వారం రోజులు వాయిదా వేస్తున్నట్టే మే 9న బీసీసీఐ ప్రకటించింది. పరిస్థితులు ఇలానే కొనసాగితే లీగ్‌ను మొత్తానికే రద్దు చేయడం లేదా దక్షిణాది రాష్ట్రాల్లో నిర్వహించాలని భారత బోర్డు భావించింది. అయితే.. మే 10న ఇరుదేశాలు కాల్పుల విరమణకు అంగీకరించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. దాంతో, మే 16, 17 నుంచి లీగ్‌ను జరిపేందుకు బీసీసీఐ సన్నాహకాలు చేస్తోంది. ఇదే విషయమై ఐపీఎల్ ఫ్రాంచైజీలకు సమాచారాన్ని ఇచ్చింది బీసీసీఐ.

'కాల్పుల విరమణ వార్త తెలియగానే ఐపీఎల్ చైర్మన్, బీసీసీఐ అధికారులు సమావేశం అయ్యారు. వాయిదా పడిన ఐపీఎల్ పునరుద్ధరణపై ఆదివారం సుదీర్ఘంగా చర్చించారు. ఫ్రాంచైజీలతో పాటు, బ్రాండ్‌కాస్టింగ్ సంస్థలతో మాట్లాడి కొత్త షెడ్యూల్‌ను ప్రకటిస్తాం. అందరూ కోరుకుంటున్నట్టే లీగ్‌ను త్వరితగతిన పునరుద్ధరించేందుకు ప్రయత్నిస్తున్నాం' అని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా వెల్లడించాడు.

#### హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1

ఐపీఎల్ కొత్త షెడ్యూల్ వస్తే.. లక్నోలోని ఏక్నా స్టేడియం వేదికగా లక్నో సూపర్ జెయింట్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో క్రికెట్ పండుగ మళ్లీ అభిమానులను అలరించనుంది. హైదరాబాద్‌లో క్వాలిఫయర్ 1, కోల్‌కతాలో క్వాలిఫయర్ 2 జరిగే అవకాశముంది. మే 30 లేదా జూన్ 1 నిర్వహించే ఫైనల్‌తో విజేత ఎవరో తేలిపోనుంది. నాలుగు ప్లే ఆఫ్స్ బెర్తులకు 7 జట్లు పోటీపడుతున్న విషయం తెలిసిందే.

## శ్రీలంక చిత్తు..

### ముక్కోణపు వన్ డే సిరీస్

## భారత్ విజయం



విధ్వంసక సెంచరీతో జట్టు విజయంలో భాగమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును స్వీకరించింది.

వన్డే వరల్డ్ కప్ ముందు భారత మహిళల జట్టు అద్భుత విజయం సాధించింది. ముక్కోణపు సిరీస్ ఫైనల్లో శ్రీలంకను చిత్తుగా ఓడించింది. ఆదివారం జరిగిన టైటిల్ పోరులో స్మృతి మంధాన (116) సూపర్ సెంచరీతో భారీ స్కోర్ చేసిన టీమిండియా.. అనంతరం ప్రత్యర్థిని 245 పరుగులకే ఆలౌట్ చేసింది. దాంతో, 97 పరుగులతో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన జయభేరి మోగించింది. తద్వారా నిరుడు ఆసియా కప్ ఫైనల్లో ఎదురైన ఓటమికి భారత్ ప్రతీకారం తీర్చుకుంది. ముక్కోణపు సిరీస్‌లో లీగ్ దశ నుంచి అదరగొట్టిన టీమిండియా ఫైనల్లో పంజా విసిరింది. బలమైన శ్రీలంకను చిత్తు చిత్తుగా ఓడించి ఆసియా కప్ ఓటమికి బదులు తీర్చుకుంది. ప్రేమదాస స్టేడియంలో ఓపెనర్ స్మృతి మంధాన(116) రికార్డు సెంచరీతో విరుచుకు పడగా.. బౌలర్లు లంక బ్యాటర్లకు దడ పుట్టించారు. అమన్‌జీత్ కౌర్ (354) నిప్పులు చెరగగా.. మిడిల్ ఓవర్లలో స్నేహ్ రానా(438) వికెట్ల వేట కొనసాగించింది. దాంతో, ఆతిథ్యలం 245 పరుగులకే ఆలౌటయ్యింది. విధ్వంసక సెంచరీతో జట్టు విజయంలో భాగమైన మంధాన 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'గా ఎంపికైంది. ఈ సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్నేహ్ రానా 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డును స్వీకరించింది. లీగ్ దశలో శ్రీలంకను ఓడించి.. ఆ తర్వాతి పోరులో ఓడిన భారత్ ఫైనల్లో ఛాంపియన్ ఆటతో రెచ్చిపోయింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన టీమిండియాకు ఓపెనర్లు ప్రతీకా రావల్ (30), స్మృతి మంధాన(116 101 బంతుల్లో 15 ఫోర్లు, 2 సిక్సర్లు) శుభారంభం ఇచ్చారు. ఆ తర్వాత హర్లీన్ డయోల్(47), జెమీమా రోడ్రిగ్స్(44) కెప్టెన్ హర్మన్‌ప్రీత్(41)లు లంక బౌలర్లను ఉతికేశారు. మిడిలార్డర్ మెరుపులతో ప్రత్యర్థికి 343 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది భారత్. ఛేదనలో అమన్‌జోత్ కౌర్ చెలరేగడంతో శ్రీలంక టాపార్డర్ విఫలమైంది.

#### మలుపు తిప్పిన రానా

లంక ఓపెనర్ హాసినీ పెరీరా(0)ను డకౌట్ చేసిన అమన్‌జోత్.. ఆ తర్వాత డేంజరస్ విష్మీ గుణరత్నేను బౌల్డ్ చేసింది. ఓపెనర్ల వైఫల్యంతో కష్టాల్లో పడిన జట్టును కెప్టెన్ చమరి ఆటపట్టు(51), నీలాక్షి డిసిల్వా(48) ఆదుకున్నారు. వీళ్లిదరూ 50 ప్లస్ భాగస్వామ్యంతో భారత బౌలర్లను విసిగించారు. ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని స్నేహ్ రానా విడదీసింది. ఆటపట్టును బౌల్డ్ చేసిన తను మ్యాచ్‌ను మలుపు తిప్పింది. ఆ తర్వాత సమరవిక్రమ(26), అనుష్కా సంజీవని(28)లు పోరాడినా రానా తిప్పేయడంతో లంక ఆలౌట్ అంచున నిలిచింది. ఈ ఆల్‌రౌండర్ అనుష్క వికెట్ తీయడంతో లంక 245 పరుగులకే కుప్పకూలింది. దాంతో, భారత జట్టుకు 97 పరుగుల భారీ విజయం సొంతమైంది.

### దోహా డైమండ్ లీగ్‌లో నీరజ్..

### బరిలో ముగ్గురు భారత అథ్లెట్లు!

భారత్, పాకిస్థాన్‌ల మధ్య ఉద్రిక్తతల కారణంగా ఎన్‌సీ క్లాసిక్‌ను వాయిదా వేసిన నీరజ్ చోప్రా ప్రతిష్ఠాత్మక దోహా డైమండ్ లీగ్‌లో బరిలోకి దిగుతున్నాడు. ఇప్పటికే ఈ లీగ్‌లో రెండు పతకాలు కొల్లగొట్టిన నీరజ్.. టైటిల్‌పై గురిపెట్టాడు. మే 16న ఈ టోర్నీ మొదలవ్వనున్న ఈ పోటీల్లో బడిసె వీరుడితో పాటు భారత్‌కు చెందిన మరో ముగ్గురు పాల్గొననున్నారు. జావెలిన్ త్రోలో కిశోర్ జెనా తన అదృష్టాన్ని పరీక్షించుకోనున్నాడు. నిరుడు 9వ స్థానంతో నిరాశపరిచిన అతడు పతకంపై కన్నేశాడు. జాతీయ రికార్డు నెలకొల్పిన గల్వీర్ సింగ్ 5 వేల మీటర్ల పరుగులో.. మహిళల విభాగంలో పరుల్ చౌదరీ 3000 మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో బరిలోకి దిగుతున్నారు. కానీ, ఈసారి కూడా



అతడికి ఒలింపిక్ కాంస్య పతక విజేత అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా), 2024 విన్నర్ జాకబ్ వాద్లెక్(చెక్ రిపబ్లిక్)లతో గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. జర్మనీ అథ్లెట్లు జులియన్ వెబర్, మాక్స్ డెహ్నింగ్, జులియస్ యెగో(కెన్యా), రోడెరిక్ డీన్(జపాన్)లు పాల్గొంటున్నారు

## 'సిందూరం' ఎక్కడని ప్రపంచం అడుగుతోంది

### అమితాబ్ బచ్చన్ ఎమోషనల్ పోస్టు



పహల్గాం ఉగ్రదాడి ఘటన అందరినీ కలచివేసింది. ఆ హృదయవిదారక ఘటనపై ప్రముఖ నటుడు అమితాబ్ బచ్చన్ తాజాగా ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. కళ్ల ముందే భర్తను పోగొట్టుకున్న నవ వధువు శోకాన్ని ఉద్దేశిస్తూ తన తండ్రి రాసిన పద్యంలోని ఓ లైన్‌ని ప్రస్తావించారు. "భార్యతో కలిసి విహార యాత్రకు వెళ్లిన భర్తను ఉగ్రమూక కాల్చి చంపింది. భర్తను చంపొద్దంటూ భార్య ఏడుస్తూ ఎంతగా వేడుకున్నా ఆ ఉన్మాది వినలేదు. ఆమె నుదుట సిందూరం లేకుండా చేశాడు. కళ్ల ముందే భర్త చనిపోవడాన్ని తట్టుకోలేని ఆమె 'నన్ను కూడా చంపేయ్' అంటూ మోకరిల్లింది. అప్పుడు ఆ రాక్షసుడు.. 'నిన్ను చంపను. వెళ్లి ... చెప్పుకో'' అంటూ పొగరు చూపించాడు'' "కుమార్తెలాంటి ఆమె మానసిక స్థితి చూస్తే.. "ఆమె వద్ద చితా భస్మం ఉన్నా సిందూరం ఎక్కడని ప్రపంచం అడుగుతుంది'' అని నాన్న రాసిన పద్యంలోని లైన్ గుర్తొచ్చింది. 'అందుకే నేను సిందూరం ఇస్తున్నా.. ఆపరేషన్ సిందూర్' అని తాజాగా ప్రభుత్వం చేపట్టిన సైనిక చర్యను ప్రస్తావించారు. జైహింద్. భారత సైన్యమా.. నువ్వు ఎప్పటికీ వెనకడుగు వేయవు. నీ ప్రయాణం ఎప్పటికీ ఆగదు'' అని పేర్కొన్నారు.

## దర్శకుడిగా విశ్వక్ సేన్



మాస్ హీరో విశ్వక్ సేన్‌కి హీరోగా మంచి ఫాలోయింగ్ ఉంది. పైగా అటు దర్శకుడిగానూ గుర్తింపు తెచ్చుకున్న విషయం తెలిసిందే. విశ్వక్ సేన్ దర్శకత్వంలో వచ్చిన 'ఫలక్‌నుమా దాస్', 'దాస్ కా ధమ్కీ' చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. తాజాగా విశ్వక్ సేన్ మరోసారి మెగాఫోన్ పట్టేందుకు రెడీ అయ్యారు. '#కల్ట్' సినిమా రూపొందిస్తున్నారు. నూతన నటీనటులతో ఈ సినిమా రెడీ కాబోతుంది. కాగా తాజాగా '#కల్ట్' పూజా కార్యక్రమం హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోస్‌లో జరిగింది. నేటి నుంచి రెగ్యులర్ షూట్ కూడా జరగబోతుంది. కరాటే రాజు, సందీప్ కాకరాల సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రవి బస్రూర్ స్వరాలు అందించనున్నారు. ఈ చిత్రానికి తరుణ్ భాస్కర్ సంభాషణలు అందించబోతున్నారు. తెలుగుతోపాటు హిందీ, జపనీస్, స్పానిష్, ఇంగ్లిష్ భాషల్లో ఈసినిమా రిలీజ్ కాబోతుంది.

# రీల్

## ఆ వార్తల్లో 'నిజం' లేదు

– సుమంత్



నటుడు సుమంత్, నటి మృణాల్ ఠాకూర్ వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ ఇటీవల జోరుగా ప్రచారం జరిగింది. వీరిద్దరూ కలిసి దిగిన ఓ ఫొటో కూడా నెట్టింట వైరల్‌గా మారింది. వీటిపై తాజాగా సుమంత్ స్పష్టతనిచ్చారు. తన తదుపరి చిత్రం 'అనగనగా' ప్రమోషన్స్‌లో భాగంగా పెళ్లి వార్తలపై స్పందించారు. ఆయా వార్తల్లో నిజం లేదని పేర్కొన్నారు. సోషల్‌మీడియాను తాను పెద్దగా ఉపయోగించనని.. అందుకే ఈ వార్తలు తన దృష్టికి రాలేదని సుమంత్ తెలిపారు. నెట్టింట వైరల్‌గా మారిన ఫొటో తాము 'సీతారామం' ప్రమోషన్స్ సమయంలో తీసుకున్నామని వివరించారు. మరో ఇంటర్వ్యూలో ఆయన పెళ్లిపై మాట్లాడుతూ.. వైవాహిక బంధంలోకి మరోసారి అడుగుపెట్టే ఉద్దేశం లేదన్నారు. సుమంత్‌కు గతంలోనే వివాహం జరిగిన విషయం తెలిసిందే. నటి కీర్తి రెడ్డిని పెళ్లి చేసుకున్నారు. కొంతకాలానికే వీరిద్దరూ విడిపోయారు.

## 'డ్రాగన్'లో శ్రద్ధా కపూర్?



ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్ కలయికలో రాబోతున్న 'డ్రాగన్' సినిమా పై రోజుకొక రూమర్ వినిపిస్తోంది. ఐతే, తాజాగా ఈ సినిమా గురించి వినిపిస్తున్న అప్ డేట్ ప్రకారం ఈ సినిమాలో మరో హీరోయిన్ కనిపించబోతుంది. ఓ కీలక పాత్ర కోసం శ్రద్ధా కపూర్‌ను తీసుకునే ఆలోచనలో టీమ్ ఉందని తెలుస్తోంది. ఆమె పాత్ర కథకు అనుగుణంగా సెకండ్ హాఫ్‌లో వస్తోందని టాక్. మరి ఈ వార్తలో ఎంతవరకు వాస్తవం ఉందో చూడాలి. కాగా 'డ్రాగన్' సినిమాని ఎన్టీఆర్ కెరీర్‌లోనే అత్యుత్తమ సినిమాల్లో ఒకటిగా చేయాలని ప్రశాంత్ నీల్ ప్రయత్నం చేస్తున్నాడట. అందుకే, ఈ సినిమా స్క్రిప్ట్ కోసం ప్రశాంత్ నీల్ చాలా టైమ్ తీసుకున్నాడు. కాబట్టి, ఇప్పటి వరకూ ప్రశాంత్ నీల్ తీసిన అన్ని సినిమాల్లోకల్లా బెస్ట్ సినిమా ఇదే అవుతుందని అంచనాలు ఉన్నాయి. ఆ మధ్య ఈ సినిమా గురించి ప్రశాంత్ నీల్ మాట్లాడుతూ.. 'ఆడియన్స్ ఊహించని స్థాయిలో ఈ మూవీని తీస్తున్నాను. ఎన్టీఆర్ పై అభిమానంతో ఈ సినిమా చేస్తున్నాను అని చెప్పుకొచ్చాడు. మొత్తానికి భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న 'ప్రశాంత్ నీల్ – ఎన్టీఆర్' సినిమా గురించి నిత్యం ఏదొక రూమర్ వినిపిస్తూనే ఉంది. మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ సినిమాని నిర్మిస్తున్నాయి. ఈ సినిమాకు రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు.




## ప్రభుత్వాలు మారినా ప్రజల బతుకులు మారలేదు

### ప్రజా సమస్యల పరిష్కారనికై పోరాటాలు నిర్వహించాలి

### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/బెజ్జంకి:** ప్రభుత్వాలు మారిన ప్రజల బతుకులు మాత్రం మారడం లేదని ఏ ప్రభుత్వం అధికారం చేపట్టిన ప్రజలకు కూడు, గుడ్డ, విద్య, వైద్యం అందించవలసిన భాధ్యత పాలకులదే అని లేదని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు కా.చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ఆదివారం మెదక్ జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో సిపిఐ 13వ మండల మహసభ నిర్వహించగా ఈ మహసభకు ముఖ్య అతిథిగా వారు హాజరై పార్టీ జెంధాను ఆవిష్కరించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోతిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన మహసభలో ఆయన మాట్లాడారు. భారత దేశంలో విభిన్న మతాలు, సాంస్కృతులు, సాంప్రదాయాలు, భాషలు, భావాలు నిలయంగా ఉన్న దేశమని దేశంలో భిన్నత్వంలో ఏకత్వమని రాజ్యాంగంలో మనకు హక్కులు కల్పించారని పాలకులు దీనిని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం అమలు అవుతుందంటే ఆ ఘనత ఎర్రజెండా పార్టీకే దక్కుతుందన్నారు. కార్మిక హక్కుల పరిష్కారమే ధ్యేయంగా శ్రమకు తగ్గ ఫలితం కోసం ఏఐటియూసి ఆధ్వర్యంలో 20న తలపెట్టనున్న సార్వత్రిక సమ్మెకు సిపిఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. ప్రజా సమస్యలను తెలుసుకోని వాటిని అమలయ్యే దిశగా ప్రజల పక్షాన సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. అనంతరం సిద్దిపేట సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో దున్నేవాడికే భూమి అనే నినాదంతో భూమి లేని నిరుపేదలకు లక్షల ఎకరాల భూములను పంచిన ఘనత వెట్టి చాకిరి విముక్తికి వ్యతిరేకంగా పోరాడిన చరిత్ర కేవలం భారత కమ్యూనిస్టు పార్టీకే ఉందన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు అండగా ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సిపిఐపార్టీ పనిచేస్తుందన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి బోనగిరి రూపేష్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కనుకుంట్ల శంకర్, సంగెంమధు, ఏఐటియూసి జిల్లా అధ్యక్షులు కిష్టపురం లక్ష్మణ్, పార్టీ నాయకులు, కార్యకర్తలు, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

### భారత సైనిక బలగాలు రావల్పిండిలోనూ

## బలాన్ని చాటాయ్

### లక్నోలో బ్రహ్మోస్ ఉత్పత్తి యూనిట్‌ను ప్రారంభించిన కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్

### ఇండియన్ ఆర్మీ పాకిస్థాన్ సైనిక స్థావరాలపై దాడికి మాత్రమే పరిమితం కాలేదని వెల్లడి





**న్యూఢిల్లీ :** భారత సైనిక బలగాలు 'ఆపరేషన్ సిందూర్' కింద సరిహద్దు సమీపంలోని పాకిస్థాన్ సైనిక స్థావరాలపై దాడి చేయడానికే పరిమితం కాకుండా పాకిస్థాన్ సైనిక ప్రధానకార్యాలయం ఉన్నటువంటి రావల్పిండిలోనూ వారి బలాన్ని చాటాయని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కితాబు ఇచ్చారు. పహల్గామ్ ఉగ్రదాడి ద్వారా అనేక కుటుంబాలను తుడిచిపెట్టిన ఉగ్రవాదులు, భారత వ్యతిరేక శక్తులను భారత సైన్యం శిక్షించిందని ఆయన చెప్పారు. ఆదివారం లక్నోలో బ్రహ్మోస్ ఉత్పత్తి యూనిట్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన ఒక కార్యక్రమంలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, అది ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతదేశ రాజకీయ, సామాజిక, వ్యూహాత్మక సంకల్పానికి ఒక ప్రతీక అన్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయడం ద్వారా భారత్ ఆపరేషన్ సిందూర్‌ను మే 7న ప్రారంభించిందన్నారు. పాకిస్థాన్ చేసిన నేరపూరిత ఉగ్రదాడులకు ప్రతీకారచర్యలను ఆపరేషన్ సిందూర్ ద్వారా నిర్వహించడం జరిగిందని రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టంచేశారు. భారత్‌పాకిస్థాన్ శనివారం ఒక అవగాహనకు వచ్చి, ఇరుదేశాలు కూడా అన్ని రకాల కాల్పులు, సైనిక చర్యలను భూమి, గగనతలం, సముద్రం మీద నిలిపివేయాలని ప్రకటన చేసినట్లు మంత్రి చెప్పారు. దేశవ్యాప్తంగా భారత సైన్యాన్ని 'ఆపరేషన్ సిందూర్'ను విజయవంతం చేసినందుకు అభినందనలలో ముంచెత్తుతున్నారని రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. భారతదేశంలో ఉగ్రదాడులకు పాల్పడితే భారత బలగాల నుంచి ఎటువంటి పరిణామాలు ఎదురవుతాయనేది యావత్ ప్రపంచం ఇటీవల చూసిందని మంత్రి వివరించారు. ఉరి సంఘటన తర్వాత భారత సైన్యం ఏవిధంగా పాకిస్థాన్‌లోకి ప్రవేశించి సర్జికల్ స్ట్రైక్స్ చేశాయన్నది చూశారని, పుల్వామా దాడి తర్వాత బాలకోట్‌లో వైమానిక దాడులు ఏవిధంగా చేశారన్నది చూశారని, పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత భారత్ పాకిస్థాన్‌లోకి ప్రవేశించి బహుళ దాడులను ఏవిధంగా నిర్వహించారన్నది యావత్ ప్రపంచం చూసిందని రాజ్‌నాథ్ విపులీకరించారు.ఉగ్రవాదానికి వ్యతిరేకంగా 'జీరో టోలరెన్స్‌ను' అనుసరించడం భారత్ విధానం అని, మన భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని నూతన భారతదేశం సరిహద్దుకు ఇరువైపులా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఎలాంటి సమర్థవంతమైన చర్యలను తీసుకుంటుందన్నది స్పష్టమైందని ఆయన వివరించారు.

#### బ్రహ్మోస్ క్షిపణి ఒక ఆయుధం కాదు.. భారత సైనిక బలగాల బల సందేశం : రాజ్‌నాథ్‌సింగ్

బ్రహ్మోస్ కేవలం ఒక ఆయుధం కాదని, భారత సైనిక బలగాల 'బలం సందేశం' అని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. లక్నోలో ఆదివారం సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ వ్యవస్థ అతిపెద్ద ఇంటిగ్రేషన్ టెస్టింగ్ ఫెసిలిటీని ఆయన ప్రారంభించిన సందర్భంగా తన సందేశం ఇచ్చారు.'బ్రహ్మోస్ ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ మిస్సైల్స్. బ్రహ్మోస్ అనేది ఒక ఆయుధం కాదు, కానీ అది తనకు తాను ఇచ్చే ఒక సందేశం. మన సైనిక బలగాలకు సంబంధించి ఒక బల సందేశం. శత్రువుల పట్ల ఒక సందేశం. సరిహద్దులను సురక్షితంగా కాపాడుకోవడంలో ఒక సందేశం' అని రాజ్‌నాథ్ సింగ్ చెప్పారు.

## మే 15 నుంచి కాళేశ్వరం త్రివేణి సరస్వతి పుష్కరాలు

### దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ఈ నెల 15 నుంచి కాళేశ్వరం త్రివేణి సరస్వతి పుష్కరాలు ప్రారంభమవుతున్నాయని దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రతి 12 ఏళ్లకోసారి వచ్చే ఈ మహా పుష్కర మహోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం ఎంతో భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహిస్తోందన్నారు. త్రివేణి సంగమంలో పుణ్యస్నానానికి, ఆధ్యాత్మిక ఆరాధనలకు వచ్చే లక్షలాది భక్తులకు దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో భారీ స్థాయిలో అన్ని వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. ఈ పుష్కరాల్లో ప్రతిరోజూ సరస్వతీ హోమం, రుద్ర హోమం మరియు ప్రత్యేక పూజలు ప్రముఖ పీఠాధిపతుల సమక్షంలో జరగబోయే ఈ చారిత్రక మహోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు.

## పుతిన్ సంసిద్ధత

(మొదటి పేజీ తరువాయి)

శాంతి చర్చలు జరుగుతాయని పుతిన్ చెప్పారు. ముప్పైరోజుల పాటు ఉక్రేన్‌లో కాల్పుల విరమణ విషయంపై చర్చించేందుకు యూరోపియన్ యూనియన్ దేశాల నాయకులు కీవ్‌లో సమావేశమైన కొద్ది గంటల తర్వాత శనివారం అర్ధరాత్రి పుతిన్ ఈ శాంతి చర్చల ప్రతిపాదన చేశారు. పుతిన్ ప్రకటన చేసిన వెంటనే ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెడుతూ, ఉక్రేన్–రష్యాలకు ఇదెంతో గొప్పదినమన్నారు. వేలాదిమంది మరణాలకు దీనివల్ల తెరపడుతుందన్నారు. రెండు దేశాల తరపున తన కృషిని కొనసాగిస్తానన్నారు. ఉక్రేన్ సంక్షోభానికి నిజమైన పరిష్కారం సాధించాలనే ఉద్దేశంతోనే పుతిన్ ఈ శాంతి చర్చల ప్రతిపాదన చేశారనీ, శాంతి సాధనకు ఆయనకున్న ఆలోచలకు ఇది ప్రతిబింబమని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి ద్మీత్రీ పెస్కోవ్ ఆదివారం చెప్పారు. ఉద్ధృతమైన చర్చల ద్వారా మాత్రమే శాంతిని సాధించవచ్చుననే ఉద్దేశంతో ఈ ప్రతిపాదన చేశారన్నారు. 2022 చివరిలో శాంతి చర్చలకు భంగం కలిగించిన విధంగా ఈసారి కూడా ఉక్రేన్ ప్రవర్తించకూడదని ఆయన అన్నారన్నారు. పుతిన్ మద్దతు ఇస్తున్న శాంతి చర్చల్లో ఎన్నో ప్రశ్నలు ఉన్నాయని, వాటికి సమాధానాలు కావాలని ఆయన అన్నారు. వారు కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నారుతప్ప, ప్రశ్నలకు సమాధానాలు చెప్పడానికి సిద్ధంగా లేరన్నారు. ఈ పరిస్థితుల్లో రష్యా సైన్యం ఆత్మవిశ్వాసంతో తాత్కాలికంగా యుద్ధరంగంలో ముందుకు దూసుకుపోతోందన్నారు. "ఇష్టపడేవారికి కూటమి'' శనివారంనాడు సమావేశమై, 30 రోజులపాటు ఉక్రేన్‌లో కాల్పుల విరమణకు అన్ని దేశాలు బేషరతుగా అంగీకరించాయని, రష్యా అధ్యక్షుడు పుతిన్‌పై ఈ విషయంలో తీవ్రమైన ఒత్తిడి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించాయి. తర్వాత పుతిన్ సానుకూలంగా స్పందించారు.

#### నేటి నుండే విరమించాలి

#### చర్చలకు నేను రెడీ: జెలెన్‌స్కీ

పుతిన్‌ను కలుసుకుని ప్రత్యక్ష చర్చలు జరిపేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఉక్రేన్ అధ్యక్షుడు వి.జెలెన్‌స్కీ అన్నారు. చర్చలకు ముందుగానే కాల్పుల విరమణ పాటించాలని కోరారు. ఒక్కరోజు కూడా యుద్ధంచేసి హత్యలు చేయడానికి తాము సిద్ధంగా లేమని అన్నారు. 15వ తేదీ వరకూ ఆగకుండా 12వ తేదీ నుండే కాల్పుల విరమణ అమలుకు పుతిన్ సిద్ధం కావాలన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు రష్యా చేస్తున్న ఈ ఆలోచన ఎంతో సానుకూలమైన విషయమని ఆయన అన్నారు. యావత్ ప్రపంచం ఎంతోకాలంగా ఉక్రేన్‌లో యుద్ధ పరిష్కారం కోసం ఎదురుచూస్తోందని ఆయన అన్నారు. ఏ యుద్ధాన్ని అయినా ముగించాలంటే ముందుగా కాల్పుల విరమణతో ప్రారంభం చేయాలని, ఈ శుభారంభం రేపు సోమవారం నుండి ప్రారంభం కావాలని ఉక్రేన్ ఆశిస్తోందని ఆయన అన్నారు. యూరప్ దేశాల "ఇష్టపడేవారి కూటమి'' నాయకులు కూడా, సోమవారం నుండి 30 రోజుల కాల్పుల విరమణకు రష్యాపై ఒత్తిడి తేవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు విజ్ఞప్తి చేశారు.

#### పుతిన్‌ను జెలెన్‌స్కీ సరిగ్గా అర్థం చేసుకోలేదు

పుతిన్‌ను ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ సరిగ్గా అర్థం చేసుకోలేదని రష్యావిదేశాంగమంత్రిత్వశాఖ అధికార ప్రతినిధి మారియా జఖరోవా అన్నారు. "పుతిన్ ప్రకటనపై జెలెన్‌స్కీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడే మా దృష్టికి వచ్చాయి. కానీ పుతిన్‌ను జెలెన్‌స్కీ సరిగ్గా అర్థం చేసుకోవాలి, ఉక్రేన్‌లో యుద్ధానికి గల మూల కారణాల గురించి మొదట చర్చించాలనేది రష్యా అధ్యక్షుడి ఉద్దేశం, ఇస్తాంబుల్‌లో ఉక్రేన్ యుద్ధానికి గల మూల కారణాలను చర్చించాలి, ఆ తర్వాతే కాల్పుల విరమణకు సంబంధించిన చర్చలు జరుగుతాయి'' అని ఆమె వివరణ ఇచ్చారు. ఇదిలా ఉండగా రష్యా విదేశాంగశాఖ రాయబారి రోడియన్ మిరోష్నిక్ టెలిగ్రామ్‌లో ఒక పోస్టింగ్ పెడుతూ, జెలెన్‌స్కీ కాల్పుల విరమణను కోరడం అంటే దాని అర్థం తిరిగి మరిన్ని బలమైన ఆయుధాలు సమకూర్చుకోవడానికి కొంత విరామాన్ని కోరడమేనని విమర్శించారు.




Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com